గురువారం
31-10-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 40
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

1న న్యూయార్క్ స్కూళ్లకు దీపావళి సెలవు

న్యూయార్క్: న్యూయార్క్ నగర బడులకు నవంబరు ఒకటో తేదీన దీపావళి సెలవు ఇచ్చారు. భారత సంతతి నేతల దీర్ఘకాల కృషి ఫలితంగా దీపావళి పండుగకు గుర్తింపు లభించిందని, నగరంలోని మిలియన్ మంది పిల్లలు పండుగ రోజున సెలువు తీసుకోగలరని, సంబరాల్లో పాల్గొనగలరని మేయర్ కార్యాలయంలో అంతర్జాతీయ వ్యవహారాల డిప్యూటీ కమిషనర్ దిలీప్ చౌహాన్ అన్నారు. వాషింగ్టన్‌లో అధ్యక్షుడు జో బైడెన్ దంపతుల అధ్వర్యంలో ఈనెల 28న శ్వేతసౌధంలో దీపావళి సంబరాలు జరిగాయి. భారత సంతతి అమెరికన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్వేతసౌధం నుంచి దీపావళి శుభాకాంక్షలు అంటూ ట్వీట్‌లు చేశారు.

పసిడి ధరకు రెక్కలు

న్యూఢిల్లీ: దీపావళి వేళ బంగారం ధర మరోసారి పెరిగింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.82 వేల మార్కును దాటింది. పండుగ సమయంలో డిమాండ్ దృష్ట్యా కొనుగోళ్లు పెరగడమే ఇందుకు కారణమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అమెరికా అధ్యక్ష ఎన్నికలు కూడా అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ పెరగడానికి కారణమని విశ్లేషిస్తున్నారు. ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం (99.9 శాతం) ధర బుధవారం రూ.వెయ్యి పెరిగి రూ.82,400కు చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం

- మిగతా 2 లో

అమరావతి రాజధాని డిజైన్లు యథాతథం

ఏపీ మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాజధాని అమరావతి నిర్మాణ డిజైన్లలో ఎలాంటి మార్పులు లేవని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిర్మాణంలో ఏఐ టెక్నాలజీ వాడుతామని చెప్పారు. అమరావతి అభివృద్ధి పనుల కోసం నవంబరు 15 నుంచి డిసెంబరు 31లోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. పాత టెండర్ల కాలపరిమితి ముగిసినందున న్యాయపరమైన చిక్కులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే జనవరి నుంచి సీఆర్డీఏ అధ్వర్యంలో రాజధాని అభివృద్ధి

- మిగతా 2 లో

సైనిక బలగాల ఉపసంహరణ పూర్తి

న్యూఢిల్లీ: లద్దాఖ్‌లోని డెప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో భారత్, చైనా సైనిక బలగాల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం పూర్తయినట్లు సైనిక వర్గాల వెల్లడించాయి. ఇక వాస్తావాధీన రేఖ వెంబడి ఇరు దేశాల సైనికుల సాధారణ గస్తీ (పెట్రోలింగ్) తర్వాలో ప్రారంభం కానుందని తెలిపాయి. అంతే కాకుండా దీపావళి సందర్భంగా గురువారం సరిహద్దులోని ఇరుదేశాల సమావేశాల పాయింట్ల వద్ద మిఠాయిలు పంచనున్నట్లు తెలిపాయి. అక్టోబర్ 25న మొదలైన

- మిగతా 2 లో

ఇదీ లోకం!

టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు

- 24 మందితో పాలక మండలి
- పొరుగు రాష్ట్రాల వారికీ చోటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్‌గా టీవీ 5 మీడియా సంస్థ అధినేత బీఆర్ నాయుడు నియమితులయ్యారు. చైర్మన్‌తోపాటు 24 మందితో టీటీడీ పాలక మండలి సభ్యులను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. బీఆర్‌నాయుడు రెండేళ్లపాటు చైర్మన్ పదవిలో కొనసాగుతారు. తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలిలో మొత్తం 24 మంది సభ్యులు ఉండగా... వారిలో 23 మందిని మాత్రమే ప్రకటించారు. బీజేపీ నుంచి మరో పేరు ప్రతిపాదన వచ్చిన వెంటనే ఆ సభ్యుడిని నియమించనున్నారు. టీటీడీ పాలక మండలిలో పొరుగు రాష్ట్రాల వారికి పెద్దపీట వేశారు. తెలంగాణ నుంచి ఐదుగురు, కర్నాటక నుంచి ముగ్గురు, తమిళనాడు నుంచి ఇద్దరు, గుజరాత్, మహారాష్ట్ర నుంచి ఒక్కొక్కరు చొప్పున పాలకమండలిలో ఉన్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలకు స్థానం కల్పించారు. టీటీడీ సభ్యులుగా ఎంఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే), వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు ఎమ్మెల్యే), జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట

- మిగతా 2 లో

'గాంధీ' కుటుంబం మాట తప్పదు

- చట్టాన్నే అమలుచేస్తా... వ్యక్తిగత అజెండాతో కాదు
- తనకు గుర్తింపు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే
- బీసీ కులగణనలో తెలంగాణ రోల్‌మోడల్: సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: తనకు ప్రత్యేక గుర్తింపు ఏమీ లేదని, కాంగ్రెస్ పార్టీనే గుర్తింపు ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మీరంతా కష్టపడితేనే నాకు ఈ పదవి దక్కిందని పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం బీసీ కులగణనపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే మరో చర్చకు తావు లేదన్నారు. చర్చకు అవకాశం ఇచ్చారంటే వారు పార్టీ ద్రోహులే అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడుతుందని ... సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారని, సెప్టెంబరు 17న తుక్కుగూడ సభలో సోనియాగాంధీ కూడా తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడంలో ఆమె సఫలీకృతం అయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసి ఇచ్చిన మాట నెరవేర్చారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టడం ఇక్కడున్న ప్రతిఒక్కరి బాధ్యత అని... అందులో రేవంత్ రెడ్డినా, మహేశ్ గౌడా అనేది విషయం కాదన్నారు. పార్టీ అజెండాతోనే ప్రజల్లోకి వెళ్లాం, పార్టీ విధానాన్ని అమలు చేయడమే మన ప్రభుత్వ విధాన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విధానాలతో సంబంధం ఉన్న నిరంజన్‌ని

బీసీ కమిషన్ చైర్మన్ గా నియమించుకున్నామని, పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా కూడా ప్రతీక్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ క్యాడర్, లీడర్స్ పై ఉందన్నారు. కులగణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది పరిశీలకులను నియమించాలని సూచించారు. దేశానికి తెలంగాణ ఒక రోల్‌మోడల్‌గా మారాలని, రాహుల్ గాంధీని ప్రధానిని చేసేలా ఉండాలని, ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ నుంచే మోదీపై యుద్ధం

నవంబరు 31లోగా కులగణన పూర్తి చేయాలని, తెలంగాణ నుంచే నరేంద్రమోదీపై యుద్ధం ప్రకటించాలని సీఎం రేవంత్ అన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం

- మిగతా 2 లో



కులగణన పరిశోధన కేంద్రంగా తెలంగాణ

సమాజంలో అన్ని వర్గాలకూ భాగస్వామ్యం

వనరులు, ఆస్తులు సమానంగా దక్కాలన్నదే ధ్యేయం: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: కులగణనకు తెలంగాణ రాష్ట్రం పరిశోధన కేంద్రంగా నిలిచి దేశానికి సందేశం ఇవ్వబోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ కీలక నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మన ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటించి అన్ని వర్గాల అభిప్రాయాలను తెలుసుకున్నారని వివరించారు. దేశ వనరులు, ఆస్తులు అందరికీ సమానంగా దక్కడం లేదని ఆయన గ్రహించారన్నారు. కులగణన ద్వారా సమస్యలు తెలుసుకుని చికిత్స చేసినప్పుడే భారత రాజ్యాంగాన్ని సంపూర్ణంగా అమలు చేసినట్లు అవుతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి... యావత్ క్యాబినెట్ సమావేశమై ఫిబ్రవరి నాల్గోతేదీ, 2024న కుల గణనకు తీర్మానం చేశామని వివరించారు. విస్తృత స్థాయిలో చర్చజరిపి ఏకగ్రీవ తీర్మానం

- మిగతా 2 లో

పేదలకు పట్టాలివ్వండి

భగత్‌సింగ్‌నగర్ కాలనీ వాసుల గోడు విన్న కూనంనేని

విశాలాంధ్ర-మేడిపల్లి: భగత్‌సింగ్ నగర్ కాలనీ పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మండలంలోని పీర్జాదిగూడ కాలనీలో బుధవారం సీపీఐ మండల మండల కార్యదర్శి రచ్చ కిషన్ పర్యవేక్షణలో జే లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ... సర్వే నెం 48లో ఉన్న భగత్‌సింగ్‌నగర్ కాలనీలో సుమారు 20 సంవత్సరాలుగా 150 పేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, కొంతమందికే పట్టాలు ఇచ్చారని, మిగతా వారికి పట్టాలిచ్చి కాలనీ

అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములు, చెరువులు, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, నాలాలు కబ్జా చేసినవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వక్ఫ్‌బోర్డ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండలంలో అనేక పార్క్ స్థలాలు కబ్జాకి గురి అయ్యాయని, వాటిని గుర్తించి ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, రాష్ట్రంలో బీసీ కులగణ సర్వే చేయాలని, మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలని

- మిగతా 2 లో

హామీలపై ప్రశ్నిస్తే కొడతారా?

- ఆ హక్కు పోలీసులకు ఎక్కడిది...
- రేవంత్ రెడ్డి వంటి వ్యక్తులకు భయపడేది లేదు
- బాధితుడికి ఫోన్ చేసి అండగా ఉంటామని కేటీఆర్ భరోసా

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రశ్నించే ప్రజలను కొట్టే హక్కు పోలీసులకు ఎక్కడిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తుల బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన సీఐపై న్యాయ పరంగా పోరాటం చేయటంతో పాటు బీసీ కమిషన్, హ్యూమన్ రైట్స్ కమిషన్ కు కూడా

వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు కోసం వాట్సాప్ ద్వారా ప్రశ్నించినందుకు భాస్కర్ ముదిరాజ్ అనే వ్యక్తిని

- మిగతా 2 లో

రష్యా అణు విన్యాసాలు

పశ్చిమ దేశాలకు ఓ హెచ్చరిక: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌తో పోరు కారణంగా పశ్చిమ దేశాలతో ఘర్షణాత్మక పరిస్థితులను రష్యా ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో తమ అణు శక్తిని ప్రదర్శనకు పెట్టాలని నిర్ణయించుకున్న ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజా అణ్వస్త్ర విన్యాసాలు నిర్వహించారు. తమ దేశ అణు శక్తిని చాటే విధంగా ఈ విన్యాసాలు నిర్వహించేలా సైన్యానికి ఆదేశాలిచ్చారు. రష్యా ప్రపంచంలోనే అతిపెద్ద అణుశక్తి దేశంగా. ప్రపంచంలో 88శాతం న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను రష్యా, అమెరికా దేశాలు నియంత్రిస్తాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం వల్ల నాటో దేశాలన్నీ రష్యాపై కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. ఉక్రెయిన్‌కు అండదండలు అందిస్తున్నాయి. దీర్ఘశ్రేణి ఆయుధ వ్యవస్థలను

- మిగతా 2 లో

టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే)కు చోటు దక్కింది. కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మీ, నర్సిరెడ్డి, సాంబశివరావు(జాస్తి శివ), నన్నపనేని శ్రీసదాశివరావు, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తిని నియమించారు. ఆర్ఎన్ దర్శన్, జస్టిస్ హెచ్ఎల్ దత్, శాంతారామ్, పి.రామ్మూర్తి, తమ్మిశెట్టి జానకీదేవి, బుంగనూరు మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీ, సుచిత్ర ఎల్లా, బూరగపు ఆనందసాయి, నరేశ్ కుమార్, డాక్టర్ అదిత్ దేశాయ్, సౌరభ్ హెచ్. బోరాను నియమించారు. టీటీడీ నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడును చంద్రబాబు అభినందించారు. సీఎం చంద్రబాబుకు బీఆర్ నాయుడు, సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమిచండం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.

'గాంధీ' కుటుంబం మాట తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా డీఎస్సీ పూర్తి చేసి ఉద్యోగ నియామక పత్రాలు అందించామని వివరించారు. 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు వెల్లడించారు. గ్రూప్-1 విషయంలోనూ ప్రతిపక్షాలు రకరకాల అపోహలు సృష్టించి అడ్డుకోవాలని చూశాయని, జీవో... నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు, ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చినప్పుడు కోర్టుకు పోలేదన్నారు. కానీ మెయిన్స్ నిర్వహించే సమయంలో జీవో 29పై కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారని, సుప్రీంకోర్టు కూడా వారి పిటిషన్ ను కొట్టేసిందన్నారు. కొంతమంది అగ్రవర్ణాల కోసమే గ్రూప్-1 నిర్వహిస్తున్నారని, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఒక వాదన తీసుకొచ్చారన్నారు. ఎంపికైన 31,383 మందిలో 10 శాతం లోపు మాత్రమే అగ్రవర్ణాలు ఉన్నారని, 57.11 శాతం బీసీలు,15.38 శాతం ఎస్సీలు, 8.87 శాతం ఎస్టీలు, 8.84 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా, స్పోర్ట్స్ కోటాలో 20 మంది లో ఎంపకయ్యారన్నారు. తాను చట్టాన్ని అమలు చేస్తాను తప్ప వ్యక్తిగత అజెండాతో పనిచేయనని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రతీ ఒక్కరు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

హామీలపై ప్రశ్నిస్తే కొడతారా?

(మొదటిపేజీ తరువాయి)

మహబూబ్ నగర్ సీఐ అప్పయ్య కొట్టిన ఘటనపై కేటీఆర్ బుధవారం స్పందించారు. సీఐ దుశ్చర్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడు భాస్కర్ కు ఫోన్ చేసిన జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని... పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలు అమలు చేయాల్సింది పోయి అడిగిన వారిని ఇలా పోలీసులతో కొట్టించటం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించవద్దని పోలీసులకు సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మిత్తితో సహా చెల్లిస్తామన్నారు. బాధితుడితో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తోనూ కేటీఆర్ మాట్లాడారు. భాస్కర్ విషయంలో కలసికట్టుగా పోరాటం చేద్దామని ఆయనకు సూచించారు.

నువ్వా కేసీఆర్ పేరు తుడిచేది ...

కేసీఆర్ రాజకీయం ముగుస్తుందని, కేసీఆర్ అనే పదమే కనిపించదని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'నువ్వు చెప్పులు మోసిననాడు ఆయన ఉద్యమానికి ఊపిరిపోశాడు. నువ్వు పదవుల కోసం పరితపిస్తున్ననాడు ఆయన తన పదవిని తృణప్రాయంగా వదిలాడు. నువ్వు ఉద్యమకారుల మీద గన్ను ఎక్కుపెట్టిన నాడు ఆయన ఉద్యమానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టాడు. నువ్వు బ్యాగులు మోస్తున్నప్పుడు ఆయన తెలంగాణ భవిష్యత్తుకు ఊపిరి పోశాడు. నువ్వా కేసీఆర్ పేరు తుడిచేది' అని ట్వీట్ చేశారు.

పేదలకు పట్టాలివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిల్ గౌడ్, సహాయ కార్యదర్శి ఉమా మహేష్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ, రచ్చ కిషన్, తోటపల్లి శంకర్, ఎస్. వెంకరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వీ శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మండల కార్యదర్శులు లొట్టి ఈశ్వర్, టీ యాదయ్య, బాచుపల్లి శ్రీనివాస్, డీజీ నరేంద్ర ప్రసాద్, జే రాములు గౌడ్, జైచంద్ర, సీపీఐ మండల నాయకులు వి.బి. బాలరాజ్, దండు రమేష్, బాపరాజు, సిహెచ్. మాధవి, కే ప్రమీల, కే మహాలక్ష్మి, రొయ్యల గిరిజ, యూసుఫ్ బాబా, వి. స్వరూప, జి. నాగరాజు, ఎండీ అన్వర్, దండు మదర్, ఇస్తారి, సోమరాజు, ఎం కనకయ్య, పీ ఆండాలు, సైదమ్మ, జ్యోతి, మహేశ్వరి, కమలమ్మ, రాజమ్మ, లక్ష్మమ్మ, భారతి, రమ, నాగమణి, సాంబశివరావు పాల్గొన్నారు. తొలుత కాలనీలో సీపీఐ జెండాను కూనంనేని ఆవిష్కరించారు.

అమరావతి రాజధాని డిజైన్లు యథాతథం

(మొదటిపేజీ తరువాయి)

పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం అవుతాయని తెలిపారు. విజయవాడలోని అమరావతి కన్వెన్షన్ హాల్‌లో ప్రొఫైలింగ్ యాప్‌పై మెప్మా సిబ్బందికి వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన మంత్రి అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డ్వాక్రా, మెప్మా సంఘాల సభ్యులకు సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తారని... వారి ఆర్థిక పరిస్థితి బాగుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా బాగుపడుతుందని బలంగా నమ్ముతారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆదాయం రెట్టింపు కావాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అందుకు అనుగుణంగా మెప్మాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకుని అమలు చేస్తున్నామన్నారు. మెప్మా ఏపీలో 2 లక్షల 78 వేల 407 స్వయం సహాయక సంఘాలున్నాయని, అందులో మొత్తం సభ్యులు 28 లక్షల 56 వేల 651 మంది ఉన్నారని వివరించారు. గత ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన డేటా ప్రాసెస్ సరిగా జరగలేదన్నారు. దీనివల్ల సభ్యుల బ్యాంక్ ఖాతాలు, రుణ వివరాలతో పాటు వారికి సంబంధించిన ఇతర సమాచారం సరిగా లేదన్నారు. అందుకే నిజమైన లబ్ధిదారులను గుర్తించి, సభ్యులకు సంబంధించిన సామాజిక, ఆర్థిక స్థితి గతులపై కచ్చితమైన డేటా తీసుకోవడం ద్వారా పేదరిక నిర్మూలనకు సహాయపడుతుందన్నారు.

మీకు కౌంట్‌డౌన్ మొదలు

హెజ్బుల్లా అధినేతకు ఇజ్రాయిల్ హెచ్చరిక

టెల్ అవీవ్: హెజ్బుల్లా అధినేతగా నయీం ఖాసీం పేరును ప్రకటించిన కొద్ది గంటలకే కౌంట్ డౌన్ మొదలైందంటూ ఇజ్రాయిల్ ఓ హెచ్చరిక చేసింది. నయీం ఖాసీం ఎక్కువ కాలం కొనసాగలేరని పేర్కొంది. నయీం ఖాసీం ఫొటోను 'ఎక్స్'లో పెట్టింది. ఇది తాత్కాలిక నియామకం... ఈయన ఎక్కువ కాలం పదవిలో కొనసాగలేరంటూ ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గాలెంట్ ఆ ఫోటో పక్కన వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఇరాన్‌కు ఇజ్రాయిల్ హెచ్చరికలు జారీ అయ్యాయి. మరోసారి క్షిపణులు ప్రయోగించే తప్పు చేస్తే ప్రతిఘటన చాలా చాలా తీవ్రస్థాయిలో ఉంటుందని ఇరాన్‌కు ఇజ్రాయిల్ సైనిక లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హాలేవి స్పష్టంచేశారు. 'ఇరాన్‌ను ఏ విధంగా దెబ్బతీయాలో మాకు బాగా తెలుసు. గతంలో వదిలేసిన ప్రాంతాలపైనా దాడులు చేస్తాం' అంటూ హెచ్చరించారు.

లెబనాన్ శివారు గ్రామం ఖాళీ

లెబనాన్‌లోని శివారు గ్రామమైన ఖయామ్‌లోకి ఇజ్రాయిల్ దళాలు చొరబడి భూతల దాడులు సాగించాయి. గాజాలో నిర్వాసిత భవనంపై ఇజ్రాయిల్ వైమానిక దాడిలో 100 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది జరిగిన 24 గంటల్లోగా ఇజ్రాయిల్ సైన్యం మరోసారి అదే ప్రాంతంలో దాడులు సాగించింది. తాజా దాడిలో 20 మంది పలస్తీనియన్లు చనిపోయారు. అల్ లోహ్ కుటుంబానికి చెందిన అనేక నివాసాలపై ఇజ్రాయిల్ బాంబులు కురిపించినట్లు పలస్తీనా పౌర రక్షణ శాఖ వెల్లడించింది. లెబనాన్‌లోని బాల్‌బెక్ ప్రాంత ప్రజలు ఇజ్రాయిల్ హెచ్చరికల తర్వాత అక్కడ నుంచి తరలిపోవాల్సి వచ్చింది. దీంతో ప్రధాన మార్గాలన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఆ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయాలంటూ ఇజ్రాయిల్ సైన్యం ఆదేశించడంతో ప్రజలు భయాందోళనకు గురై, ఆదరాబాదరగా అక్కడ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు.

43,163 మంది పలస్తీనియన్ల మృతి

గతేదాది అక్టోబరు 7 నుంచి ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన పలస్తీనియన్ల సంఖ్య 43,163కి చేరిందని గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. గాయపడిన వారి సంఖ్య 1,01,510గా ఉన్నట్లు బుధవారం ప్రకటించింది. గత 24 గంటల్లో 102 మంది చనిపోగా 287 మంది గాయపడ్డారని పేర్కొంది.

హైఫా స్థావరంపై హెజ్బుల్లా దాడి

హెజ్బుల్లా ఉదయం 7.45 గంటలప్పుడు ఇజ్రాయిల్ పోర్టు నగరంలోని హైఫా స్థావరంపై డ్రోన్లతో దాడి చేసింది. ఈ మేరకు హెజ్బుల్లా ఒక ప్రకటన చేసింది. దక్షిణ హైఫాలోని స్థావరంపై డ్రోన్ల స్క్వాడ్రన్‌తో దాడి చేసినట్లు వెల్లడించింది.

గాజాలో ఆకలి కేకలు: డబ్ల్యూహెచ్ఓ

గాజాలో ఆకలికేకలు వినిపిస్తున్నాయి. మానవతా పరిస్థితులు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. ఆహార అభద్రతా భావం పెరిగిపోతోంది. తమ బిడ్డలు ఆకలితో కాలం చేస్తారన్న భయం తల్లిదండ్రులను తల్లడిల్లేలా చేస్తోంది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) నివేదిక ప్రకారం గాజా స్ట్రిప్‌లో పలస్తీనియన్లకు ఆహారం అందడం లేదు. పిల్లలు పస్తులు ఉంటున్నారు. బిడ్డకు ఒక ఉల్లిపాయ లేక ఒక టమాట తినిపించడం కూడా తలకు మించిన భారమవుతోందని ఓ తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. బియ్యం వలే పిండిని వండి బిడ్డలకు తినిపిస్తున్నట్లు మరొక తల్లి వాపోయారు. పట్టెడు అన్నం పెట్టలేని దుస్థితి కారణంగా పిల్లలను కాపాడుకోలేమని తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారు.

ఆర్థిక-వాణిజ్య ప్రయోజనాలు దెబ్బతీయొద్దు

అమెరికా ఆంక్షలపై చైనా ఆగ్రహం

బీజింగ్: తమ దేశాన్ని అమెరికా లక్ష్యంగా చేసుకోవడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. పెట్టుబడులకు సంబంధించి ఆంక్షలు విధించడాన్ని ఆక్షేపించింది. ఈ మేరకు వాణిజ్య శాఖ అధికార ప్రతినిధి బుధవారం ఒక ప్రకటన చేశారు. మార్కెట్ పద్ధతులకు విరుద్ధంగా చైనా దేశం లక్ష్యంగా వివక్షపూరితంగా పెట్టుబడులకు సంబంధించిన ఆంక్షలను జాతీయ భద్రతా చర్యల నెపంతో అమెరికా విధించడం తగదని ప్రకటన పేర్కొంది. చిప్స్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాలను అమెరికా లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ పద్ధతి చైనా-అమెరికా కంపెనీల మధ్య ఆర్థిక-వాణిజ్య సంబంధాలను దెబ్బతిస్తుందని, రెండు దేశాల మధ్య వాణిజ్య ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని అధికార ప్రతినిధి పేర్కొన్నారు. మిగతా దేశాల నుంచి ఎదరయ్యే పోటీ కారణంగా చైనా మార్కెట్‌ను అమెరికా కంపెనీలు విస్మరిస్తే అమెరికా ప్రయోజనాలు కూడా దెబ్బతింటా యని గ్రహించాలని హితవు పలికారు. మార్కెట్ చట్టాలను గౌరవిస్తారని... ఆర్థిక, వాణిజ్య రంగాల్లో జాతీయ భద్రతా పరిధిని తగు విధంగా నిర్దేశించుకొని ఆర్థిక-వాణిజ్య సమస్యలకు రాజకీయ రంగు పులమడాన్ని ఆపేస్తారని ఆశిస్తున్నట్లు అమెరికా నుద్దేశించి అధికార ప్రతినిధి పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక-వాణిజ్య బంధాన్ని దెబ్బతీయొద్దని సూచించారు.

కాల్పుల విరమణకు సిద్ధం: హమాస్

గాజా: గాజాపై ఇజ్రాయిల్ ఏడాదికిపైగా భీకర పోరు సాగిస్తోంది. దురాక్రమణ, మారణహోమంతో గాజా స్ట్రిప్‌లో విధ్వంసం సృష్టించింది. నిత్యం భూతల, వైమానిక దాడులు సాగిస్తూ పెద్దఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం సంభవింపజేస్తోంది. దీంతో గాజా స్ట్రిప్‌లో శాశ్వత కాల్పుల విరమణ కోసం ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకునేందుకు సుముఖమంటూ హమాస్ ప్రకటించింది. ఈ మేరకు హమాస్ సీనియర్ అధికారి సమి అబు జుహ్రీ టీవీ మాధ్యమంగా చేసిన ఉపన్యాసంలో తెలిపారు. గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయిల్ సైన్యం ఉపసంహరణ, ఆంక్షల ఎత్తివేత, సహాయ సహకారాల కల్పన, పలస్తీనియన్లకు ఆశ్రయం, ఖైదీల విడుదల, గాజా స్ట్రిప్ పున:నిర్మాణం వంటి అంశాలతో కూడుకున్న ప్రతిపాదనలను స్వాగతిస్తామన్నారు. కొత్త ప్రతిపాదనల పరిశీలనకు సానుకూలమేనని మధ్యవర్తులకు ఇప్పటికే చెప్పినట్లు తెలిపారు. కొన్ని దఫాలు చర్చలు జరిగాయని, మరిన్ని చర్చలు జరగబోతున్నాయని కూడా ఆయన వెల్లడించారు.

ఉల్లి ధర ఢమాల్

- కొనేవారు లేక రైతుల పడిగాపులు
- కర్నూలు మార్కెట్‌లో గుట్టలుగా ఉల్లిరాశులు
- దళారులు, వ్యాపారుల ఇష్టారాజ్యం
- పెట్టుబడి కూడా రాదని రైతుల దిగాలు
- రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.70

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నను ఉల్లి కన్నీరు పెట్టిస్తోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎన్నో వ్యయ ప్రయాసలుపడి సరుకును టోకు మార్కెట్‌కు తీసుకెళ్తే కొనే నాథుడు లేక రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. కర్నూలు ఉల్లి మార్కెట్లో టన్నుల కొద్దీ ఉల్లి పేరుకుపోతోంది. మరో పక్క రిటైల్ మార్కెట్‌లో ఉల్లి ధరలు కిలోకు రూ.60 నుంచి రూ.70 వరకు పలుకుతుండటంతో సామాన్య ప్రజలు ఉల్లి కొనాలంటేనే భయపడుతున్నారు. కర్నూలు టోకు మార్కెట్‌లో ఉల్లిరైతులు గిట్టుబాటు ధర లేక , దళారుల మోసానికి గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో పెద్దఎత్తున రైతులు ఉల్లిసాగు చేశారు. వారం రోజుల నుండి పెద్దఎత్తున ఉల్లి మార్కెట్‌కు తరలిరావడంతో మార్కెట్ కిటకిటలాడుతోంది. మార్కెట్‌కు సుమారు 65వేల క్వింటాళ్ళ ఉల్లి వచ్చినట్లు తెలుస్తోంది. మార్కెట్‌లో ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.4141, మధ్యమం రూ.2312, కనిష్ఠంగా రూ.499 లకు అమ్మకాలు జరుగుతున్నాయి. మార్కెట్‌లో రోజు విడిచి రోజు రైతుల నుండి వ్యాపారస్తులు ఉల్లి కొనుగోలు చేస్తున్నారు. బుధవారం ఒక్క రోజే 25వేల క్వింటాళ్ల సరుకు మార్కెట్‌కు వచ్చింది. కర్నూలు జిల్లాతో పాటు పక్కనే తెలంగాణ రాష్ట్రం నుండి మార్కెట్‌కు ఉల్లి పెద్దఎత్తున రావడంతో మార్కెట్ ఉల్లి గుట్టలతో నిండిపోయింది. కర్నూలు జిల్లాలో ఈ ఏడాది కర్నూలు రూరల్, కల్లూరు, కోడుమూరు ,గోనెగండ్ల, దేవనకొండ, పత్తికొండ, సీబెళగల్, ఎమ్మిగనూరు, ఆలూరు, గూడూరు, తుగ్గలి, కృష్ణగిరి మండలాల్లో సుమారు 6లక్షల ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశారు. ఎకరాకు 60 వేల నుండి లక్షరూపాయల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. గత రెండు నెలలుగా రైతుల వద్ద పంట లేకపోవడంతో మార్కెట్‌లో ఉల్లిధర బాగా ఉండటంతో రైతులు ఆశగా మార్కెట్‌కు పంటను తరలించారు. రైతుల వద్ద నుండి వందల సంఖ్యలో ట్రాక్టర్లు, ఆటోలు, లారీలతో సరుకు మార్కెట్‌కు తరలిరావడంతో మార్కెట్ వద్ద ట్రాఫిక్ నిలిచి పోయింది, ఇదే అదునుగా భావించిన దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద ముందు కొంత పంటను అధిక ధరకు కొనుగోలు చేసి తరువాత తక్కువ ధరలకు కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో దళారులు రైతులను మోసం చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. మద్దతు ధర లేకపోవడం వల్ల పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. సుమారు 5 రోజుల నుండి పంట అమ్ముకునేందుకు మార్కెట్‌లో పడిగాపులు కాస్తున్నామని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో దళారులు ఇష్టాను సారంగా రైతుల నుండి పంటను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కర్నాటక, మహారాష్ట్ర నుండి పంటను దిగుబడి చేసుకోవడంతో ఇక్కడి పంటకు డిమాండ్ తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని... ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుండి ఉల్లి దిగుమతిని నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ అధికారులు దళారులను మార్కెట్‌లోకి అనుమతించకుండా వ్యాపారులను సిండికేట్ కాకుండా చూసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు. తన పొలంలో పండిన ఉల్లి పంటను (సుమారు 100 బస్తాలు) మార్కెట్‌కు ట్రాక్టరులో రెండురోజుల క్రితం తీసుకు వస్తే... ట్రాక్టరు నుండి దించడానికి కూడా మార్కెట్‌లో స్థలం లేదని కల్లూరు మండలం వామసముద్రం గ్రామానికి చెందిన కోటేశ్వరయ్య వాపోయాడు. ఇలా అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు.మార్కెట్ అధికారులు త్వరంగా సరుకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోని రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఏపీలో ఉచిత సిలిండర్ల పథకం

నేడు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. దీపం-2 పథకానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్-6 హామీల్లో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకానికి ఖర్చయ్యే నిధులను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గ్యాస్ సరఫరా చేసే పెట్రోలియం సంస్థలకు అందజేశారు. బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఈ సబ్సిడీ మొత్తాన్ని అందించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అయ్యే రూ.2,684 కోట్ల ఖర్చుకు మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మొదటి సిలిండర్‌కు ఖర్చు అయ్యే రూ.894 కోట్లు పెట్రోలియం సంస్థలకు అందించింది. దీపం-2 పథకంలో భాగంగా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రభుత్వం పేద ప్రజలకు అందించనుంది. యేడాదికి మూడు విడతల్లో ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లకు అయ్యే ఖర్చు సొమ్మును విడుదల చేయనుంది. 29వ తేదీ నుంచి ప్రభుత్వం ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకు కల్పించింది. గ్యాస్ సిలిండర్ అందిన 48 గంటల్లో లబ్ధిదారులు సిలిండర్‌కు వెచ్చించిన సొమ్ము వారి ఖాతాలో జమ కానుంది. కేంద్రం ఇచ్చే రూ.25 రాయితీపోను మిగిలిన రూ.876లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకం అమలుకు యేటా రూ.2,684 కోట్లు ప్రభుత్వంపై ఆర్థిక భారం పడనుంది. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు తెనాలి నుంచి వచ్చిన దీపం పథకం లబ్ధిదారు బాలమ్మ, ఏలూరు నుంచి వచ్చిన లబ్ధిదారు భవానీ, విజయవాడ నుంచి వచ్చిన లబ్ధిదారు మంగతాయారు, పౌరసరఫరాల శాఖ అధికారులు, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీలో డాటా సెంటర్ ఏర్పాటు చేయండి

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఎండీ రేచల్ స్కాఫ్‌తో మంత్రి లోకేశ్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమెరికాలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పెట్టుబడులను ఆకర్షించేందుకు వివిధ కంపెనీల అధినేతలతో వరుస భేటీలు కొనసాగిస్తున్నారు. లాస్ వెగాస్‌లో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సుకు హాజరయిన లోకేశ్ అక్కడి ప్రాంగణంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ రేచల్ స్కాఫ్‌ను కలిసి ఆంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని, డేటా సెంటర్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రేచల్ స్కాఫ్ మాట్లాడుతూ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌పై అమెజాన్ దృష్టి సారిస్తోందని, మార్కెట్‌లో క్లౌడ్ సేవలు, పరిష్కారాలను విస్తరించడంలో తమ సంస్థ కీలక పాత్ర వహిస్తోందని తెలిపారు. ఏఐ అండ్ ఎంఎల్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆవిష్కరణలకు ప్రస్తుతం ప్రాధాన్యతనిస్తున్నాం. ప్రభుత్వాలు, భారీ పారిశ్రామిక సంస్థలకు అత్యాధునిక డిజిటల్ సొల్యూషన్స్ సేవలు అందజేయడంతో పాటు క్లౌడ్ కంప్యూటింగ్, స్టోరేజి, డేటా నిర్వహణ సేవల్లో అంతర్జాతీయంగా మా సంస్థ పాత్ర కీలకమైంది. నెట్‌ఫ్లిక్స్, ఎయిర్‌బిఎన్‌బి, 3ఎమ్ వంటి అనేక రకాల పరిశ్రమలను తమ సంస్థ కలిగి ఉంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ వార్షిక ఆదాయం సుమారు ప్రస్తుతం 100 బిలియన్లకు చేరుకుందని రేచల్ స్కాఫ్ చెప్పారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజా సేవల పంపిణీ వ్యవస్థ, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ-గవర్నెన్స్ కార్యకమాలకు అమెజాన్ సహకారాన్ని కోరుతున్నామని చెప్పారు. దీనికి రేచల్ స్పందిస్తూ ఆంధ్ర ప్రదేశ్‌లో క్లౌడ్ సేవలు అందించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్ ప్రాంగణంలో రెవేచర్ సీఈవో అశ్విన్ భరత్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్ర ప్రదేశ్‌లో టెక్ టాలెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పడానికి రెవేచర్ భాగస్వామ్యం వహించాలని కోరారు. తదుపరి సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షిహ్‌తో భేటీ అయ్యి మాట్లాడుతూ స్మార్ట్ గవర్నెన్స్, ఏఐ డ్రివెన్ ఎకానమీపై మేం దృష్టి సారించామని, ఏఐ స్కిల్లింగ్ కార్యక్రమాలను ప్రారంభించేందుకు సహకారం అందించాలని కోరారు. పెప్సికో సీఈవో ఇంద్రా నూయితోనూ మంత్రి పెట్టుబడి అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సదస్సులో భాగంగా ఫైర్ సైడ్ చాట్‌లో పారిశ్రామికవేత్త తొట్టెంపూడి రవి అడిగిన ప్రశ్నలకు వివరణాత్మకంగా మంత్రి లోకేశ్ సమాధానాలిచ్చారు. 23 దేశాల నుంచి 2,300 మంది పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. రానున్న రోజుల్లో భారతదేశంలో డాటా విప్లవం రాబోతోందని, డాటా సేవల రంగంలో 300 బిలియన్ డాలర్ల పెట్టుబడులు దేశంలోకి రాబోతున్నాయని, అందులో వంద బిలియన్ డాలర్లను ఏపీకి రప్పించేందుకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ చెప్పారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో ఇతర రాష్ట్రాలతో కాకుండా ఇతర దేశాలతో పోటీపడతామని అన్నారు. 2017లో ఐటీ సర్వ్ సదస్సుకు వచ్చాను. మళ్లీ ఇదే సదస్సుకు హాజరయి మిత్రులను కలవడం ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ అన్నారు.

సైనిక బలగాల ఉపసంహరణ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

బలగాల ఉపసంహరణ ప్రక్రియ బుధవారంతో పూర్తయ్యింది. ఇక పెట్రోలింగ్ విధి విధానాలను ఖరారు చేసేందుకు క్షేత్రస్థాయిలో స్థానిక కమాండర్ల మధ్య చర్చలు కొనసాగుతున్నట్ల రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. వారే పెట్రోలింగ్ పద్ధతులను నిర్ణయిస్తారని పేర్కొన్నాయి. ఇరు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇది మార్గదర్శకంగా ఉంటుందని ఆశిస్తున్నట్లు భారత్‌లో చైనా రాయబారి షు ఫీహాంగ్ అన్నారు. భవిష్యత్‌లో సజావుగా ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పొరుగు దేశాలుగా ఉన్నప్పుడు కొన్ని విభేదాలు ఉంటాయని, వాటిని పరిష్కరించుకొని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య విమాన రాకపోకలు పునఃప్రారంభంపైనా ఆశాభావం వ్యక్తం చేశారు. "2020కి ముందు మనకు నేరుగా విమానాలు ఉండేవి. అవి ఉంటే అందరికీ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. సమయం, డబ్బు ఆదా అవుతాయి" అని ఆయన చెప్పారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఇరుదేశాల సైన్యాల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణ నేపథ్యంలో భారత్-చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

అప్పటి నుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరు దేశాల మధ్య పలుమార్లు దౌత్య, కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించగా ఘర్షణల కేంద్రమైన దెప్సాంగ్, డెమ్‌చోక్ వద్ద మాత్రం బలగాలు కొనసాగుతూ వచ్చాయి. అలా నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇటీవల వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది.

పసిడి ధరకు రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

స్వచ్ఛత కలిగిన బంగారం రూ.82 వేల మార్కును దాటినట్లు పేర్కొంది. అంతకుముందు రూ.81,400గా ఉంది. గతేడాది ఇదే సమయంలో 10 గ్రాములు రూ.61,200 పలికింది. ఏడాదిలో ధర 35 శాతం పెరిగింది. అదే విధంగా వెండి కిలో ధర రూ.1300 పెరిగి రూ.1.01 లక్షలకు చేరింది.

కులగణన పరిశోధన కేంద్రంగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

చేయడం కాంగ్రెస్ ఘనవిజయంగా ఆయన అభివర్ణించారు. ఈ నెల 10వ తేదీన సమగ్ర కుల గణనకు జీవో జారీ చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పార్టీ శ్రేణులు ఇచ్చే సమాచారం, ప్రశ్నలు తప్పకుండా సర్వేలో పొందుపరుస్తాం అన్నారు. సమాజంలో అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్లు... ఆయా శాఖల ఉన్నతాధికారులను భాగస్వాములను చేస్తున్నట్టు తెలిపారు. సోషియో, ఎడ్యుకేషన్, ఎకానమి, పొలిటికల్ అన్ని అంశాలపై సమాచారాన్ని సేకరిస్తామన్నారు. జిల్లాస్థాయిలో కాంగ్రెస్ కమిటీలు విస్తృతంగా అభిప్రాయాలను సేకరిస్తాయని, రాష్ట్రస్థాయిలో మేధావులు, సామాజికవేత్తలు, ప్రగతిశీల వాదులతో వచ్చేనెల ఐదున హైదరాబాదులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరిస్తామని తెలిపారు. సమాజం ఆరోగ్యంగా, ఉన్నతంగా ఎదగడానికి కులగణన సర్వే ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు.

రష్యా అణు విన్యాసాలు

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తూ రష్యాపై మరింత తీవ్రస్థాయిలో దాడులు చేసేలా ఉక్రెయిన్‌కు ప్రోత్సాహమిస్తున్నాయి. ఉత్తర కొరియా సైనిక సాయాన్ని రష్యాకు అందిస్తున్నదంటూ అమెరికా కొత్త వాణి వినిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రష్యా అణ్వస్త్ర దళాలు విన్యాసాలు నిర్వహించడంతో అణు యుద్ధం రాబోతోందా అన్న చర్చ మొదలైంది. కేవలం పక్షం రోజుల్లో రష్యా రెండవసారి తమ అణ్వస్త్రాలను బయటకు తీసింది. అణు శక్తి ప్రదర్శనకు రష్యా మొగ్గు చూపుతున్న క్లిష్ట పరిస్థితుల్లో ఏ విధంగా స్పందించాలో అర్థం కాక నాటో దేశాలు తలలు పట్టుకుంటున్నాయి. రష్యా భూభాగంలోకి చొచ్చుకుపోయే విధంగా క్రూయిజ్ క్షిపణులను ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తోంది. అయితే రష్యా ఇటీవల అణ్వస్త్ర నిబంధనావళిని నవీకరించుకుంది. దీంతో అణ్వస్త్రాలు లేని దేశాలపైన కూడా అణ్వాయుధాలను వాడటానికి మాస్కోకు అనుమతి ఉంటుంది. అయితే దీనిని పశ్చిమ దేశాలకు ఒక హెచ్చరికగా రష్యా చెబుతోంది. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణుల ప్రయోగాలతో అణ్వస్త్రాల వినియోగంపై అధికారుల నియంత్రణను పరీక్షించేందుకు తాజా విన్యాసాలు దోహదం కాగలవని పుతిన్ అభిప్రాయపడ్డారు. అణ్వస్త్రాల వినియోగమన్నది అసాధారణమే అయినప్పటికి అవసరానికి వాడుకునేలా వాటిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన అన్నారు. కొత్త ఆయుధాల రేసులో ఉండము కానీ అణు శక్తిని అన్ని స్థాయిల్లో అభివృద్ధి చేసుకుంటామని చెప్పారు. ఇదిలావుంటే, తాజా విన్యాసాల్లో భాగంలో యార్స్ ఐసీబీఎంను రష్యా పరీక్షించింది. కంచట్కా ద్వీపం నుంచి ఈ పరీక్ష జరిగింది. నొవొమోస్కోవ్స్క్ క్నైయాజ్ ఓలెగ్ అణు జలాంతర్గాముల ద్వారా ఐసీబీఎంలను బరెంట్స్ సముద్రంలో, ఓకోట్స్క్ సముద్రంలో పరీక్షించారు. అలాగే టీయూ-95 వ్యూహాత్మక బాంబర్లు... దీర్ఘశ్రేణి క్రూయిజ్ క్షిపణులు ప్రయోగించారు.

ఇద్దరు అరెస్ట్ : 118 కేజీల గంజాయి, రెండు ఆటోలు స్వాధీనం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఒరిస్సా కలిమెల ప్రాంతం నుంచి హైదరాబాద్ కు రెండు ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న 118 కేజీల గంజాయిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు స్మగ్లర్లలో ఇద్దరిని అరెస్టు చేయగా ఒకరు పరారైనట్టు చెబుతున్నారు. రెండు ఆటోలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు అందించిన ఈ స్మగ్లింగ్ వివరాలు ఇలా వున్నాయి. ఒరిస్సా నుంచి రెండు ఆటోలో గంజాయి వెళు తుందని పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు భద్రాచలం ఆర్టీవో చెక్పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. గంజాయి తరిస్తున్న అనుమానిత ఆటోలను ఆపి తనిఖీ చేశారు. దింతో రెండు ఆటోల్లో బండిల్స్‌లా పార్సెల్ చేసి ఉన్న 118 కేజీల గంజాయిని, ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు వాహనాల విలువ కలిపి రూ.31.50 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సూపర్ డెంట్ కరమ్ చందు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కనిగల స్వాతిక్, మణుగూరుకు చెందిన గుంజు ఆమోస్ లను అరెస్టు చేయగా సపావత్ వెంకన్న పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ గౌతమ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్ పాష, వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్, శ్రావణి, రమేష్‌లు పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్న టీమును ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, సూపరిండెంటు జనార్దన్ రెడ్డి, ఎసి గణేష్, సూపర్డెంట్ జానయ్యలు అభినందించారు.

సాయిబాబా సంస్మరణ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వనపర్తి : ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్ మేధావి జి.ఎన్ సాయిబాబా సంస్మరణ సభ కరపత్రాలను వనపర్తి సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విడుదల చేయడం జరిగింది. అట్టడుగు వర్గాల ప్రజల హక్కులు, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల అమలు, సామాజిక న్యాయం, ఆదివాసుల హక్కుల కోసం ఆయన గళం ఎత్తారు. కక్షగట్టిన బిజెపి ప్రభుత్వంఆయనపై అక్రమ కేసులు బనాయించి పదేళ్లు అండా జైల్లో పెట్టింది. మార్చి 2024 లో ఆయన నిర్దోషి అని తేలడంతో జైలు నుంచి విడుదలయ్యారు. జైల్లో ఆయన ఆరోగ్యం క్షీణించి అనేక జబ్బులకు గురయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఏడు నెలల్లోనే అనారోగ్య కారణం వల్ల ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో వనపర్తి పట్టణం బండారు నగర్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన్లో నవంబర్ 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు సాయిబాబ సంస్మరణ సభ జరుగుతుంది. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. కార్యక్రమంలో ప్రముఖ ప్రజాకవి జనజ్వాల, టిపిటిఎఫ్ నాయకులు కొంకల వెంకట్ నారాయణ, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ సెల్ సభ్యులు గంధం నాగరాజు, పిడిఎస్యు నాయకులు గణేష్, ఏఐటీయూసీ నాయకులు గోపాలకృష్ణ, సిపిఐ పట్టణ కమిటీ కార్యదర్శి రమేష్, బహుజన మహాసభ నాయకులు సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు : ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లా నేరుగూడెం మండలం జోడుబాయ్ తండాలో నాటుసారా తయారీకి నల్లబెల్లం సరపరా అవుతుందనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ టీమ్ బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో బెల్లంతోపాటు అలం, రెండు ఆటోలను, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌టిఎఫ్ టీమ్ ఎస్సై బాలరాజ్ టీమ్ దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి వినియోగించే 450 కిలోల నల్ల బెల్లం, 50 కేజీల అలం, 10 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. జోడుబాయ్ తండాలలోకి తీసుక వెలు తుండగగా బెల్లాని పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి జోడు భాయ్ తండాకు కారులో వచ్చిన బెల్లాన్ని ఆటోల్లోకి తరలిస్తున్న క్రమంలో ఎక్సైజ్ పట్టుకుంది. రూ.50 వేల విలువ చేసే బెల్లం, అలంతో పాటు రూ.4 లక్షల విలువ చేసే రెండు ఆటోలను, రూ. ఐదు లక్షల విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో కేశవత్ శ్రీను, కుమారులను అరెస్టు చేశారు. బెల్లం, అలంను పట్టుకున్న టీమ్‌లో ఎస్‌టిఎఫ్ ఎస్సై బాలరాజుతో పాటు హెడ్ కానిస్టేబుల్ విజయ కృష్ణ, కానిసేబుళ్లు యాదాగిరి, కౌశిక్‌లు పాల్గన్నారు. బెల్లాన్ని పట్టుకున్న ఎస్‌టిఎఫ్ టీంను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్టీఎప్ టీం లీడర్ ప్రదీప్‌రావులు అభినందించారు.

మంత్రి ఉత్తమ్ సహకారంతో త్వరలో మినీ స్టేడియం

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ పట్టణంలో త్వరలో మినీ స్టేడియం ఏర్పాటు జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణం లోని ఎన్ఎస్పీ క్యాంపు పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 14 నుండి 17 సంవత్సరాల వారికి పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలను వారు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్ నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటుకు త్వరలో ఐదు కోట్లు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎస్ జి టి సెక్రటరీ యం డి అజాం బాబా, దేవిశెట్టి రవి, సునీల్, మైసయ్య, జనార్దన్ రెడ్డి, ఉస్మాన్, నరేష్, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, నాయకులు సులువ చంద్రశేఖర్, వేముల నాగరాజు, వెల్దండ వీరారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పోరాట ఫలితమే విద్యుత్ చార్జీల పెంపు నిలిపివేత

విశాలాంధ్ర (మహబూబాబాద్) తొర్రూర్ : తెలంగాణ బి.ఆర్.ఎస్ పార్టీ విద్యుత్ చార్జీలు పెంచవద్దని చేసిన పోరాట ఫలితమే నేడు విద్యుత్తు పెంపుదల రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందని తొర్రూరు బి.ఆర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు అన్నారు. బుధవారం రాష్ట్ర ఇఆర్సి విద్యుత్ చార్జీల పెంపును ఆపిన సందర్భంగా మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. మంగళపల్లి శ్రీనివాస్‌తో కలిసి వారు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలపై 18500 కోట్ల భారం మోపి విద్యుత్ చార్జీలు పెంచుటకు ఈ ఆర్ సి అనుమతిని కోరిం దని, దీనిపై రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, విధానసభ ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఈ పెంపుదల రాష్ట్ర పేద ప్రజలపై పెను భారం అవుతుందని సవివరంగా వివరించగా, విద్యుత్ ధరల పెంపునకు అనుమతి నిరాకరించి ప్రజలకు న్యాయం జరిగిందన్నారు.

కార్మికుల వేతన సమస్యలు పరిష్కరిస్తాం : సాబీర్ పాష

విశాలాంధ్ర - కొత్తగూడెం : పాల్వంచ మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికులకు సిపిఐ, ఏఐటీయూసీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో వేతనాలకు సంబంధించిన సమస్యను త్వరలో పరిష్కరించేం దుకు కృషి చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ కె. సాబీర్ పాష తెలిపారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో బుధవారం జరిగిన పాల్వంచ మున్సిపల్ స్వచ్ఛ కార్మికుల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం, ఇల్లందు మున్సిపాలిటీల్లో ఆయా మున్సిపల్ శాఖల నుంచి వేతనాలు చెల్లింస్తుండగా పాల్వంచ మున్సిపాలిటీలో అందుకు భిన్నంగా కుటుంబ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేసుకోవాలనే నిబంధన వల్ల కార్మికులు నష్టపోతున్నారన్నారు. కుటుంబ యజమానుల నుంచి కార్మికులు చీదరింపులకు గురవుతున్నార న్నారు. మున్సిపల్ శాఖా ద్వారా వేతనాలు చెల్లించేందుకు స్థానిక ఎమ్మెల్యే కృషి చేస్తున్నార న్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖా మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారని గుర్తు చేసారు. త్వరలో సమస్యకు పరిస్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, నాయకులు పాటి మోహన్, బాలాజీ, నాగరాజు, పాష, హుస్సేన్, కార్తీక్, లాలూ, సంధ్య, రాము, రాణి పాల్గొన్నారు.

ప్రియదర్శిని కళాశాల జాబ్ మేళా విజయవంతం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : స్థానిక ప్రియదర్శిని కళాశాలలో జెన్ ప్యాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. 2021 నుంచి 2024 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీకాం, బీఎస్సీ, బీసీఏతో పాటు బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు సుమారు 448 మంది ఈ మేడలో రిజిస్టర్ అయ్యారు. ఈ మేరకు జెన్ ప్యాక్ట్ కంపెనీ అధికారులు మూడు రౌండ్లలో పరీక్షలు నిర్వహించి అనంతరం ఇంటర్వ్యూలో 32 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి వెంటనే నియామక పత్రాలు అందజేసినట్లు ప్రియదర్శిని కళాశాలల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. సంస్థ ప్రతినిధులతోపాటు ఎంపికైన యువతకు ఈ కళాశాల డైరెక్టర్ చలపతిరావు, ప్రిన్సిపల్ నయీంపాషా శుభా కాంక్షలు తెలిపారు. ఈ ప్రక్రియలో వైస్ ప్రిన్సిపల్ రాయల వివేక్, ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకట ఫణి, పీడీ కాశిమల్ల రమేష్, ధీకొండ దుష్యంత్ కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో ఉండాలి : ఎస్పీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్ : రిటైర్మెంట్ తరువాత ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. బుధవారం ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఏ, నరహరి పదవి విరమణ పొందుతున్న సందర్భంగా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్ నరహరికి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవి విరమణ తరువాత ఏమి చేయాలి అనే దానిపై ముందస్తుగా అందరు ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. రిటైర్‌మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. రిటైర్‌మెంట్ అనంతరం ఆ భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని, మిగిలిన శేష జీవితం మీ కుటుంబంతో సంతోషంగా గడపాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డిఎస్పీ విజయప్రతాప్, ఆర్ఐలు అనిల్, నాగేశ్వరావు, ఆర్.ఎస్.ఐలు పుల్లారావు, శేఖర్, సునంద, మౌనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సౌలభ్యం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

విశాలాంధ్ర - కారేపల్లి : రైతుల సౌలభ్యం కోసమే ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి నవీన్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సింగరేణిలో ఐకెపి కొనుగోలు కేంద్రంను మండల ప్రత్యేక అధికారి నవీన్ బాబు, ఎంపీడీవో సురేందర్, తహసిల్దార్ సానబోయిన సంపత్ కుమార్, ఐకెపి ఎపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కేవలం సన్న రకం వరి ధాన్యం మాత్రమే కనుగోలు చేయడం జరుగుతుందని రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలకు మద్దతు ధర 2320 పొందాలని తెలిపారు. అలాగే రైతులు తమ పంటను కల్లాలలో పూర్తిగా ఆరబెట్టుకుని ఆవరి ధాన్యంతో పాటు, రైతు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తప్పనిసరిగా తీసుకొని రావాలని సూచించారు. అలా సమర్పించిన రైతులు మాత్రమే చెల్లించవలసిన నగదును బ్యాంక్ ఖాతాలో ఆన్ లైన్ ద్వారా జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, సమైక్య అధ్యక్ష కార్యదర్శులు సుజాత, నాయిని నాగమణి, సీసీలు చైతన్య, తుమ్మలపల్లి అనిల్, పగడాల పుష్ప, షేక్ గౌసియా బేగం, విజయలక్ష్మి ఐకెపి సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఇప్పలపల్లి, మల్యాల, తారుపల్లి, మీర్జంపేట, క్రిష్టంపేట, మొట్లపల్లి, చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు నాయకులు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి వడ్ల కొనుగోలులో గింజ కట్టింగ్ లేకుండా చూసామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గాని, మిల్లుల్లో గాని ధాన్యంలో కోత విధిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, అలాగే కేంద్రాల్లో 41 కిలోలు మాత్రమే ధాన్యాన్ని తూకం వేయాలని అధికంగా తూకం వేసినా కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో క్వింటాలుకు పది, పన్నెండు కిలోల వరకు వడ్లు కటింగ్ చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో కటింగ్ మాటే ఉండదని స్పష్టం చేశారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రశీదులు ఇవ్వాలన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సదయ్య, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రం రెడ్డి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, బంగారి రమేష్, మునీర్, సింగిల్ విండో డైరెక్టర్లు, మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రైతులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు : ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురైషి

విశాలాంధ్ర - కొత్తగూడెం : ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోని దీపావళి పండుగ ఘనంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర మైనార్టీ నాయకులు, ఉర్దూగర్ చైర్మన్ నయీమ్ ఖురైషి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వెలుగునిచ్చే దీపాల మేరుపులతో, లక్ష్మి పూజ ఆరాధనతో హిందూ సోదరులు జరుపుకునే పవిత్రమైన ఈ దీపాల పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందాలు తీసుకోరావాలని ఆయన ఆకాంక్షించారు. ఆయా కుటుంబాలు ఆరోగ్యం, సంపదలతో వర్ధిల్లాలని దీపావళి పండుగ సురక్షితంగా జరుపుకోవాలని నయీమ్ ఖురేషి విజ్ఞప్తి చేసారు.

ఇద్దరు మహిళా మావోయిస్టు సభ్యుల లొంగుబాటు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : తెలంగాణ రాష్ట్రంలోని మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ లోని ఇద్దరు మహిళా సభ్యులు జిల్లా పోలీసులు ఎదుట బుధవారం లొంగిపోయినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. చత్తీస్గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లాలోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోగల దోకుపాడు గ్రామానికి చెందిన సోడి పొజ్జి అలియాస్ చిలుక, ఇదే ప్రాంతానికి చెందిన మడివి సోమిడి అలియాస్ రమ్య స్వచ్ఛందంగా లోగిపోయారని తెలిపారు. ఏరియా కమిటీ సభ్యురాలు సోడి పొజ్జీ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బికే ఎఎస్ఆర్) డివిజన్లోని చర్ల ఎల్ ఓ ఎస్ కమాండర్‌గా పనిచేస్తుంది. తన సోదరుడైన సోడి జోగయ్య ప్రోద్బలంతో 2017లో దళసభ్యురాలిగా చేరింది. 2021లో ఏరియా కమిటీ మెంబర్ గా ప్రమోషన్ పొందినట్లు చెప్పారు. ఆ తర్వాత 2023 వరకు మావోయిస్టు పార్టీకి చెందిన చైతన్య నాట్య మండలి కమాండర్ గా పని చేసింది. కాగా చర్ల కమాండర్ మడకం ఎర్రయ్య అలియాస్ రాజేష్ 2023లో మరణించిన తర్వాత ఆ భాధ్యతలను ఈమె తీసుకుంది. మరో సభ్యురాలు అయిన రమ్య 2019లో చర్ల మిలిషియా కమాండర్ అయిన సోడి జోగయ్య(లేటు) ఆధ్వర్యంలో పార్టీలో చేరింది. 2021లో మణుగూరు ఎల్ జి ఎస్ కు ఈమెను బదిలీ చేశారు. అనం తరం 2024 మే నెలలో ఏరియా కమిటీ మెంబర్‌గా ప్రమోషన్ పొంది మణుగూరు ఏరియా ఎల్‌జిఎస్‌కు కమాండర్‌గా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహిస్తుంది. ఈ మహిళ మావోయిస్టు ఒక్కొక్కరిపై రూ.4 లక్షల రివార్డులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. లొంగిపోయే దళసభ్యులకు జీవనో పాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని సౌకర్యాలను పోలీసు యంత్రాంగం కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

2న బీసీ కమిషన్ సభ్యులు హనుమకొండకు రాక : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : స్థానిక సంస్థల రిజర్వేషన్ల కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా నవంబర్ 2వ తేదీన హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కు బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం రానున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. బుదవారం ప్రకటనలో తెలిపారు. ప్రజాభిప్రా య సేకరణలో భాగంగా బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి పాల్గొననున్నట్లు తెలిపారు. నవంబర్ 2న ఉదయం నుంచి ఉమ్మడి హనుమకొండ జిల్లాలైన వరంగల్, హన్మకొండ, ములుగు, భూపాలపల్లి మహబూబాబాద్, జనగామ జిల్లాలకు సంబంధించి దరఖా స్తులను స్వీకరిస్తారని వివరించారు. ములుగు జిల్లాలోని అన్ని కులాలకు సంబంధించినటువంటి ఆసక్తి కలిగిన ప్రతినిధులు వారి వారి కులాలలో ఉన్నటువంటి సమస్యలు రాజకీయపరమైన, సామాజికపరమైన, ఆర్థికపరమైన అభ్యర్థనలు, సలహాలు, అభిప్రాయాలను, విజ్ఞప్తులను కమిషన్ బృందానికి సమర్పించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అంశాలపై ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణపై అధికారు లకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వేను పగడ్బందీగా నిర్వహించాల న్నారు. 150 గృహాలకు ఒక ఎన్యుమరేషన్ బ్లాకుగా పరిగణించాలన్నారు. ప్రతి ఎన్యుమరేషన్ బ్లాకుకు ఒక ఎన్యుమరేటర్ అధికారి బాధ్యుడిగా ఉంటా రని, కేటాయించిన ఎన్యుమరేషన్ బ్లాక్ లోని ప్రతి కుటుంబానికి సంబంధించి నిర్దేశించిన అన్ని వివరాలను సేకరించాలని ఆదేశించారు. ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, జెడ్పి సీఈఓ గోవింద్, ట్రైనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్‌లు, ఎంపీఓలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

హైదరాబాద్: టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అపోలో హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పీఆర్కే ప్రసాద్ తెలిపారు. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. దీపావళి పండుగ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండగను దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారన్నారు. అయితే, ఈ సందర్భంలో పిల్లలు, యువకులు ఎక్కువగా గాయాలపాలు అవుతున్నారని తెలిపారు. ఈ పండగ సమయంలో కాలిన గాయాల కేసులు అధికంగా పెరుగుతున్నాయన్నారు. ఈ గాయాలను జాగ్రత్తలు పాటించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చన్నారు. తక్షణ ప్రథమ చికిత్సతో తగ్గించవచ్చని తెలిపారు.

ఈ ఏడాది కొత్త ఉద్యోగాలు 10 శాతమే : లింక్డ్ఇన్

ముంబయి: వర్క్‌ప్లేస్ పరివర్తన అపూర్వమైన వేగంతో జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 2024లో నియమించబడిన ఉద్యోగులలో 10% మంది 2000లో లేని ఉద్యోగ శీర్షికలను కలిగి ఉన్నారని లింక్డ్ఇన్ తొలి వర్క్ చేంజ్ స్నాప్‌షాట్‌లోని కొత్త డేటా వెల్లడించింది. సస్టెయినబిలిటీ మేనేజర్, ఏఐ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, సోషల్ మీడియా మేనేజర్, కస్టమర్ సక్సెస్ మేనేజర్ వంటి బాధ్యతలు ఇప్పుడు సర్వసాధారణంగా మారాయి. లింక్డ్ఇన్ వర్క్ చేంజ్ స్నాప్‌షాట్ కొన్ని సంవత్సరాల క్రితంతో పోలిస్తే ఆధునిక కార్యాలయాలు ఎలా విభిన్నంగా మారాయో తెలియజేస్తుంది. భారతదేశంలోని 82% మంది నాయకులు పనిలో మార్పు వేగం పెరుగుతోందని అంగీకరిస్తున్నారని లింక్డ్ఇన్ వెల్లడించింది. గ్లోబల్ బిజినెస్ లీడర్‌లు జెనరేటివ్ ఏఐ పరివర్తన సామర్థ్యాన్ని గుర్తించారు, భారతదేశంలో 10 మందిలో 9 మంది సాంకేతికత తమ బృందా లకు ప్రయోజనం చేకూర్చే విధంగా కనీసం ఒక మార్గాన్ని నివేదిస్తున్నారు. 10లో 7 గురు 2025లో ఏఐ సాధనాలను స్వీకరించడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. ఏఐని స్వీకరించడం వల్ల కలిగే ప్రయోజనాలు పెరిగిన ఉత్పాదకత కంటే బాగున్నాయి. జెనరేటివ్ ఏఐలో ప్రావీణ్యం ఉన్న ఉద్యోగులు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్, పర్సనల్ బ్రాండింగ్, డిజైన్ థింకింగ్, క్రియేటివిటీ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ వంటి ముఖ్యమైన సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేయడానికి 20 రెట్లు ఎక్కువ అవకాశం ఉందని లింక్డ్ఇన్ డేటా చూపిస్తుంది.

అమేజాన్ ఫ్రెష్‌లో దీపావళి సూపర్ వేల్యూ డేస్

బెంగళూరు: దీపాల పండగ నేపథ్యంలో, అమేజాన్ ఫ్రెష్ 1 నుండి 7 నవంబర్ 2024 వరకు ఫెస్టివ్ సూపర్ వేల్యూ డేస్‌ని అందిస్తోంది. వివిధ ఆదాలతో గొప్ప డీల్స్ అందిస్తోంది. సంప్రదాయబద్ధమైన మిఠాయిలు, తాజా పండ్లు, కూరగాయలు, స్నాక్స్, పానియాలు, మిఠాయిలు, నిత్యావసరాలు సహా విస్తృత శ్రేణి ఉత్పత్తులపై 45% వరకు తగ్గింపును అందిస్తోంది. సమయానికి సౌకర్యవంతమైన ఇంట ముంగిట డెలివరీలతో ఆశీర్వాద్, బికాజీ, పార్లే, దావత్, టాటా సంపన్, డెట్టాల్ వంటి నమ్మకమైన బ్రాండ్స్ కోసం అమేజాన్ ఫ్రెష్‌పై షాపింగ్ చేసి సులభంగా సంబరాలు చేసుకోవచ్చు. ప్రైమ్ సభ్యులు అమేజాన్ ఫ్రెష్ ఫెస్టివ్ సూపర్ వేల్యూ డేస్‌తో అతుల్యమైన ఆదాల ప్రయోజనాలను అత్యధికంగా పొందవచ్చు. ఇప్పటికే ప్రైమ్ కస్టమర్లగా ఉన్న వారు 45% వరకు తగ్గింపును, ఫ్లాట్ రూ. 300 క్యాష్ బాక్‌ను, ఉచిత డెలివరీలు, పండ్లు, కూరగాయలపై అదనంగా రూ. 50 క్యాష్ బాక్‌తో 1 నుండి 3 నవంబర్ వరకు పొందవచ్చు.

విజయవాడలో 'వరల్డ్ ఆఫ్ అమృతాంజన్' స్టోర్ ప్రారంభం

విజయవాడ: హెల్త్‌కేర్, వెల్‌నెస్ రంగంలో విశ్వసనీయమైన సంస్థగా గుర్తింపు పొందిన అమృతాంజన్ హెల్త్ కేర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో తమ మొదటి ఫిజికల్ స్టోర్ 'వరల్డ్ ఆఫ్ అమృతాంజన్'ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త స్టోర్ కంపెనీ విస్తరణలో మరో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఇది దాని డైరెక్ట్-టు-కన్స్యూమర్ (డీ2సీ) వ్యూహాన్ని బలోపేతం చేయనుంది. ఇది డిజిటల్ మరియు ఫిజికల్ రిటైల్‌ను సజావుగా మిళితం చేసే ఇంటిగ్రేటెడ్ షాపింగ్ అనుభవాన్ని అందిస్తోంది. చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్‌లోని స్టోర్‌లతో సహా 'వరల్డ్ ఆఫ్ అమృతాంజన్' అవుట్‌లెట్‌ల పెరుగుతున్న నెట్‌వర్క్‌లో కొత్తగా ప్రారంభమైన విజయవాడ స్టోర్ చేరింది. ఈ విస్తరణ, భారతదేశం అంతటా వినియోగదారులకు తన నమ్మకమైన శ్రేణి ఉత్పత్తులను తీసుకురావాలనే అమృతాంజన్ నిబద్ధతను ప్రదర్శిస్తుంది. విజయవాడలోని వినియోగదారులు ఇప్పుడు అమృతాంజన్ హెల్త్‌కేర్ విభిన్న ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను కొత్త స్టోర్‌లో నేరుగా పొందవచ్చు.

గుజరాత్‌లో మెరిల్ అధునాతన తయారీ ప్రాంగణం ప్రారంభం

వాపి (గుజరాత్): భారతదేశంలో అగ్రగామి గ్లోబల్ మెడ్‌టెక్ కంపెనీల్లో ఒకటైన మెరిల్ తమ అత్యాధునిక ఉత్పత్తి ప్రాంగణాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉత్పత్తి అనుబంధ ప్రోత్సాహక (పిఎల్ఐ) పథకం కింద వర్చువల్‌గా ప్రారంభించడంతో మరో గణనీయమైన మైలురాయిని వేడుక చేసుకుంది. వాపిలోని మెరిల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ప్రారంభోత్సవానికి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేందర్‌భాయ్ పటేల్ హాజరయ్యారు. ప్రముఖ వైద్య పరికరాల ఉత్పత్తిదారు, తయారీదారు అయిన మెరిల్ వైద్య సాంకేతికతలో దేశ సామర్థ్యాన్ని ప్రదర్శించడం ద్వారా అంతర్జాతీయంగా భారతదేశం ఉనికిని విస్తరించింది. అత్యున్నత నాణ్యత కలిగిన 'మేక్ ఇన్ ఇండియా' పరికరాల ఉత్పత్తితో విదేశీ దిగుమతులపై భారతదేశం ఆధారపడడాన్ని క్రియాశీలకంగా తగ్గిస్తోంది, అమృత్ భారత్ దార్శనికతకు మద్దతునిస్తోంది. 2024 వైబ్రంట్ గుజరాత్ సమ్మిట్‌లో, వైద్య పరికరాల రంగంలో రూ. 910 కోట్ల కొత్త పెట్టుబడులకు కట్టుబడే విధంగా గుజరాత్ ప్రభుత్వంతో ఒక మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయు) మీద మెరిల్ సంతకం చేసింది.

రైతులకు గోద్రెజ్ రాషిన్‌బాన్ భరోసా

హైదరాబాద్: మిరప మొక్కలో కీలకమైన ఆర్థిక భాగమైనందున, మిరప సాగులో పువ్వులు విజయానికి అత్యంత కీలకం. ఈ కీలకమైన వాస్తవాన్ని గుర్తించి, ఈ కీలకమైన మొక్కల నిర్మాణాలను రక్షించే శాస్త్రీయ పరిష్కారాలను రైతులు స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూత సమయం అంటే రాషిన్‌బాన్ సమయం అని జీఏవీఎల్, క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్-సీఈఓ ఎస్ కె రాజవేలు పేర్కొన్నారు. పురుగుమందుల అశాస్త్రీయ కలయికలు పంటలను, పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఇది పంట దిగుబడిని ప్రభావితం చేయడమే కాకుండా వారి పొలాల సున్నితమైన పర్యావరణ సమతుల్యతను కూడా దెబ్బతీస్తుంది. ఈ సమస్యలను రాషిన్‌బాన్ పరిష్కరిస్తుంది. పంట నాటిన 45-75 రోజుల వద్ద రాషిన్‌బాన్ ఉపయోగించినప్పుడు, సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది ఒక సారి వినియోగిస్తేనే తామర పురుగు (త్రిప్స్), లెపిడోప్టెరాన్స్, పచ్చ దోమ (హాప్పర్స్), నల్లి (మైట్స్)తో సహా అనేక రకాల కీటకాలను నాశనం చేస్తుంది.

తొలి కో-క్రియేటెడ్ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసిన నథింగ్

న్యూఢిల్లీ: నథింగ్ తాజాగా కమ్యూనిటీ ఎడిషన్ ప్రాజెక్ట్ అంతిమ ఫలితాలను విడుదల చేసింది. ద ఫోన్ (2) ప్లస్ కమ్యూనిటీ ఎడిషన్ నథింగ్ మొదటి సహ-సృష్టించిన ఉత్పత్తి (కో-క్రియేటెడ్ ప్రొడక్ట్). దీని అత్యంత ప్రతిభ కలిగిన కొంతమంది అనుచరులు నేరుగా నథింగ్ టీమ్‌తో కలిసి పని చేసారు. హార్డ్ వేర్ నుండి వాల్ పేపర్స్ వరకు, ప్యాకేజింగ్ నుండి మార్కెటింగ్ వరకు, ఈ స్మార్ట్ ఫోన్‌ను నథింగ్ కమ్యూనిటీ ఊహతో పూర్తిగా తీర్చిదిద్దబడింది. కంపెనీ, కమ్యూనిటీ మధ్య అడ్డంకిని నిర్మూలించాలని కోరుకునే ఒక కొత్త విధానానికి నథింగ్ మార్గదర్శకత్వంవహిస్తోంది. ఈ ప్రాజెక్ట్ గణనీయమైన ప్రాధాన్యతని పొందింది, ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల నుండి 900కి పైగా ఎంట్రీలు వచ్చాయి. కమ్యూనిటీ ఎడిషన్ ప్రాజెక్ట్ నథింగ్ మొదటి ప్రధానమైన పైలట్. ఇది హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్, కంటెంట్‌ను తన కమ్యూనిటీతో సహ-సృష్టిస్తుంది. వ్యాపారం భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకమైన చర్యను ముద్రించింది.

క్యాస్ట్రోల్ ఇండియా ఎండీగా కేదార్ లేలే

హైదరాబాద్: ప్రముఖ లూబ్రికెంట్ తయారీదారు అయిన క్యాస్ట్రోల్ ఇండియా లిమిటెడ్ 2024 నవంబర్ 1 నుండి దాని కొత్త మేనేజింగ్ డైరెక్టర్‌గా కేదార్ లేలేని నియమించినట్లు ప్రకటించింది. హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్‌లో రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్ తర్వాత కేదార్ క్యాస్ట్రోల్ ఇండియాలో చేరారు. హెచ్ యూఎల్‌లో ఆయన చివరిగా కంపెనీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. దక్షిణాసియాలోని సేల్స్, కస్టమర్ డెవలప్‌మెంట్‌కు బాధ్యత వహించారు. అధిక-పనితీరు గల బృందాలను నడిపించడం, వృద్ధిని ముందుకు తీసుకెళ్లడం, వినూత్నతలను ప్రోత్సహించడంలో తన లోతైన నైపుణ్యంతో, అభివృద్ధి చెందుతున్న ఆటోమోటివ్, లూబ్రికెంట్ల పరిశ్రమలో క్యాస్ట్రోల్ ఇండియా భవిష్యత్తును నడిపించడంలో కేదార్ కీలక పాత్ర పోషించబోతున్నారు. క్యాస్ట్రోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ రాకేష్ మఖిజా మాట్లాడుతూ, సంక్లిష్ట మార్కెట్‌లలో పెద్ద జట్లను నడిపించడంలో అతని అపార అనుభవం క్యాస్ట్రోల్ ఇండియాకు దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

మాధవీ బుచ్ ధిక్కారం వెనక

కొంతమంది మంచి పనులు చేసి కీర్తిమంతులు అవుతారు. మరికొంతమంది అప్రతిష్ఠాకరమైన పనులుచేసి వార్తల్లోకి ఎక్కుతారు. సెక్యురిటీస్ అండ్ ఎక్స్‌చేంజ్ బోర్డ్ (సెబి) అధ్యక్షురాలు మాధవి బుచ్ అప్రతిష్ఠాకరమైన పనులుచేసి నలుగురి నోళ్లల్లో నానుతున్నారు. వృత్తి రీత్యా ఆమె వ్యాపారవేత్త. ఆమెను 2022 మార్చి ఒకటిన సెబి అధ్యక్షురాలిగా నియమించారు. సెబి కి అధ్యక్షురాలైన మొదటి మహిళ ఆమే. కానీ ఇంతకు ముందు ఏ సెబీ అధ్యక్షుడూ ఆమె అంతగా వార్తలకెక్కలేదు. అయితే అదంతా అప్రతిష్ఠాకరమైన పనులు చేయడంవల్లే జరిగింది. హిండెన్ బర్గ్ అదానీ వ్యవహారం బయటపెట్టిన తరవాత ఈ ఫిర్యాదు సుప్రీంకోర్టుకు ఎక్కింది. సుప్రీంకోర్టు ఈ విషయంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించకుండా ఆ బాధ్యత సెబీకి అప్పగించింది. సెబీ అధ్యక్షురాలైన మాధవీ బుచ్ మాత్రం అదానీ ప్రయోజనాలను పరిరక్షించడానికే కంకణం కట్టుకున్నారు. అందువల్ల ఆమె అదానీ పాల్పడ్డ అవకతవకలు ఏ మాత్రం బయటకు పొక్కకుండా సకల జాగ్రత్తలు తీసుకున్నారు. షేర్ మార్కెట్లో చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టే వారి ప్రయోజనాలు పరిరక్షించడం కోసం సెబీ ఏర్పాటైంది. మాధవీ బుచ్ మాత్రం బడా వ్యాపారి అదానీని వెనకేసుకు రావడానికి సకల ప్రయత్నాలూ చేస్తున్నారు. ఆమె నడవడిక చూస్తుంటే ఎవరినీ లెక్కచేసే స్థితిలో ఉన్నట్టు లేరు. పార్లమెంటు స్థాయీ సంఘం పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశానికి హాజరు కావాలని ఆ కమిటీ ఆమెకు నోటీసు పంపింది. ఆ నోటీసును ఆమె తృణ ప్రాయంగా భావించినట్టున్నారు. తాను బొంబాయి నుంచి దిల్లీ రావడం కుదరదని తెగేసి చెప్పారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉంటూ పార్లమెంటు స్థాయీ సంఘమైన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశానికి హాజరు కాకపోవడానికి ఆమెకు అంత సాహసం ఎక్కడి నుంచి వచ్చిందో అంతుబట్టదు అనడానికీ వీలులేదు. ఆమెకు మోదీ ప్రభుత్వం అండ నిండుగా ఉంది. మోదీ ప్రభుత్వం అండ ఆమెకు ఉందని చెప్పడానికి ఆమె గైరుహాజరు కావడాన్ని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ న్యాయశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ చేసిన వాదనలే నిదర్శనం. కాంగ్రెస్ నాయకుడు కె.సి.వేణుగోపాల్ అధ్యక్షతన ఉన్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశాలను వేణుగోపాల్ నిర్వహిస్తున్న తీరును రవి శంకర్ ప్రసాద్ దుయ్యబట్టారు. సాధారణంగా పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశాల్లో జరిగే విషయాలను బయట చర్చించడం ఆనవాయితీ కాదన్నది ఆయన ప్రధాన వాదన. విచిత్రం ఏమిటంటే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అధ్యక్షుడి ప్రవర్తనను విలేకరుల సమావేశంలో దుయ్యబట్టి రవి శంకర్ ప్రసాద్ ఏ పని అయితే చేయకూడదని ఆయన చెప్తున్నారో సరిగా అదేపని ఆయనా చేశారు. మాధవి బుచ్ హాజరు కానందువల్ల కె.సి.వేణుగోపాల్ ఆ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసి వెళ్లిపోయారు. ఇది అక్రమం అని రవి శంకర్ ప్రసాద్ అంటున్నారు. ఆ కమిటీలో బీజేపీ వారే అధిక సంఖ్యలో ఉన్నారని ఆయన గుర్తు చేశారు. పార్లమెంటు స్థాయీ సంఘాలలో అధికార పార్టీకో, అధికార పక్షానికో చెందిన వారే సహజంగా ఎక్కువ మంది ఉంటారు. ఇందులో వింతేమీ లేదు. తమను కె.సి.వేణుగోపాల్ మాట్లాడనివ్వ లేదన్నది ఆయన మరో వాదన. అసలు మాధవీ బుచ్ వ్యవహారం చర్చించనున్నట్టు కూడా తమకు తెలియదంటున్నారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అల్లా టప్పా కమిటీ కాదు. దాన్ని పార్లమెంట్ ఏర్పాటు చేస్తుంది. పార్లమెంటు సమావేశాలకు ఎంత విలువ ఉంటుందో పార్లమెంటరీ కమిటీలకు కూడా అంతే ప్రాధాన్యం ఉంటుంది. ఆ కమిటీ హాజరు కావాలని నోటీసు పంపితే హాజరు కాలేనని మాధవీ బుచ్ చెప్పగలిగారంటే ఆమెకు ఎవరి దన్ను ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

అదానీ నడిపే సంస్థల్లో ఆమెకూ వాటాలు ఉన్నాయన్న ఆరోపణ ఇదివరకే వచ్చింది. అంటే అదానీని వెనకేసుకు రావడంలో భాగంగా ఆమె తన వ్యాపార ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పడానికి గొప్ప పాండిత్యం అవసరంలేదు. మాధవి బుచ్ కనక పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి హాజరైతే ఆమె ఏ రహస్యాలైనా బయటపెడ్తే అది తమకే ప్రమాదమని మోదీ బృందం భయపడుతున్నందువల్లే ఆమె గైరుహాజరు కావడంలోనూ అత్యున్నత స్థాయి నేతల ప్రభావం ఉందన్న అనుమానం రావడం అసహజం ఏమీ కాదు. మాధవీ బుచ్‌ను వెనకేసుకు రావడానికి మోదీ "సిండికేట్" ప్రయత్నిస్తోందని లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా బాహాటంగానే విమర్శిస్తున్నారు. మాధవీ బుచ్ మీద ఎన్ని ఆరోపణలు వచ్చినా మోదీ ప్రభుత్వం ఆమె మీద ఈగ అయినా వాలకుండా భారీ రక్షణ కవచం నిర్మించినట్టు కనిపిస్తోంది. యు.పి.ఎ. అధికారంలో ఉన్నప్పుడు ఎవరి మీదైనా తీవ్రమైన ఆరోపణలు వస్తే వారిని పదవుల్లోంచి తప్పించేవారు. అవినీతి ఆరోపణలతో సకల ఆరోపణలను చాప కిందకు తోసేయడం మోదీ ప్రభుత్వ విశిష్ట శైలి. అపఖ్యాతి పాలైన వారిని ఎవరినైనా తొలగించాలంటే మోదీకి చచ్చేటంతటి భయం. ఆ సెగ తనకు ఎక్కడ తగులుతుందోనని ఆయన మచ్చ పడ్డ వారిని కాపాడడానికే ప్రాధాన్యం ఇస్తుంటారు. మాధవీ బుచ్ మీద మోదీ ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా ఆమె మోదీని కూడా ముగ్గులోకి లాగే ప్రమాదం ఉంది కనకే ఆయన కిమ్మనడం లేదేమోనన్న అనుమానం వస్తోంది. అందుకే ఆమె అక్రమ ప్రవర్తనకు సంబంధించి ఎన్ని రుజువులు చూపినా మోదీ నోరు మెదపడం లేదు. మాధవీ బుచ్ కనక నోరుతెరిస్తే అదానీకి మోదీకి మధ్య బంధం ఏమిటో బయటపడే అవకాశం ఉంది. మచ్చపడిన వారిని కాపాడడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్న వారు ఎవరైనా చేయవలసిన పనికాదు. మాధవీ బుచ్ నడవడికే కాదు. ఆమె వ్యాపార సంబంధాలన్నీ అనుమానాస్పదమైనవే. 2021లో ఆమె గ్రీన్ వరల్డ్ అండ్ ఇంఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి తన ఫ్లాట్ అద్దెకిచ్చారు. ఆ కంపెనీలో ఉన్న ఉన్నతాధికారులు ముకుల్, విపుల్ బన్సల్ ఉన్నత పదవుల్లో పని చేస్తున్నారు. అంటే ఆ కంపెనీకి ఇండియా బుల్స్ తో సంబంధం ఉన్నదే. ఆ వ్యవహారం కూడా సెబీ విచారిస్తోంది. సెబీ అధిపతిగా తాను ఏ సంస్థలమీద అయితే దర్యాప్తు చేస్తున్నారో వాటితోనే ఆమెకు వ్యాపార సంబంధాలు ఉండడం అనైతికం అని మోదీకి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. అయినా ఆయన చలించరు. అదానీని కాపాడడానికి మోదీ ఎవరినైతే కీలక స్థానాల్లో నియమించారో వారంతా నిజం బయటపెడ్తే తనకే నష్టం అన్న విషయం మోదీకి బాగా తెలుసు.

నాయకులు మారాలి

నాయకులారా మీరు మారండి. మారితే మీకే మంచిది. మారకపోతే ప్రజలే మారుస్తారు. మీకు మీరుగా మారితే సంతోషం. మారకపోతే మేమే మారుస్తాం. ఏంటి బావ ఏకంగా నాయకుల మీద పడ్డావు. జాగ్రత్త వారికి కోపం వస్తే మనకు శ్రీకృష్ణ జన్మస్థానం ప్రాప్తిరస్తు. ఎందుకు బావ అలా భయపడిపోతావు. జైల్లో పుట్టిన శ్రీకృష్ణుడు అందరికీ ఆరాధ్య దైవంగా మారాడు. మన నాయకులు ఎంతోమంది జైల్లో మగ్గినవారే. వారంతా ఇప్పుడు ప్రజలకు పూజనీయులే. పోరాడితే పోయేదేమీలేదు బానిస బతుకు తప్ప అనే మాట మరిచావా. నిజమే బావ ప్రజలకు ఇప్పుడు కమ్యూనిస్టులు గుర్తుకొస్తున్నారు. ఎందుకంటే ముఖ్యంగా 1940 నుంచి 1964 వరకు వారు నిస్వార్థంగా ప్రజల కోసం వారి అవసరాలు తీర్చడం కోసం అప్పటి ప్రభుత్వాల మీద పోరాటం చేసి జైలుకెళ్లిన వారే. అందువల్ల ప్రస్తుతం వారు ప్రజలకు గుర్తుకొచ్చి మరల కమ్యూనిస్టులు ప్రజల్లోకి వచ్చి ప్రజలలో మమేకమై వారికోసం పోరాటం చేయాలని కోరుతున్నారు. నిజమే వారి అవసరం కనబడుతోంది. ప్రధాన స్థానిక పార్టీలు రెండూ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలతో వాటిని బహిర్గతం చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం నాయకులు జగన్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఒకవేళ తరువాత మరల జగన్ ప్రభుత్వం వస్తే దేశం ప్రభుత్వం అవినీతి బహిర్గతం చేయడంతో పాటు

వారిని జైలుపాలు చేస్తారని బహిరంగంగానే చెబుతున్నారు. అంటే స్థానికంగా పార్టీలు రెండు ప్రజల సొమ్ము ఎంతవరకు వీలుంటే అంతవరకు బొక్కేశారని ప్రజలకు అర్థమవుతోంది. ఈ స్థితిలో వచ్చే ఎన్నికలలో మరల వారిని ఎన్నుకోవాలా ప్రత్యామ్నాయం లేదా అని ప్రజల్లో ఆలోచనలు మొదలైనాయి. ఈ స్థితిలో గతంలో కమ్యూనిస్టులు చేసిన సేవలు ప్రజలు నెమరు వేసుకుని తిరిగి వారు ప్రజల్లోకి వచ్చి గతంలో వలె ప్రజల కోసం పోరాటం చేస్తే బాగుండుననే ఆలోచనలు మొదలయ్యాయి. బీజేపీ సమాజంలో అసమానతలు ప్రోత్సహిస్తే కాంగ్రెసు పార్టీలో అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతుంది.

ఈ స్థితిలో ప్రజలకు యితరంగా కమ్యూనిస్టులు గుర్తుకు రావడం ముదావహం. కాని ప్రజల ఆసక్తికి అనుగుణంగా కమ్యూనిస్టులు గతంలో వలె పనిచేయడానికి సిద్ధపడగలరా అనే సందేహం ప్రజల్లో నీలినీడలా కనబడుతోంది. ఆ సందేహం నివృత్తి చేయవలసిన బాధ్యత కమ్యూనిస్టులదే. వైసీపీ, టీడీపీ పార్టీలు ఒకరిపై ఒకరు అవినీతి చిట్టాలు బయటకులాగి కక్ష సాధింపు చర్యలకు కేటాయించే సమయం ప్రజల సమస్యలకై వెచ్చించడంలేదు. ప్రతిరోజు పత్రికలలో జగన్‌పై దాడికి సంబంధించిన వార్తలే తప్ప అభివృద్ధికి సంబంధించిన వార్తలు అతి తక్కువగా కనబడుతున్నాయి. నిజమే అసలు రాజకీయ నాయకుల్లో మార్పు అవసరం. ప్రతి నాయకుడు ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నానంటాడు. స్వంత వ్యాపారాలు మానేసి ప్రజాసేవలో నిమగ్న మయ్యానంటాడు మరి. ఆస్తులు కోటానుకోట్లు ఎలా **పెరుగుతు**న్నాయో ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. అసలు నిజంగా ఉన్న ఆస్తులు బయటపెట్టక పోయినా ఒక ఎన్నికల తరువాత జరిగే మరో ఎన్నికలకు వారిచ్చే ఆస్తుల వివరాలు ఎలా పెరుగుతున్నాయనేది ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టి పోటీచేసేది ప్రజా సేవకా, ప్రజల ఆస్తులు మింగేయడానికి అని ప్రజలు ఆలోచిస్తున్నారు. ఎన్నికల కోసం అధికారం కోసం ప్రజల్లో కులమత వైషమ్యాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్న తీరు ప్రజలు నిశితంగా గమనిస్తు న్నారు. గతంలో లేని కుల ప్రాతిపదికన సీట్లు కేటాయింపుతో ప్రజల్లో అసమానతలు పెరిగిపోతున్నాయి. అన్ని కులాల వారికి సీట్లు ఇచ్చి, మంత్రి పదవులు ఇచ్చామని ప్రకటనలు ఇచ్చి, దిగువ కులాల మంత్రులను డమ్మీలుగా మారుస్తున్న వైనం తెలిసిందే. ప్రస్తుతం కుల గణన బీసీ నాయకుల కోరిక మేరకు ప్రభుత్వం మొదలుపెట్టింది. అతి తక్కువ జనాభా ఉన్న కులాల వారికి ఈ పార్టీలు సీట్లిచ్చి గెలిపించగలవా. అసలు గతంలో గతంలో లేని కులాల కుంపట్లు రాజేసింది నాయకులే కదా. ఆంగ్లేయులది డివైడ్ అండ్ రూలు అన్నారు. మరి మన నాయకులు కులాల వారిగా టికెట్లు మంత్రి పదవులు ఇవ్వడం డివైడ్ అండ్ రూలు కాదా. ఆనాడు ఆంగ్లేయులను ఆడిపోసుకున్న మన నాయకులు ఇప్పుడు ఎవరిపై యుద్ధం చేస్తారు. అధికారం కోసం కులమతాలను రెచ్చగొడుతున్న నాయకుల తీరు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. సమాజాన్ని అభివృద్ధిపథంలో నడపవలసిన నాయకుల కులమత విద్వేషాలను రెచ్చగొట్టి సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న నాయకులు మారాలి. సమాజంలో మార్పు నాయకులతోనే మొదలు కావాలి. యధారాజా తథాప్రజా అన్నట్లు అవినీతిలో నాయకుల్ని అనుసరిస్తున్న వారి అనుచరగణం నాయకుల మార్పుతో వారిలోను మార్పు వచ్చి తద్వారా సమాజ మార్పునకు దోహదపడుతుంది. అందుకే నాయకులా మారండి అనే స్లోగను యువత అందుకోవడానికి సిద్ధంగా ఉంది.

సెల్: 9885569394

పోరాటాల వేదిక ఏఐటీయూసీ

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

బొంబాయి నగరంలో 1920 అక్టోబర్ 31వ తేదీన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లాలాలజపతిరాయ్ అధ్యక్షతన ఏఐటీయూసీ ఏర్పడింది. నాటి నుంచి కార్మికవర్గ హక్కుల కోసమే గాక దేశ స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు చేసింది. ఆ తర్వాత ఆధునిక భారతదేశ నిర్మాణం కోసం అద్వితీయమైన కృషి చేసింది. అసాధారణ త్యాగాలు, బలిదానాలు చేశారు. పోలీసు దాష్టీకాలు, పెట్టుబడుదార్ల గూండాల దాడులు, యావజ్జీవ శిక్షలు, మరణ దండనలతో ఏఐటీయూసీ చరిత్ర యావత్తు ఎరు పెక్కింది. రష్యాలో అక్టోబర్ సోషలిస్టు మహావిప్లవం విజయవంతమై కార్మికవర్గం నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా ఏఐటీయూసీ ఏర్పడింది. జలియన్ వాలాబాగ్‌లో 1919 ఏప్రిల్‌లో వైశాఖీ పండుగ సందర్భంగా వేలాదిమంది ప్రజలపై బ్రిటిష్ పోలీసులు విచక్షణారహితంగా జరిపిన పోలీస్ కాల్పుల్లో కొన్ని వందల మంది మరణించిన దుర్ఘటన పట్ల దేశ మంతటా ఆగ్రహజ్వాలలు ఎగిసిపడ్డాయి. దేశం నాలుగు చెరగులా ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమిస్తున్న రోజులవి. వివిధ నగరాలలో 16,17గం.ల పనిదినం అమలు జరిగేది. దీర్ఘకాలిక కాంట్రాక్టులపై కార్మికులచేత పనిచేయించుకునేవారు. పెట్టుబడిదారుల దాష్టికాన్ని భరించలేక కార్మికులు కాంట్రాక్టు షరతులను ఉల్లంఘించేవారు. తక్షణమే కార్మికులపై పెట్టుబడిదారులు హింసకు పాల్పడేవారు. అరెస్టులు, దౌర్జన్యాలు సర్వసాధారణం. బ్రిటిష్ పెట్టుబడిదారుల అవసరాలకోసం రైల్వే, ఓడరేవులు లాంటి మౌలిక సౌకర్యాల నిర్మాణం ప్రారంభమైంది. దేశంలోని అనేక నగరాలలో జనపనార, వస్త్రమిల్లులు ఏర్పడినాయి. తేయాకు, కాఫీ తోటలపెంపకం పెరిగింది. పారిశ్రామిక కార్మి కవర్గం ఏర్పడింది.1913 నుంచి 1920 మధ్యకాలంలో వివిధ రంగాలలో అనేక కార్మికసంఘాలు ఏర్పడ్డాయి.

ఏఐటీయూసీ ఏర్పడిన సందర్భంగా 10 వేలమంది కార్మికులతో బొంబాయి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభలో 1,40,854 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 101 మంది ప్రతినిధులను ఎంపిక చేశారు. స్వయంగా పాల్గొనలేకపోయినప్పటికీ, 43 కార్మిక సంఘాలు ఏఐటీయూసీ ఏర్పాటుకు మద్దతు తెలిపాయి. మోతిలాల్ నెహ్రూ, మహమ్మదాలీ జిన్నా, అనిబిసెంట్ లాంటి ఉద్దండులు ఈ వ్యవస్థాపక మహాసభకు హాజరయ్యారు. ఏఐటీయూసీ ఏర్పాటును మహాత్మా గాంధీ వ్యతిరేకించారు. ఝరియాలో 1921లోజరిగిన ఏఐటీయూసీ రెండో మహాసభలో భారతదేశానికి "సంపూర్ణ స్వాతంత్ర్యం" డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ఈ డిమాండ్‌ను రాజకీయ ఎజెండాపైకి మొదటిసారిగా తీసుకువచ్చి, ప్రజానీకాన్ని మేల్కొల్పిన ఘనత ఏఐటీయూసీకే దక్కింది.

1928లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ పార్టీ మహాసభల ప్రాంగణంలోకి 50 వేల మంది కార్మికులు చొచ్చుకువెళ్లి "సంపూర్ణ స్వాతంత్ర్య" డిమాండ్ ను ఆమోదిస్తూ తీర్మానించాలని నినాదాలు చేశారు. ఆ తర్వాత 1929లో లాహొర్ కాంగ్రెస్ సభలలో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని ఆమోదించారు. ఏఐటీయూసీ లేవనెత్తిన ఈ డిమాండ్‌ను ఆమోదించటానికి కాంగ్రెస్ పార్టీకి 8 సంవత్సరాలు పట్టింది. స్వతంత్ర పోరాటంలో ఏఐటీయూసీ గణనీయమైనపాత్ర పోషించింది.1919 నుండి 1922 వరకు జాతీయ పోరాటాల వెల్లువ కాలంలో ఏఐటీయూసీ పెద్ద ఎత్తున పాల్గొంది. స్వతంత్ర భారతదేశంను సోషలిస్ట్ రిపబ్లిక్‌గా ప్రకటించాలని ఏఐటీయూసీ 1924 లో తీర్మానించింది.1925 డిసెంబర్ 26 వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగానూ, వేల్స్ యువరాజు భారతదేశ సందర్శన సమయంలోనూ, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగానూ లక్షల సంఖ్యలో కార్మికవర్గం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గాంధీజీ అరెస్టుకు నిరసనగా 1930 మే 5 వ తేదీన షోలాపూర్ బట్టల మిల్లుల కార్మికులు 50 వేలమంది సమ్మె చేశారు. ఇతర కార్మికులతో కలిసి షోలాపూర్‌ను వారంరోజుల పాటు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. తిరిగి పట్టు సాధించేందుకు బ్రిటిష్ పాలకులు షోలాపూర్‌పై మే 12 వ తేదీన "మార్షల్" లా విధించారు. సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా బాంబేలో 90 వేల మంది కార్మికులు పనులు నిలిపివేశారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా 1935 చట్టానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ 1937 ఏప్రిల్ 1వ తేదీన ఒకరోజు సమ్మె నిర్వహించింది. సామ్రాజ్యవాదులు విధించిన నూతన రాజ్యాంగ చట్టానికి బదులుగా "వయోజన ఓటింగ్" హక్కుతో ఒక "రాజ్యాంగ సభ" ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌ను కూడా మొదటిసారిగా లేవనెత్తిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుంది. ఈ కాలంలోనే కార్మిక సంఘాల ప్రముఖ నాయకులపై బ్రిటిష్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడింది. "డిఫెన్స్ ఆఫ్ ఇండియా" నిబంధనల కింద ప్రముఖ కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేసింది. కార్మికసంఘాల కార్యాలయాలపై దాడులు చేసి మూసివేయించింది. ఇండియన్ నేషనల్ ఆర్మీకి చెందిన కెప్టెన్ సెహగల్, ధిల్లాన్, షానవాజ్‌ఖాన్‌ల విచారణకు వ్యతిరేకంగా కార్మికవర్గం భారీప్రదర్శనలు నిర్వహించింది. ఈ సమ్మెల ప్రభావంతో సైనిక దళాలలోనూ సమ్మెలు జరిగి దేశం అట్టుడికి పోయింది. దిల్లీలో మకాంవేసిఉన్న రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగులు కూడా జాతి వివక్షతకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. కలకత్తాలోనూ అటువంటి

సమ్మె జరిగింది. 1946 ఫిబ్రవరి 18వ తేదీన రాయల్ ఇండియన్ నావికులు తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుదారుల విజ్ఞప్తిమేరకు బొంబాయిలో 3 లక్షలమంది కార్మికులు సంఘీభావ సమ్మె చేశారు. ఈ సందర్భంగా నావికులు కొన్ని ఓడలను సైతం స్వాధీనం చేసుకున్నారు. బ్రిటిష్ సైనికులు కాల్పులు జరపగా, అధికారుల లెక్కల ప్రకారమే 250 మంది కార్మికులు మరణించారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ప్రతిఘట్టంలోనూ కార్మికవర్గం సముచిత పాత్ర పోషించింది. అణచివేతకు గురైంది. అసాధారణ త్యాగాలు చేసింది. స్వతంత్ర పోరాటంలో కీలకభాగంగా వ్యవహరించింది. అందువల్లనే స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన రాజ్యాంగంలో కొన్ని కార్మిక హక్కుల చట్టాలు చేశారు. అవి: 1. అధికరణం 19: సంఘం పెట్టుకునే హక్కు, 2. అధికరణం 21: న్యాయబద్ధమైన కనీసవేతనం పొందే హక్కు కర్మాగారాలు ఇతర ప్రదేశాలలో పనిచేయు కార్మికులకు తగిన వసతులు, గౌరవ ప్రదమైన జీవితం కల్పించడం 3. అధికరణం 23: శ్రమదోపిడి నుంచి రక్షణ పొందే హక్కు 4.అధికరణం 24: 14 సంవత్సరాలలోపు పిల్లల చేత ఫ్యాక్టరీలు, గనులలో ఇతర ప్రమాదభరిత ఉత్పత్తి ప్రక్రియలలోనూ పనిచేయించడంపై నిషేధం, 5. అధికరణం 38 (2): ప్రజల మధ్య హోదా, సౌకర్యాలు, అవకాశాలలోగల తారతమ్యాలను తొలగించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి, 6.అధికరణం 39: ఉత్పత్తి పరికరాలు, సంపద కేవ లం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమై, సామాన్యుల ప్రయోజనాలకు విఘాతం కలగని విధంగా ఆర్థిక విధానాలు రూపకల్పన, స్త్రీ, పురుషులందరికీ సమానమైన ఉద్యోగాలలో సమానమైన వేతన సిద్ధాంతాన్ని అమలు చేయాలి. 7.అధికరణం 42: పనిచేసే ప్రదేశాలలో మానవీయత, ప్రసూతి సౌకర్యాల కల్పన ప్రభుత్వ బాధ్యత. 8.అధికరణం 43: కార్మికుల వేతనాలలో హేతు బద్ధత ఉండాలి. వ్యవసాయ, పారిశ్రామిక, ఇతర రంగాలలో పనిచేసే కార్మికులకు హేతుబద్ధమైన, గౌరవప్రదమైన జీవనానికి సరిపోయే వేతనాలకు (లివింగ్ వేజ్) తగిన శాసనాల ద్వారా హామీ కల్పించాలి. 9.అధికరణం 43 (ఏ): ఫ్యాక్టరీలు, పారిశ్రామిక సంస్థలు ఇతర ఎస్టాబ్లిష్మెంట్లు మొదలైన వాటి నిర్వహణలో కార్మికులను భాగస్వాములను చేసేందుకు తగిన శాసనాలను ప్రభుత్వాలు రూపొందించాలి. (1977లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణద్వారా ఈ అధికరణం చేర్చడమైంది). నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 'కార్మిక కోడ్స్'ను అమల్లోకి తీసుకు వచ్చేందుకు పూనుకున్నారు. కార్మికవర్గాన్ని బ్రిటిష్ కాలంనాటి దుర్భర పరిస్థితికి నెట్టేస్తున్నారు. ఈ విధానాలను భారతదేశంలోని యావత్ కార్మికవర్గం సంఘటితంగా ప్రతిఘటిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన మధ్యతరగతి ఉద్యోగులలో ట్రేడ్ యూనియన్ స్ఫూర్తినినింపి అనేక సంఘాలను నిర్మించింది. ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ఏఐటీయూసీ శ్రేణులు పోరాటాలకు అంకితం కావాలని ఏఐటీయూసీ పిలుపునిస్తోంది.

ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు

కార్మికవర్గ మార్గదర్శి దాస్ గుప్తా

చవెరా

"ఇంధనం పోసి మంట రాజేయండి! రగుల్కొన్న జ్వాలలో పెట్టుబడీదారీ విధానం మాడిపోక తప్పదు! ఇదే నా దిశ! ఇదే నా విశ్వాసం!" 2018 డిసెంబరు 11 వ తేదీ సాయంత్రం రాంచీలో జరిగిన ఏఐటీయూసీ, జనరల్ కౌన్సిల్ ముగింపు సభలో కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తా చివరి మాటలివి. ప్రధానకార్యదర్శిగా పదవీ విరమణచేస్తూ అనారోగ్యంతో ఉన్నా, ప్రసంగించలేని స్థితిలో జీరబోయిన గొంతుతో గురుదాస్ గర్జించారు. "నేను సంతోషంగా సెలవు తీసుకుంటున్నాను, సైద్ధాంతికంగా, నైతికంగా ఏఐటీయూసీని బలోపేతం గావించానన్న సంతృప్తితో కార్మికవర్గ లక్ష్యసాధన కోసం తన విధిని నిర్వహించేంతగా సంస్థను తీర్చిదిద్దానన్న సంతృప్తితో సెలవు తీసుకుంటున్న" గురుదాస్ నోటి నుండి ఈ మాటలు వెలువడతున్నప్పుడు అశ్రునయనాలతో యావత్తు సమావేశం ఉద్వేగంతో చలించిపోయింది. బెంగాల్ టైగర్ గురుదాస్ గుప్తా 2001లో హైదరాబాద్‌లో జరిగిన ఏఐటియూసీ జాతీయ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 16 సంవత్సరాలపాటు పనిచేశారు. "ఐక్యత, ఐక్యపోరాటం" కోసం తన యావత్‌శక్తిని కేంద్రీకరించారు. ఒక మహానాయకునిగా గుర్తింపు, గౌరవం పొందారు. గురుదాస్ దాస్ గుప్తా 1936 నవంబరు 3న దుర్గా ప్రసన్నదాస్ గుప్తా, నిహార్‌దేవి దంపతులు బరిపాల్ (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది)లో జన్మించారు. చిన్న వయసులోనే విద్యార్థి నాయకునిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. దేశ విభజన అనంతరం పశ్చిమబెంగాల్‌లో స్థిరపడ్డారు. అవిభక్త బెంగ్లా ప్రావిన్స్ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1967-77 మధ్య పశ్చిమబెంగాల్ ఏఐవైఎఫ్ ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. 1952లో సీపీఐ సభ్యత్వం స్వీకరించిన గురుదాస్ దాస్ గుప్తా పార్టీ చీలిక సమయంలో మాతృసంస్థ సీపీఐలోనే ఉన్నారు. చదువుకునే రోజుల్లో బెంగాల్ అసుతోష్ కాలేజీ విద్యార్థి యూనియన్ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైనారు. ఆ తరువాత 1985, 1988, 1994లో మూడుసార్లు రాజ్యసభకు ఎన్నికైనారు. 2004 లో తొలిసారి ఫాన్స్కురా నుంచి లోక్‌సభకు రెండవసారి ఘటల్ నియోజకవర్గం నుండి గెలిచారు. పార్లమెంటు సభ్యునిగా కార్మికుల, శ్రమజీవుల హక్కులకై తన వాణిని వినిపించారు. ఈయన పార్లమెంటులో ప్రసంగిస్తుంటే మాటలు అగ్నివర్షం కురిసినట్లు ఉండేవి. ఆయన పార్లమెంటు ప్రసంగాలు తోటి సభ్యులను సభ్యులను ఎంతో ఆకర్షింపచేసేవి. అవినీతి, అధికధరలు, కుంభకోణాల గురించి మాట్లాడితే సూటిగా, నిష్కర్షగా ఉండేవి. 2009 నుంచి పార్లమెంటు సీపీఐ సభా నాయకునిగా ఇతర రాజకీయపక్షాలతో సుహృద్భావంతో వ్యవహరించేవారు. నాటి ప్రధానమంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయి గురుదాస్‌ను ఎంతో అభిమానించేవారు. గురుదాస్ గుప్తా అంటూ ఆప్యాయంగా పేరుతో పిలిచేవారు.



పార్లమెంటులో బోఫోర్స్ కుంభకోణం, 2 జి స్పెక్ట్రమ్ స్కాంల సందర్భంగా ఏర్పాటైన పార్లమెంటరీ విచారణ కమిటి సభ్యునిగా గురుతరమైన బాధ్యతను నిర్వహించారు. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను ఆయన ముఖత: "మీరు విధి నిర్వహణలో తప్పు చేస్తున్నారు." అని సూటిగా ప్రశ్నించిన ధీశాలి గురుదాస్ దాస్‌గుప్తా. 2జి స్కాంలో జాయింట్ పార్లమెంటురీ కమిటీ నివేదికను వ్యతిరేకించి అసమ్మతి నోట్‌ను ప్రకటించారు. గురుదాస్ అసమ్మతి నోట్ రాజకీయ వర్గాలలో విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. గురుదాస్ పార్లమెటు సభ్యునిగా ఢిల్లీలోని కౌనింగ్ లేన్‌లోని చిన్న బంగ్లాలోనే నివాసం ఉండేవారు. చాలా సాధారణమైన, నిరాడంబర జీవితం గడిపేవారు. పార్టీ సమావేశాలలో 2,3 రోజులపాటు ఒకే బట్టలు ధరించేవారు. 1970 వ దశకంలో కామ్రేడ్ గురుదాస్ గుప్తా కార్మికరంగంలో పనిచేయడం ప్రారంభించారు. 2001లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా కార్మికసంఘాల నిర్మాణాన్ని పరుగులు పెట్టించారు. ఏఐటీయూసీని ఒక సమరశీల నిర్మాణ సంస్థగా తీర్చిదిద్దారు. ఏఐటియూసీ సమావేశాలలో ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలవారికి సౌలభ్యంగా ఉండేవిధంగా హిందీ, ఇంగ్లీషు భాషల్లో ఒకేసారి ప్రసంగించేవారు. ఈ సామర్థ్యం ఒక్క గురుదాస్‌కే స్వంతం. సమావేశాలలో గురుదాస్ ప్రసంగిస్తున్నంతసేపు నిశ్శబ్దంగా ఉండేది. ఎవ్వరూ మాట్లాడేవారు కాదు, కదిలేవారు కాదు. ఉద్వేగ పూరిత ప్రసంగాలు సభ్యులను ఎంతగానో ప్రభావితంచేసి కార్యాచరణకు పురికొల్పేవి. ఈయన మంచి ఆర్గనైజరుగా, ఉపన్యాసకునిగా పోరాటయోధునిగా గుర్తింపుపొందారు. గురుగావ్ హోండా కార్మికుల ఉద్యమం సందర్భంగా ఈయన పట్ల పోలీసులు కరుకుగా వ్యవహరించి జైలులో నిర్బంధించారు. విడుదలైన మరుసటి రోజు రక్తసిక్త వస్త్రాలను పార్లమెంటులో ప్రదర్శించి ఆయన చేసిన ప్రసంగం యావత్ లోక్‌సభను కుదిపివేసింది. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా భిన్న రాజకీయ అభిప్రాయాలు కలిగిన బిఎంఎస్. ఐఎన్‌టియుసి నాయకులనుసైతం ఒకే వేదికమీదకు తీసుకువచ్చారు. ట్రేడ్ యూనియన్ల దేశవ్యాప్త స్పాన్సరింగ్ కమిటీని ఏర్పాటుచేసి ఐక్యత, ఐక్యపోరాటాలను ముందుకు తీసుకు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా కాలంలో వారి అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టియుసి సైతం సమ్మెలో పాల్గొనే విధంగా ఒప్పించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు సంజీవరెడ్డితో మంచి సంబంధాలు నెరపేవారు. 2005 సెప్టెంబరు 29న అతి పెద్ద దేశవ్యాపిత సార్వత్రికసమ్మెకు నాయకత్వం వహించారు. బ్యాంకులు, రక్షణ, ఇన్సూరెన్సు, ప్రభుత్వరంగ పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు ఈ పోరాటంలో భాగస్వామ్యంవహించే విధంగా గురుదాస్ విశేషంగా కృషిచేశారు. 1991 ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో జరిగిన వివిధ సార్వత్రిక సమ్మెలలో గురుదాస్ నాయకత్వ పాత్ర, కృషి విస్మరించలేనది. 2013 డిసెంబరు 13 వతేదీ లక్షలాది మంది ఉద్యోగ, కార్మికుల "మహాపడావ్" కార్యక్రమాలలో కీలకభూమిక పోషించారు. న్యూదిల్లీ దీనదయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లో ఏఐటీయూసీ జాతీయ కార్యాలయ నిర్మాణానికి విశేష కృషి చేశారు. దేశవ్యాపితంగా అన్ని రాష్ట్రాలు పర్యటించి కార్మిక సంఘాల నుంచి నిధులు సేకరించి భవన నిర్మాణం సకాలంలో పూర్తిచేయించారు. కార్యాలయంలో నిత్యం కార్యకర్తలతో, సమావేశా లతో బిజీగా ఉండేవారు. 1995 బైలదిల్లీ ఇనుప ఖనిజం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ లోక్‌సభలో ప్రసంగిస్తూ ఉద్విగ్నతకుగురై కన్నీరు పెట్టుకున్నారు. దేశ సమస్యలపై సభ లోపల, బైటా పోరాడారు.కామ్రేడ్ గురుదాస్ గుప్తాను 1965 లోనే డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ క్రింద నిర్బంధించారు. ఆ తరువాత ప్రజా ఉద్యమాలలో అనేకసార్లు రహస్య జీవితం గడపవలసి వచ్చింది. 2014లో నాటి సీపీఐ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏ.బి. బర్ధన్‌తో కలిసియపీఏ1 ప్రభుత్వం ఏర్పాటులో కీలక బాధ్యతలు నిర్వహించారు. 1991లో నాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్‌లు తెచ్చిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్(ఎల్‌పిజి)ని తీవ్రంగా ప్రతిఘటించారు. పార్లమెంటు లోపలే, బయట ప్రతిఘటనోద్యమానికి నేతృత్వం వహించారు. బ్యాంకుల ప్రైవేటీకరణ, ఇన్సూరెన్సు, కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబరు కోడ్‌లను తేవటాన్ని నిరసించారు. పార్లమెంటు కార్మిక సంప్రదింపుల కమిటీ సభ్యునిగా కార్మికులపక్షాన వాదించారు. యూపీఏ1 ప్రభుత్వం తీసుకున్న పెట్టుబడుల ఉపసంహరణ చర్యలను పోరాడి నిలువ రించారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను గుర్తించి సమగ్రచట్టం డిమాండ్‌చేస్తూ 2009 లో సమ్మె నిర్వహించారు. 1970లో బుడాపెస్టులో జరిగిన అంతర్జాతీయ యువజనోత్స వాలలో భారతదేశ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించారు. 2004లో సీపీఐ, జాతీయ కార్యదర్శివర్గానికి ఎన్నికై పార్టీ, ట్రేడ్ యూనియన్ల అభివృద్ధికి కృషి చేశారు. పంజాబ్‌లో ఖలిస్తాన్ తీవ్రవాద ఉద్యమం సాగుతున్నరోజుల్లో ఒక అవినీతి కేసునుబయటపెట్టి నందుకుగాను తనకు రెమ్యూనరేషన్ క్రిందవచ్చిన 7.5లక్షల రూపాయలను పంజాబ్ ఉగ్రదాడుల్లో మరణించిన పిల్లల పునరా వాసానికి విరాళంగా అందించిన మనవతావాది గురు దాస్ గుప్తా. 2018 అక్టోబరు 31 వ తేదీ ఏఐటీయూసీ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సభ, జాతీయ సమితి సమావేశాలు బొంబాయిలో కొద్ది గంటలలో జరుగనున్నాయి. అన్ని ప్రాంతాల నుంచి ప్రతినిధుల బొంబాయి వచ్చిఉన్నారు. ఆ తరుణంలో 83 ఏట కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తా లంగ్ కేన్సరుతో మృతి చెందారని విషాద వార్త తెలిసింది. దీనితో యావత్ దేశకార్మికవర్గం విషాదానికి సరైంది. కార్పొరేట్ ఆర్థిక నేరాలను అడుగడుగున ప్రతిఘటించిన, కార్మికో ద్యమాన్ని పునరుజ్జీవించేసిన యోధుని అస్తమయం అదీ తన పుట్టిన రోజుకు మూడురోజుల ముందు, తాను ప్రేమించిన కార్మిక సంఘం 99 వ పుట్టినరోజున ఆయన మరణించడం అత్యంత విచారకరం. శ్రమజీవుల గొంతుక, అత్యుత్తమ కమ్యూనిస్టు కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తాకు 5 వ వర్ధంతి సందర్భంగా విప్లవ జోహార్లు.

"బంగారు హృదయంతో పిడికిలి పైకెత్తి తిరుగుబాటుదారుడు మళ్లీవస్తాడు" కార్మికోద్యమంలో కామ్రేడ్ గురుదాస్ స్ఫూర్తి సదా గుర్తుంటుంది.

(నేడు గురుదాస్ దాస్ గుప్తా 5 వ వర్థంతి సందర్భంగా)

సెల్: 9392711999

మహారాష్ట్ర పోరు షురూ

బీజేపీ 148... కాంగ్రెస్ 103 స్థానాల్లో పోటీ

ముంబై: మహారాష్ట్ర ఎన్నికల రణరంగానికి అన్ని పార్టీలు సన్నద్ధమయ్యాయి. నవంబరు 20 ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ముగియగా, బీజేపీ 148, కాంగ్రెస్ 103, శివసేన (యూబీటీ) 80, ఎన్‌సీపీ 53 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. అధికార బీజేపీ అత్యధికంగా 148 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ 103 స్థానాలతో ఆ తర్వాత స్థానంలో ఉంది. మంగళవారం నామినేషన్ ప్రక్రియ ముగిసే సమయానికి రాష్ట్రంలోని 288 అసెంబ్లీ స్థానాలకు అధికార మహాయుతి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) తో సహా దాదాపు 8 వేల మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 80 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగా, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు చెందిన ఎన్‌సీపీ 53 మంది అభ్యర్థులను బరిలో నిలిపింది. అయితే రెండు నియోజకవర్గాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ఇతర మహాయుతి మిత్రపక్షాలకు ఐదు సీట్లు కేటాయించారు. ఎంవీఏలో కాంగ్రెస్ 103 స్థానాల్లో పోటీ చేయగా, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 89 స్థానాల్లో, శరద్ పవార్ ఎన్‌సీపీ (ఎస్‌పీ) 87 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. మూడు నియోజకవర్గాలపై ఇంకా స్పష్టత రాకపోకగా, ఇతర ఎంవీఏ మిత్రపక్షాలకు ఆరు సీట్లు ఇచ్చారు. ఎన్నికల కోసం మొత్తం 7,995 మంది అభ్యర్థులు 10,905 నామినేషన్లను ఎన్నికల కమిషన్‌కి సమర్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నివేదించారు. అక్టోబరు 22న ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. నామినేషన్ పత్రాల పరిశీలన బుధవారం జరుగుతుంది. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు చివరి తేదీ నవంబరు 4 మధ్యాహ్నం 3 గంటలుగా నిర్ణయించారు. 2019 ఎన్నికలలో 5,543 నామినేషన్లు దాఖలు కాగా, చివరికి 3,239 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికలకు ఒక్క నాసిక్ జిల్లాలోనే 361 మంది అభ్యర్థులు 506 నామినేషన్లు దాఖలు చేయగా, మంగళవారం 255 మంది అభ్యర్థులు తమ పత్రాలను సమర్పించారు. ప్రముఖ అభ్యర్థులలో మాలెగావ్ ఔటర్ నుంచి క్యాబినెట్ మంత్రులు దాదా భూసే (శివసేన), యోలా నుంచి ఛగన్ భుజ్‌బల్ (ఎన్‌సీపీ), వివిధ నియోజకవర్గాల నుండి పోటీ చేస్తున్న ఇతర ప్రముఖులు ఉన్నారు. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఛగన్ భుజ్‌బల్ మేనల్లుడు సమీర్... నందగావ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సుహాస్ కాండే (శివసేన) పై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎన్‌సీపీకి రాజీనామా చేశారు. నవంబరు 20న పోలింగ్, నవంబరు 23న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ఎంవీఏలో గందరగోళం లేదు

నామినేషన్లన్నీ పూర్తి: కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితాల

ముంబై: వచ్చే నెలలో జరగనున్న మహారాష్ట్ర ఎన్నికల కోసం మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) మొత్తం 288 స్థానాలకు నామినేషన్లను పూర్తి చేసిందని కాంగ్రెస్ నాయకుడు రమేష్ చెన్నితాల బుధవారం స్పష్టం చేశారు. సీట్ల విభజనపై కూటమిలో గందరగోళం నెలకొందన్న ఊహాగానాల నడుమ... కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే, సీనియర్ నాయకుడు వర్షా గైక్వాడ్, నసీమ్ ఖాన్‌లతో కలిసి విలేకరులతో చెన్నితాల మాట్లాడుతూ ఈ రోజు ఈ ఎన్నికలలో పోటీ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని ప్రకటించారు. మంగళవారం నామినేషన్ల గడువు ముగియడంతో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన వర్గం, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పీ) కూటమితో కూడిన ప్రతిపక్ష ఎంవీఏ కూటమి అధికారికంగా 11 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదు. అధికార మహాయుతి కూటమి అయిన బీజేపీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని శివసేన, ఎన్‌సీపీ స్పష్టంగా నాలుగు స్థానాలను భర్తీ చేయలేదు. రమేశ్ చెన్నితాల మాట్లాడుతూ ఎంవీఏ సభ్యుల మధ్య అవగాహన లోపం ఉందని చెన్నితాల అంగీకరించారు. అయితే ఆ అనిశ్చితి ఫలితంగా మిత్రపక్షాల మధ్య ఎటువంటి చీలికలు లేవని పట్టుబట్టారు. షిండే సేన లేదా అజిత్ పవార్‌కు చెందిన ఎన్‌సీపీ గ్రూపు కోసం బీజేపీ నాయకులు ఒకటి కంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేసిన సందర్భాలను ప్రస్తావిస్తూ, 'ఒకరి కోటాలో ఒకరు పోరాడుతున్నారు' అని పాలక కూటమిని ఆయన విమర్శించారు. 'మేము ఎంవీఏలో అందరికీ సమానమైన గౌరవం ఇచ్చాం' అని నొక్కి చెప్పారు. 'మహాయుతిలో చాలా విభేదాలు ఉన్నాయి. మిత్రపక్షాల నుంచి బీజేపీ సీట్లు దోచుకోవడం అనేది దాని మిత్రపక్షాలను చంపాలనుకునే స్పష్టమైన సందేశం. కానీ మేము (ఎంవీఏ) కలిసి ఉన్నాం' అని చెన్నితాల అన్నారు. ఏప్రిల్-జూన్ సార్వత్రిక ఎన్నికలలో దురదృష్టకర పరిస్థితులను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటన సభ్యులు అదే స్థానానికి అభ్యర్థులను నిలబెట్టిన సందర్భాలను ప్రస్తావిస్తూ, ఎంవీఏలో 'స్నేహపూర్వక పోరాటం' ఉండదని స్పష్టం చేశారు.

శీతాకాల సమావేశాల్లో వక్ఫ్ బిల్లు

వారంలో ఐదు రాష్ట్రాల్లో జేపీసీ పర్యటన

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లు గురించి కొద్ది రోజులుగా దేశమంతటా చర్చనీయాంశం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ బిల్లును జేపీసీ (సంయుక్త పార్లమెంటరీ కమిటీ)కి పంపగా అక్కడ గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. గత కొద్ది రోజులుగా వక్ఫ్ సవరణ బిల్లు వార్తల్లో నిలుస్తోంది. దీనికి సంబంధించి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం జరిగిన ఈ సమావేశంలో చాలా రచ్చ జరిగింది. జేపీసీ సమావేశానికి దిల్లీ వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ అశ్విని కుమార్‌ను పిలవడంతో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. అతను వచ్చిన వెంటనే సభ్యులు గందరగోళం సృష్టించడం, నినాదాలు చేయడం ప్రారంభించారు. ఇప్పుడు వక్ఫ్‌పై జేపీసీ వారంలో ఐదు రాష్ట్రాల్లో పర్యటించి వాటాదారులతో సమావేశాలు నిర్వహించనుంది. వక్ఫ్ సవరణ బిల్లు 2024పై ప్రజా సంప్రదింపుల కోసం కమిటీకి ఇదే చివరి పర్యటన. ఈ కారణంగా జేపీసీ నవంబర్ 9 న అసోం రాజధాని గౌహతి నుండి తన పర్యటనను ప్రారంభించనుంది. దీని తర్వాత నవంబర్ 11న కమిటీ ఒడిశాలోని భువనేశ్వర్‌లో పర్యటించనుంది.

జేపీసీకి ఇదే చివరి పర్యటన

దీని తరువాత, జేపీసీ పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు వెళ్లి నవంబర్ 12 న అక్కడ సందర్శిస్తుంది. ఆ తర్వాత జేపీసీ బీహార్‌లోని పాట్నాలో పర్యటించనుంది. దీని తర్వాత 13న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జాయింట్ పార్లమెంటరీ కమిటీని సందర్శించనున్నారు. వక్ఫ్ విషయాలను వినడానికి, అర్థం చేసుకోవడానికి కమిటీకి ఇదే చివరి పర్యటన. ఈ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత కమిటీ ఢిల్లీలో సమావేశమై తుది నివేదికను సిద్ధం చేస్తుంది.

టేబుల్‌పై వక్ఫ్ బిల్లు

నవంబర్ చివరి వారంలోగా జేపీసీ తన నివేదికను సిద్ధం చేసి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. గతంలో జేపీసీ 6 రోజుల్లో 5 రాష్ట్రాల్లో పర్యటించింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 1 వరకు వరుసగా 5 రోజుల పాటు సమావేశాలు నిర్వహించి 7 రాష్ట్రాల మైనారిటీ సంఘాలతో సమావేశమయ్యారు. ఈ కాలంలో జేపీసీ సెప్టెంబర్ 26న ముంబైని, మరుసటి రోజు సెప్టెంబర్ 27న గుజరాత్‌ను, సెప్టెంబర్ 28న హైదరాబాద్‌ను, సెప్టెంబర్ 30న చెన్నైని, అక్టోబర్ 1న బెంగళూరును సందర్శించింది. దీంతో పాటు స్థానిక మైనారిటీ కమిషన్‌తో పాటు ఇతర భాగస్వాములతో కమిటీ సమావేశం నిర్వహించింది.

లారెన్స్ బిష్ణోయ్ హత్యకు బంబిహా గ్యాంగ్ ప్రణాళిక?

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ హత్యకు మరో క్రిమినల్ ముఠా బంబిహా నాయకుడు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. తన గ్యాంగ్ పలుకుబడిని పెంచుకోవడానికే బిష్ణోయ్‌ను అడ్డం తొలగించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. బంబిహా ముఠా నాయకుడు కుశాల్ చౌధ్రీ తన అనుచరుడు పవన్ షూకీన్ అలియాస్ సోనూతో కలిసి ఓ పథకం పన్నినట్లు ఆంగ్లపత్రిక ఇండియాటుడే పేర్కొంది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్న పవన్ ఇద్దరు షార్ప్ షూటర్లను పురమాయించి ఈ నెల 26న ఢిల్లీ రాణీబాగ్‌లోని ఓ వ్యాపారవేత్త ఇంటివద్ద రెక్కీ నిర్వహించి కాల్పులు జరిపించాడట. అనంతరం అతడిని రూ.15 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశాడు. లేకపోతే కాల్చి చంపుతానని హెచ్చరించడంతో... ఆ వ్యాపారవేత్త డబ్బు ఇవ్వడానికి సిద్ధమయ్యాడట. ఈలోపు ఇద్దరు షార్ప్ షూటర్లను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి సెమీ ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. వీరిని విచారించగా... లారెన్స్‌ను చంపేందుకు ఢిల్లీ జైల్లో ఉన్న కుశాల్ చౌధ్రీ ప్లాన్ చేస్తున్నట్లు తేలింది. దీనిలోభాగంగా డబ్బులు సమీకరించేందుకే ఆ వ్యాపారవేత్తను బెదిరించినట్లు గుర్తించారు. కుశాల్‌ను 2019లో థాయ్‌లాండ్‌లో అరెస్టు చేసి భారత్‌కు తరలించారు. ఆ తర్వాత ఎన్ఐఏ అతడి స్థావరాలపై వరుసగా దాడులు చేసి కట్టడి చేసింది. గాయకుడు సిద్ధూమూసేవాల హత్యకు ప్రతీకారంగా లారెన్స్‌ను చంపుతానని అతడు 2022లో సోషల్ మీడియాలో ప్రకటించాడు. మరోవైపు లారెన్స్ కూడా కుశాల్‌ను అంతం చేయాలని చూస్తున్నాడు. ఇటీవల సబర్మతి జైల్లో అతడిని ఎన్ఐఏ ప్రశ్నించగా... తన హిట్ లిస్ట్‌లో బంబిహా గ్యాంగ్ నాయకుడు ఉన్నట్లు చెప్పాడని సమాచారం.

ఎలక్ట్రానిక్ బాణసంచాతో కాలుష్య రహిత దీపావళి

న్యూఢిల్లీ: దేశంలో గత కొన్నేళ్లుగా దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంపై వివిధ ఆంక్షలు విధించిన సంగతి విదితమే. బాణసంచా నుండి వెలువడే పొగ ఆరోగ్యానికి హానిచేస్తుంది. అలాగే కాలుష్యాన్ని కూడా వ్యాపింపజేస్తుంది. అయితే దీపావళి వేళ బాణసంచా లేకుండా సరదాగా ఎలా గడపడం? అన్న ప్రశ్నకు సమాధానం దొరికింది. ఇప్పుడు బాణసంచాకు బదులుగా ఎలక్ట్రానిక్ ఫైర్‌క్రాకర్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇవి వెలుగు జిలుగులను, ధ్వనిని అందించినప్పటికీ కాలుష్యాన్ని కలుగజేయవు. ఎలక్ట్రానిక్ ఫైర్‌క్రాకర్స్‌ను కాల్చడం వలన ఎటువంటి హాని జరగదు. వాయు కాలుష్యం ఉండ దు. ఎలక్ట్రానిక్ టపాసులు నిజమైన టపాసుల మాదిరిగనే కనిపిస్తాయి. వాటిలానే వెలుగులను ఇస్తాయి. అయితే ఇవి రిమోట్‌తో పనిచేస్తాయి. వీటిని వినియోగించినప్పుడు నిజమైన బాణసంచాను కాల్చిన అనుభూతినే పొందవచ్చు. ఎలక్ట్రానిక్ టపాసులు వెలిగించేందుకు ఎటువంటి అగ్గిపెట్టె లేదా నిప్పు అవసరం లేదు. ఇవి ఎంతో సురక్షితమైనవి. కాలుష్యాన్ని కూడా వెదజల్లవు. ఎలక్ట్రానిక్ ఫైర్‌క్రాకర్స్‌లో వివిధ రకాల శబ్దాలు, వెలుగులను చూడవచ్చు. ఎలక్ట్రానిక్ బాణసంచా లోపల వైర్లతో అనుసంధానమైన వివిధ చిన్న పాడ్‌లు, ఎల్‌ఈడీ లైట్లు ఉంటాయి. వీటిని ఆన్ చేసినప్పుడు పాడ్‌ల నుంచి స్పార్క్ వస్తుంది. అలాగే బాణసంచా మాదిరి శబ్దం కూడా వస్తుంది. ఎలక్ట్రానిక్ ఫైర్‌క్రాకర్స్‌ను రిమోట్ ద్వారా నియంత్రించవచ్చు. ఎలక్ట్రానిక్ ఫైర్‌క్రాకర్స్‌ను వినియోగించి వినూత్నమైన దీపావళి ఆనందాన్ని పొందవచ్చు. ఎలక్ట్రానిక్ బాణసంచాను మార్కెట్‌లో లేదా ఆన్‌లైన్‌లో సులభంగా కొనుగోలు చేయవచ్చు. ఇవి కొంచెం ఖరీదైనవే అయినప్పటికీ పర్యావరణానికి ఎటువంటి హాని చేయవు. వీటిని అనేకసార్లు ఉపయోగించవచ్చు.

ఆయుష్మాన్ భారత్ ఆసుపత్రులు కాగితాలకే పరిమితం

ప్రియాంక కక్కర్

న్యూఢిల్లీ: బీజేపీపైనా, ప్రధాని నరేంద్రమోదీపైనా ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ బుధవారం విరుచుకుపడ్డారు. ఆరోగ్య పథకం కింద ఆయుష్మాన్ భారత్ ఆసుపత్రులు కేవలం కాగితాలపై మాత్రమే ఉన్నాయని ప్రియాంక విమర్శించారు. ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వంపై మోదీ చేసిన విమర్శలపై స్పందిస్తూ... ప్రియాంక కక్కర్ మీడియాతో మాట్లాడారు. మోదీ చెప్పేవన్నీ అబద్ధాలేనని కక్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018లో కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య సేవల కోసం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దాదాపు 26 వేల ఆసుపత్రులను ఈ పథకం కింద ప్రభుత్వం చేర్చింది. కానీ, ప్రభుత్వ లెక్కల్లో ఉన్న 7 వేల ఆసుపత్రులు కేవలం పేపర్లపై మాత్రమే ఉన్నాయి. నాలుగువేల ఆసుపత్రుల్లో ఈ పథకం కింద అడ్మిషన్లే లేవని ఆమె ఆరోపించారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద చెల్లించే బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదు. దీని కారణంగా రోగులకు అందాల్సిన చికిత్స ఆగిపోయిందని హర్యానాకు చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాసిన లేఖను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. కాగా, 9వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో మంగళవారం ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ)లో వివిధ ఆరోగ్య ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ పథకం కింద ఢిల్లీలో 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచిత ఆరోగ్య సౌకర్యం కల్పించింది. అయితే ఈ పథకాన్ని ఢిల్లీ, బెంగాల్ ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు.

భారత్‌లో బ్రిటన్ రాజ దంపతులు

బెంగళూరు: బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్-3, ఆయన సతీమణి క్వీన్ కెమిల్లా భారత్‌లో రహస్య పర్యటనకు వచ్చారు. అక్టోబరు 27 నుంచి వారిద్దరూ బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడి ఓ వెల్‌నెస్ కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నట్లు మీడియా వర్గాలు పేర్కొన్నాయి. బ్రిటన్ రాజదంపతులు వెల్‌నెస్ కేంద్రంలో యోగా, మెడిటేషన్ సాధనలో సమయం గడుపుతున్నట్లు తెలుస్తోంది. కాగా వారు బుధవారం బెంగళూరు నుంచి బ్రిటన్ బయలుదేరనున్నట్లు సమాచారం. మీడియా కథనాల ప్రకారం కింగ్ చార్లెస్ -3 దంపతులు అక్టోబర్ 21- 26 మధ్య కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల సమావేశానికి హాజరైన తర్వాత సమోవా నుంచి నేరుగా భారత్‌కు రహస్యంగా వచ్చారు. రహస్య పర్యటన కావడంతో ప్రభుత్వం ఎలాంటి అధికారిక ఆహ్వాన కార్యక్రమాలు నిర్వహించలేదు. బెంగళూరులోని వెల్‌నెస్ సెంటర్‌లో ప్రత్యేక సిబ్బంది వారికి వివిధ థెరపీ సెషన్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కింగ్ ఛార్లెస్-3 బ్రిటన్ రాజుగా అధికారికంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. అయితే ఆయన వేల్స్ యువరాజుగా ఉన్న సమయంలో చాలాసార్లు బెంగళూరులోని వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చేవారు. తన 71వ పుట్టిన రోజును ఇక్కడే ఘనంగా జరుపుకున్నారు. 2022లో క్వీన్ ఎలిజబెత్ మరణించిన తర్వాత ఛార్లెస్‌ను బ్రిటన్‌కు రాజుగా ప్రకటించారు. బ్రిటన్ రాజదంపతులు ప్రస్తుతం చికిత్స పొందుతున్న సౌఖ్య ఇంటర్నేషనల్ హోలిస్టిక్ హెల్త్ సెంటర్ బెంగళూరులోని సమేతనహళ్లిలో ఉంది. డాక్టర్ ఇస్సాక్ మథాయ్, డాక్టర్ సుజా ఇస్సాక్ దీనిని స్థాపించారు. ఇందులో ఆయుర్వేదం, నేచురోపతి, ఆక్యుప్రెషర్, యోగా, హోమియోపతి, ఇతర సంప్రదాయ చికిత్సలు చేస్తారు. మూడో ఛార్లెస్ ఈ వెల్‌నెస్ సెంటర్‌కు తొమ్మిదిసార్లు వచ్చి చికిత్స చేయించుకున్నట్లుగా తెలుస్తోంది.

టపాసులు కాల్చొద్దు... దీపాలే వెలిగించండి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దీపావళి పండుగ అంటే దీపాలు వెలిగించి జరుపుకునే పండుగ అని, టపాసులు కాల్చే పండుగ కాదని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. ఎవరూ పటాసులు కాల్చవద్దని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ఆయన చెప్పారు. టపాసులు కాల్చవద్దని, దీపాలు వెలిగించాలని సుప్రీంకోర్టు, హైకోర్టు కూడా చెబుతున్నాయని ఆయన గుర్తుచేశారు. 'పర్యావరణం పాడవుతుందనే ఉద్దేశంతో న్యాయస్థానాలు టపాసులు కాల్చవద్దని, దీపాలు వెలిగించాలని సూచిస్తున్నాయి. ఇలా చెప్పడం అంటే ఎవరికో అనుకూలంగా మాట్లాడినట్టు కాదు. కాలుష్యం పెరిగితే మన పిల్లల ఆరోగ్యాలు చెడిపోతాయి. ఇందులో హిందూ, ముస్లిం ఆలోచన లేదు. ప్రతి ఒక్కరికీ వారి జీవితం ముఖ్యం' అని అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు.

చెన్నైలో కుండపోత

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వివిధ కాలనీలు చెరువుల్లా మారాయి. రహదారులు నదులను తలపించాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. భారీ వర్షం కారణంగా వరద పోటెత్తడంతో పార్క్ చేసి ఉన్న వాహనాలు కొట్టుకుపోయాయి. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో చెన్నై నగరపాలక సంస్థ అధికారులు రంగంలోకి దిగారు. విపత్తును ఎదుర్కొనే చర్యలు చేపట్టారు. వరద కారణంగా ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టారు.

వజ్రాల వ్యాపారి ఇంట పెళ్లి వేడుకల్లో మోదీ

గాంధీనగర్: గుజరాత్ వజ్రాల వ్యాపారి ఇంట్లో జరిగిన పెళ్లి వేడుకకు ప్రధాని మోదీ హాజరయ్యారు. దానికి సంబంధించిన దృశ్యాలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీపావళి సమయంలో తన ఉద్యోగులకు భారీగా కానుకలు ఇచ్చే వజ్రాల వ్యాపారి సావ్జీ ధోలాకియా కుమారుడు ద్రవ్య ధోలాకియా వివాహం ఈ వారం జరిగింది. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆ వేడుకకు హాజరైన మోదీ... వధూవరులను ఆశీర్వదించారు. 'ద్రవ్య, జాన్వీ వివాహ బంధంతో ఒక్కటైన సందర్భంగా ప్రధాని మోదీ హాజరుకావడం గొప్ప ఆశీర్వాదంగా భావిస్తున్నాం' అంటూ సావ్జీ ఆ దృశ్యాలను షేర్ చేశారు. గుజరాత్‌లోని అమ్రేలి జిల్లా దుధాలా గ్రామంలో 1962 ఏప్రిల్ 12న ఓ రైతు కుటుంబంలో సావ్జీ ధోలాకియా జన్మించారు. చిన్నప్పటి నుంచి చదువు అంతంత మాత్రమే. అందుకే 13 ఏళ్ల వయసులో 4వ తరగతితోనే చదువు ఆపేశారు. తన మేనమామ దగ్గర వజ్రాల పాలిషింగ్ వర్క్ నేర్చుకున్న ఆయన... వజ్రాల వ్యాపారం మొదలుపెట్టారు. 1992లో ముంబైలో శ్రీ హరికృష్ణ ఎక్స్‌పోర్ట్స్ పేరుతో వజ్రాల ఎగుమతులను ప్రారంభించారు.

ఎన్నికల విశ్వసనీయత దెబ్బ తీస్తారా?

హర్యానాపై ఖర్గేకు ఈసీ లేఖ

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ అనవసర వివాదం లేవనెత్తుతోందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఎప్పటిలా సాధారణ సందేహాలతో మొత్తం ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసేలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని తప్పుపట్టింది. కాంగ్రెస్ ఆరోపణలను తిరస్కరించింది. ఈసీ ఆ మేరకు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాసింది. ఇటువంటి పనికిమాలిన సందేహాలు పోలింగు, కౌంటింగు వంటి ప్రక్రియలు కొనసాగుతున్న సమయంలో కల్లోలం సృష్టించే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. 'ఒక జాతీయ రాజకీయ పార్టీ నుంచి ఇది ఆశించిన వైఖరి కాదు. దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా రాజకీయ పార్టీలు వెలిబుచ్చే విమర్శనాత్మక అభిప్రాయాలను ఈసీ అభినందిస్తుంది. ఆ మేరకు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి కట్టుబడి ఉంటాం' అని ఈసీ పేర్కొంది. ఈవీఎంలలో బ్యాటరీ సామర్థ్య ప్రదర్శన హెచ్చుతగ్గులపై సందేహాలు ఉన్నాయని పేర్కొన్న కాంగ్రెస్ 26 నియోజకవర్గాల్లో కొనసాగిన ఎన్నికల ప్రక్రియపై ఫిర్యాదులతో ఈసీకి 8 పేజీల లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనికి బదులుగా ఈవీఎంలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ గతంలో రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన 42 తీర్పులను సైతం ఉటంకిస్తూ ఏకంగా 1,600 పేజీల లేఖ ద్వారా ఈసీ వివరణ ఇచ్చింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా ఈవీఎంల పనితీరు, అదనపు ఈవీఎంల వివరాలపై లేవనెత్తిన అంశాలకు ఈసీ సమాధానం ఇవ్వలేదు.

ప్రజాస్వామ్య రక్షణ ముఖ్యం

చాలా దేశాలు పేపర్ బ్యాలెట్ల వైపు మళ్లాయి: తివారీ

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను ఎత్తి చూపుతూ ఎన్నికల నిర్వహణ కోసం పేపర్ బ్యాలెట్‌ల వైపు తిరిగి వెళ్లడాన్ని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పరిశీలించాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 'ప్రపంచ వ్యాప్తంగా మినహాయింపు లేకుండా భారతదేశం కంటే ముందే ఈవీఎంలను కనుగొన్న లేదా ఉపయోగించిన దేశాలలో కూడా ప్రతి ఒక్కరూ పేపర్ బ్యాలెట్‌ల వైపు మళ్లారు. ఎందుకంటే ప్రజాస్వామ్యం ఎంతో విలువైనది. సాంకేతికతకు వదిలివేయబడదు. ఎన్నికల కమిషన్ దీనిని చాలా తీవ్రంగా పరిగణించడమే కాకుండా ఈ దేశాన్ని తిరిగి పేపర్ బ్యాలెట్‌కి తీసుకెళ్లే చొరవ తీసుకోండి' అని కోరారు. ఇటీవలి హర్యానా ఎన్నికలలో కాంగ్రెస్ అక్రమాలకు సంబంధించిన ఆరోపణలను ఈసీఐ తోసిపుచ్చుతూ, వాటిని 'నిరాధారమైన, తప్పుగా, వాస్తవాలు లేనివి' అని పేర్కొన్న తర్వాత ఈ ప్రకటన వచ్చింది. ఈసీఐ మంగళవారం కాంగ్రెస్ పార్టీకి రాసిన లేఖలో, ఎన్నికల తర్వాత నిరాధారమైన వాదనలు చేయవద్దని కోరింది. సాక్ష్యం లేకుండా పార్టీ 'సాధారణ' సందేహాలను లేవనెత్తుతుందని ఆరోపించింది. ఇలాంటి బాధ్యతా రహితమైన ఆరోపణలు ముఖ్యంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు రోజుల వంటి సున్నితమైన సమయాల్లో ప్రజల అశాంతికి, గందరగోళానికి దారితీస్తాయని ఈసీ హెచ్చరించింది. ఇదిలాఉండగా, ఈవీఎంల బ్యాటరీ పని చేసే కాలంపై కూడా తివారీ సందేహం వ్యక్తం చేశారు. 'ఒక ఈవీఎం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లేదా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజంతా ఉపయోగించబడవచ్చు. ఒకసారి 99 శాతం బ్యాటరీని కలిగి ఉండవచ్చని, బ్యాటరీ లైఫ్ ఒకసారి మెషిన్ డౌన్ అయిన తర్వాత దానిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి రెండు రోజుల తర్వాత బయటకు తీసుకొచ్చి ఓట్లు లెక్కిస్తారు. ఇది యంత్రం అనే శాస్త్రానికి సంబంధించిన ఏదైనా చట్టాన్ని పూర్తిగా ధిక్కరిస్తుంది' అని ఆయన అన్నారు. దీనిపై బీజేపీ నాయకుడు తరుణ్ చుగ్... కాంగ్రెస్ పార్టీని 'మునిగిపోతున్న ఓడ' అని ప్రస్తావిస్తూ, ఎన్నికల నష్టాల తర్వాత ఈవీఎంల సామర్థ్యాన్ని ప్రశ్నించినందుకు నిందించారు. చాలా ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ వారి అహం ఎక్కువ అని అన్నారు.

దీపోత్సవ్‌కు ఆహ్వానం లేదు: అయోధ్య ఎంపీ

లక్నో: సరికొత్త గిన్నిస్ రికార్డులే లక్ష్యంగా 'దీపోత్సవ్'కు అయోధ్య సిద్ధమవుతుండగా తనను ఈ కార్యక్రమానికి ప్రభుత్వ యంత్రాంగం ఆహ్వానించలేదని సమాజ్‌వాదీ పార్టీ నేత, ఫైజాబాద్ ఎంపీ అవదేశ్ ప్రసాద్ బుధవారం తెలిపారు. కలిసి చేసుకునే పండుగలను బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. 'దీపావళి సందర్భంగా అయోధ్య వాసుందరికీ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. ఇక్కడి నుంచి ఎంపీగా గెలవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మన పండుగలను బీజేపీ రాజకీయం చేస్తోంది. సోదరభావంతో అందరూ కలిసికట్టుగా చేసుకునే పండుగ ఇది. ఇక్కడ కూడా రాజకీయాలు చేసి ప్రజలను విడగొట్టాలని బీజేపీ చూస్తోంది. నాకు ఒక పాసు కానీ, ఆహ్వానం కానీ పంపలేదు. ఈ పండుగ ఏ ఒక్క మతానికో చెందినది కాదు. నాకు పాసు ఇవ్వకపోయినా, ఆహ్వానించకపోయినా ఈరోజు నేను అయోధ్య వెళ్తున్నాను' అని అవదేశ్ ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో జరిగి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లల్లూ సింగ్‌ను అవదేశ్ ప్రసాద్ ఓడించారు. హిందూ ఆధ్యాత్మిక కేంద్రమైన అయోధ్య... ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోకి వస్తుంది. అయోధ్యలోని రామాలయం ఈ ఏడాది మొదట్లో ప్రారంభమైంది. దీపావళి సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బుధవారం దీపోత్సవ్‌ను ఘనంగా నిర్వహించింది. సరయూనది ఒడ్డున 28 లక్షల దీపాలు వెలిగించడం ద్వారా ఈ ఏడాది సరికొత్త గిన్నిస్ రికార్డు నెలకొల్పనుంది.

నటుడు దర్శన్‌కు తాత్కాలిక బెయిల్

బెంగళూరు: రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయ్యి జైలుకెళ్లిన కన్నడ నటుడు దర్శన్ కు స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో దర్శన్‌కు వైద్య చికిత్స కోసం ఆరు వారాల పాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ కర్నాటక హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దర్శన్ తన పాస్ పోర్టును ట్రయల్ కోర్టు ముందు సరెండర్ చేయాలని షరతు విధించింది. అలాగే దర్శన్ తనకు నచ్చిన ఆస్పత్రిలో చికిత్స పొందొచ్చని పేర్కొంది. అయితే వారంలోగా దర్శన్ చికిత్స వివరాలు, ఆరోగ్య నివేదికను సమర్పించాలని ఆదేశించింది. కాగా అనారోగ్య కారణాల రీత్యా తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దర్శన్ సెషన్స్ కోర్టులో సెప్టెంబరు 21న పిటిషన్ దాఖలు చేశారు. వెన్నెముకకు శస్త్ర చికిత్స చేయించుకుంటానని తనకు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను సెషన్స్ కోర్టు తిరస్కరించింది. దీంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో బళ్లారి సెంట్రల్ జైలు వైద్యులు, బళ్లారిలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని న్యూరాలజీ విభాగాధిపతి సమర్పించిన వైద్య నివేదికను దర్శన్ తరఫున న్యాయవాది సీవీ నగేశ్ హైకోర్టు ధర్మాసనం ముందుంచారు. ఈ క్రమంలో దర్శన్ తరపు న్యాయవాది సీవీ నగేశ్, స్టేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్న కుమార్ వివరణాత్మక వాదనలు విన్న తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా దర్శన్‌కు ఆరు వారాల పాటు బెయిల్ ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. "దర్శన్‌కు వైద్యం కోసం బెయిల్ ఇవ్వాలని హైకోర్టును కోరాం. దర్శన్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన పత్రాలను న్యాయస్థానానికి సమర్పించాం. దీంతో ఆరువారాల పాటు బెయిల్ మంజూరు చేసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీపావళి పండుగ సందర్భంగా జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి హైదరాబాద్ నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ దీపాల వెలుగులు మాత్రమే కాదని, సౌభ్రాతృత్వానికి, సమానత్వానికి ప్రతీక అన్నారు. ఈ పండగ ప్రతి ఇంట్లో ఆనందం, ఆరోగ్యం, సంతోషం నింపాలని ఆయన కోరారు. చీకట్లను పారద్రోలి ఒక్కో మార్పు సాధించుకుంటూ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. నగర ప్రజలు పండుగ వేడుకను పర్యావరణ హితంగా జరుపుకోవాలని, పటాకులు కాల్చడంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందరూ తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా, సురక్షితంగా దీపావళి పండుగ జరుపుకోవాలన్నారు. నగరాన్ని స్వచ్ఛరేగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

దీపావళి శుభాకాంక్షలు: మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిలోనూ వెలుగులు నింపుకొనే, ఆత్మ విశ్వాసానికి, చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని పేర్కొన్నారు. ఈ పండగ నగర ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులను, ఆనంద కాంతులను, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ప్రజలు పండుగను పర్యావరణాన్ని కాపాడుతూ, అన్ని జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలన్నారు. ఆత్మీయత, స్నేహభావంతో కుటుంబ సభ్యులతో కలిసి పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. నగరం మరింత అభివృద్ధి బాటలో పయనించేలా ప్రజలు పూర్తి సహకారాన్ని అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

దీపావళి శుభాకాంక్షలు: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : దీపావళి పండుగను పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ గౌతమ్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి అజ్ఞానపు చీకట్లను తొలగించి విజ్ఞానాన్ని వెలిగించాలని, అందరి జీవితాలలో క్రొత్త ఉత్తేజాన్ని నింపాలని కలెక్టర్ అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ టపాసులను కాల్చుకోవాలని ఏలాంటి ప్రమాదాలు జరుగకుండా పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ గౌతమ్ జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ నేతల దీపావళి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీపావళి పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్, మీడియా కమిటీ ఛైర్మన్ ప్రకాష్ రెడ్డిలు ప్రజలకు తమ శుభాకాంక్షలను తెలియజేశారు. శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుడిని వధించడంతో ప్రజలు ఆ మరుసటి రోజు ఇంటింటా దీపాలు వెలిగించి దీపావళి సంబరం చేసుకుంటారని అన్నారు. ఈ పండుగ స్త్రీ శక్తిని చాటుతుంది. తగు జాగ్రత్తలతో బాణా సంచాలతో ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ ఈ పండుగ ప్రజల జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు.

పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులను సత్కరించిన కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తూ బుధవారం పదవీ విరమణ పొందిన స్పెషల్ బ్రాంచ్ సబ్ ఇన్స్పెక్టర్ యం.నవీన్, కంట్రోల్ రూం సబ్ ఇనస్పెక్టర్ రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం సబ్ ఇనస్పెక్టర్ కృష్ణారెడ్డిలను సుధీర్ బాబు తన కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇన్ని రోజులు పోలీసుశాఖలో సమర్థవంతంగా క్రమశిక్షణతో పనిచేసి సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్, ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో పి.ఇందిర, డీసీపీ అడ్మిన్, అరవింద్ బాబు, డిసిపి క్రైమ్స్, శ్రీధర్ రెడ్డి, ఏసిపి, స్పెషల్ బ్రాంచ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కృష్ణారెడ్డి ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీధర వర్మ, శ్రీశైలం నియామకం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ మహా సభ రంగారెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షులుగా శ్రీధర వర్మ, ప్రధాన కార్యదర్శిగా సంపంగి శ్రీశైలం, యువత విభాగం షాద్‌నగర్ టౌన్ అధ్యక్షులుగా శేఖర్ గౌడ్, బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కళ్యాణ్ కార్ జహంగీర్, బిసి మహాసభ కార్మిక విభాగం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులుగా జగన్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి టింగికార్ రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మకారి గోపాల్‌లకు మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం రాజ్యలక్ష్మి యాదవ్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు కటికే కృష్ణాజీ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పలికే అంజనేయులు యాదయ్య, మహేష్ వర్మ, శేఖర్ గౌడ్, జగన్ గౌడ్ పాల్గొన్నారు.

చారిత్రక బాధ్యతలో భాగస్వాములుగా ఉపాధ్యాయులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : చారిత్రాత్మక కుల గణన సర్వేలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్లతో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సర్వే ప్రాధాన్యత, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను డిప్యూటీ సీఎం వివరించారు. ఇందిరమ్మ రాజ్యం అధికారంలోకి వస్తుంది. ఈ దేశ వనరులు అందరికీ సమానంగా పంచాలి. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఎన్నికల సభలో మా ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీతోపాటు మేమంతా స్పష్టం చేశామన్నారు. అనుకున్న మేరకు అధికారంలోకి వచ్చామని, ఎన్నికల హామీలు అమలులో భాగంగా కుల గణన చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ నిర్ణయించి మీ ఆలోచనలను తెలుసుకోవాలని కోరారు. ఆ మేరకు ఉపాధ్యాయ సంఘాలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయానికి ఆహ్వానించినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరినట్టు ఉదయం వేళల్లో సర్వే నిర్వహించడం, సెప్టెంబర్ 9 నుంచి 15 వరకు వరుస సెలవుల మధ్య సర్వే చేపట్టడం, సెలవు రోజుల్లో సర్వే విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పరిహారంతో కూడిన సెలవులు మంజూరు చేయడం, సర్వేకు సంబంధించి సమాజంలో విస్తృత ప్రచారం చేయాలని ఇచ్చిన సూచనలు అన్నిటిని ఆచరణలో పెడతామని డిప్యూటీ సీఎం తెలిపారు. గతంలో మేము చేపట్టిన సకల జనుల సర్వే ఎటు పోయిందో ఎవరికి తెలియదని, ప్రస్తుత ప్రభుత్వం కోరుకున్న విధంగా సర్వే చేయడానికి ఉపాధ్యాయ లోకం సంపూర్ణంగా సిద్ధంగా ఉందని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌకతలి తెలిపారు. ఉపాధ్యాయులు అయితేనే సర్వే బాగా చేస్తారని నమ్మకం మాపై ఉంచినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు అని పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి తెలిపారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ పరిహారంతో కూడిన సెలవును మంజూరు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య కోరారు. సర్వేలో పాల్గొని ఉపాధ్యాయులకు స్పెషల్ సీఎల్ తోపాటు, ఇన్సెంటివ్ ఇవ్వాలని డిటిఎఫ్ అధ్యక్షుడు లింగారెడ్డి కోరారు. ఆదివాసి ఉపాధ్యాయ సంఘం ఏర్పడి 12 ఏళ్లు కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే సమావేశాలకు ఆహ్వానించి గౌరవిస్తున్నందుకు ధన్యవాదాలు అని ఆదివాసి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి తెలిపారు. ఎన్నికలు, జన గణన వంటి కీలక కార్యక్రమాలు ఉపాధ్యాయులు లేకుండా పూర్తి కావని, కుల గణన సర్వేలోనూ సంపూర్ణంగా సహకరిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసేవి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సందర్భంలోనూ మమ్ములను పిలిపించి మాట్లాడుకుని మా అభిప్రాయాలు తెలుసుకుంటుందని మోడల్ స్కూల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య అభినందించారు. ఎవరి జనాభా ఎంత ఉందో, ఎక్కడ ఉన్నారో సరిగా లెక్కలు లేవు కాంగ్రెస్ ప్రభుత్వం కూల గణనాథ ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేయడం సంతోషకరమైన విషయమని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జాజుల వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో మొత్తం 13 ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశంలో పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేశారు.

అవినీతిపరులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ టూరిజం, హరిత హొటల్స్ పేరుతో అనేక ప్రాంతాల్లో, బోటింగ్ విధానం, సౌండ్, లైట్స్, ట్రాన్స్‌పోర్ట్ లాంటి అనేక విధాలుగా ప్రజలకు సేవలు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తున్నదని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయుసి) రాష్ట్ర అధ్యక్షులు వి.యస్.బోస్ అన్నారు. టూరిజం సంస్థలో పని చేస్తున్న కొంతమంది అక్రమార్కులు అవినీతి కార్యక్రమాల్లో నిమగ్నమై టూరిజానికి వస్తున్న ఆదాయానికి గండికొట్టటమే కాకుండా సంస్థకు చెడ్డపేరు తీసుకు వస్తున్నారని ఆయన మండిపడ్డారు. అలాంటిదే ఈ మధ్య వార్తా పత్రికల్లో కథనం ప్రకారం హైదరాబాద్‌లోని సాలర్జంగ్ మ్యూజియంలో టూరిజం నడుపుతున్న హొటల్‌లో దొంగరేట్లతో పదార్థాలన్నీ అవినీతికి పాల్పడినట్లుగా వార్తలు వచ్చాయని, టూరిజం అధికారుల ఆకస్మిక తనిఖీలతో ఈ అవినీతి బయటపడినట్లుగా తెలుస్తున్నదని, ఇలాంటివి జరగకుండా అవినీతిపరులపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. ఇదే సంస్థలో సుమారు 600 మంది కార్మికులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, రోజువారి విధానంలో సంస్థకు 20 సంవత్సరాల నుండి సేవలందిస్తున్నారని, ఇందులో 166 మంది కాంట్రాక్టు కార్మికులు కూడా పని చేస్తున్నారన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఈ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించినప్పటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమాన పనికి సమాన వేతనం ఎగనామం పెట్టి కాంట్రాక్టు కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని ఆయన అన్నారు. కాంట్రాక్టు కార్మికులు పర్మినెంట్ కొరకు యూనియన్ డిమాండ్ చేస్తే సంస్థ పరిస్థితి బాగాలేదని, పర్మినెంట్ చేయలేమని యాజమాన్యం, ప్రభుత్వం చెపుతూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థను అక్రమంగా దోచుకుంటున్న వారిని ఉపేక్షించటం మూలంగానే సంస్థకు లాభాలు రావటం లేదని అన్నారు.

సంస్థకు లాభాలు రావాలన్నా, కష్టపడి పని చేస్తున్న కాంట్రాక్టు, ఇతర కార్మికులకు జీతం పెరగాలన్న, పర్మినెంట్ కావాలన్నా అవినీతి పరుల భరతం పట్టాలని టూరిజం సంస్థను అవినీతిరహిత మార్గంలో నడపాలని యాజమాన్యాన్ని కోరారు.

ఎన్యుమరేటర్‌లకు ప్రత్యేక శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమగ్ర కుటుంబ సర్వే చేయుటకు సర్కిల్ వారీగా ఎన్యుమరేటర్‌లకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయబడ్డాయి. నవంబర్ నెలలో జరిగే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయించింది. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం సర్కిల్ వారీగా ఎనుమరేటర్లకు సర్వే ప్రొఫార్మాను ఎలాంటి మార్గదర్శకాలతో పూరించాలో మాస్టర్ ట్రైనర్లు వివరించారు. డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు పర్యవేక్షణ చేసి, శిక్షణను సమర్థవంతంగా నిర్వహించారు. కుటుంబాల సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమాచారాన్ని సక్రమంగా సేకరించడానికి మార్గనిర్దేశం అందించారు.

పదవీ విరమణ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పని చేసిన 27 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం రిటైర్మెంట్ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ (అడ్మిన్) నళిని పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ అన్నది సహజమని, ఇది ఉద్యోగ రిటైర్మెంట్ మాత్రమేనని, తమ జీవన గమ్యంలో ఎలాంటి విరమణ ఉండదని ప్రతి ఉద్యోగి గమనించాలన్నారు. పదవీ విరమణ తర్వాత తమ ముస్ముందు జీవన ప్రణాళికను రూపొందించుకొని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో ఆనందంగా తమ జీవితాన్ని గడపాలని ఆమె కోరారు. హెడ్ ఆఫీస్ : చీఫ్ ఎంటమాలజిస్ట్ డా.రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ వి.రమాదేవి, ట్రాన్స్ పోర్ట్స్ సెక్షన్ ఫిట్టర్ జూనియర్‌గా పని చేసిన కె.అమరేశ్వర్., ఖైరతాబాద్ జోన్ : డిప్యూటీ కమిషనర్ సి.హెచ్.నాగేశ్వర్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ మహమ్మద్ హసమ్, ఖైరతాబాద్ సర్కిల్‌లో మలాన్‌గా పని చేసిన ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో హార్టికల్చర్ విభాగంలో మలాన్‌లుగా పని చేసిన లక్ష్మమ్మ, హుస్సైనిమ్మ, డి.పెంటమ్మ, ఎల్లమ్మ, ఉర్మిల, కె.లక్ష్మి, కమలమ్మ, కామాటిగా పని చేసిన ఎం.కిషన్., సికింద్రాబాద్ జోన్ : ఎస్.ఇ, ఇన్ చార్జి చీఫ్ ఇంజనీర్ (హౌసింగ్) పి.అనిల్ రాజ్, బేగంపేట్ సర్కిల్ లో మలాన్ సవిత, తొట్టిగా పని చేసిన నసీమ్ బాను, మాలిగా పని చేసిన బీరయ్య. డి.క్రిష్ణ., ఎల్బీనగర్ జోన్ : డిప్యూటీ సిటీ ప్లానర్ ఎం.శేఖర్ రెడ్డి, టి.పి బిఎల్ డిఎస్ నాగుల గిరిరాజ్., చార్మినార్ జోన్ : స్వీపర్ అనసూయ., కూకట్ పల్లి జోన్ : మూసాపేట్ డిప్యూటీ కమిషనర్ ఎ.రమేష్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ సుకునందన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి.మల్లేశ్వర్., శేరిలింగంపల్లి జోన్ : ఆర్.సి.పురం అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి.శ్రీహరి., ఈ కార్యక్రమంలో సిపిఆర్ఓ మహమ్మద్ ముర్తుజా, పి.ఆర్.ఓ విజయలక్ష్మి, ఏ.ఎం.సి.లు జీవన్ కుమార్, శారద, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

గార్బేజ్ వాల్నరేబుల్ పాయింట్‌ల వద్ద దీపావళి శుభాకాంక్షల వాల్ రైటింగ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పురస్కరించుకుని, నగరంలో గార్బేజ్ వాల్నరేబుల్ పాయింట్‌ను తొలగించి ప్రాంతాలను శుభ్రం చేసి, అక్కడ దీపావళి శుభాకాంక్షలతో బ్యానర్లు, వాల్ రైటింగ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో మహిళలు ముగ్గులు వేశారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్తను అక్కడ వేయకుండా ఉండేందుకు శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.

జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న రాష్ట్రీయ ఏక్తా దివాస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) జరుపుకోవడం జరుగుతుంది. ఈ సంవత్సరం ఏక్తా దివస్ దీపావళితో కలిసి వస్తున్నందున, బుధవారం దక్షిణ మధ్య రైల్వే జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పాటించింది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమావేశమైన రైల్వే అధికారులు, సిబ్బంది చేత రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ మరియు సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వేలోని అన్ని డివిజన్లలో, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్‌లలో కూడా జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా డివిజనల్ రైల్వే మేనేజర్లు సంబంధిత డివిజనల్ కార్యాలయాల నుండి అధికారులు, సిబ్బంది చేత ఏక్తాదివాస్ ప్రతిజ్ఞను చేయించారు. జాతీయ ఐక్యత దినోత్సవం మన దేశం యొక్క ఐక్యత, సమగ్రత మరియు భద్రతకు వాస్తవ, సంభావ్య ప్రమాదాలను తట్టుకోవడానికి మన దేశం స్వాభావిక బలం, స్థితిస్థాపకతను తిరిగి ధృవీకరించడానికి అవకాశాన్ని అందిస్తుంది. 'దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతానని, అంతేగాక, ఈ సందేశాన్ని తోటివారందరిలో విస్తరింపచేయడానికి గట్టిగా కృషి చేస్తానని సత్యనిష్టతో ప్రతిజ్ఞ చేస్తున్నాను. సర్దార్ వల్లభభాయ్ పటేల్ దార్శనికత, చర్యల వల్ల లభ్యమైన నా దేశ అంతర్గత భద్రతను పటిష్టపరచడానికి స్వీయ తోడ్పాటునందిస్తానని సత్య నిష్టతో తీర్మానం చేస్తున్నాను.

వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలి

శేరిలింగంపల్లి - విశాలాంధ్ర: గచ్చిబౌలి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కోరారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఈ సందర్భంగా తమ కాలనీలలో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లు, యూజీడీ పైప్ లైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, మంచినీటి వసతిని మెరుగుపర్చాలని, విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, పారిశుధ్యం పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆరెకపూడి గాంధీని గంగాధర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందిస్తూ, గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, త్వరలోనే డివిజన్‌లో పర్యటిస్తానని, గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, దశల వారీగా పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. శ్రీశైలం, అనిల్ గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు నరేందర్ ముదిరాజ్, గచ్చిబౌలి డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంజీవ, గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షులు దయాకర్, గోపనపల్లి తండా వడ్డెర సంఘం అధ్యక్షులు శ్రీరాములు, సీనియర్ నాయకులు నరేందర్ యాదవ్, శ్యామ్ యాదవ్, యాదయ్య, అంజనేయులు, శ్రీశైలం, ప్రకాశ్ నాయక్, వేణు ప్రవీణ్ గౌడ్, దుర్గ రామ్, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేద్దాం : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంను అర్హులకు అందేలా అధికారులుగా మనం కృషి చేద్దాం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి. మంగళ వారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించే సూపరిటెండెంట్లకు, ఎన్యూమినేటర్లకు శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఆర్డీఓలు, తాసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, మండల అభివృద్ధి అధికారులు, జిల్లా ప్రణాళిక అధికారులతో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముందుగా నూతనంగా ఈ జిల్లాకు కలెక్టర్‌గా రావడం సంతోషం అన్నారు. జిల్లాలో విధులు నిర్వహించడానికి అవకాశం రావడం, ఈ అవకాశాన్ని నిర్వర్యం చేయకుండా ఇంకా బాధ్యతగా చేయడానికి ప్రత్యేకంగా రాష్ట్ర రాజధానికి అనుకోని ఉన్న మన జిల్లాకు అధికారిగా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే తరుణంలో జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన బాధ్యతను నిర్వీర్యం చేయకుండా బాధ్యతతో ఉద్యోగం నిర్వహిస్తే ప్రభుత్వంలో వారుపై స్థాయి ఉద్యోగులుగా ఎదుగుతారన్నారు. ప్రైవేటు ఉద్యోగంలో ఆర్థికంగా ఎంత ఎదిగిన ఒకనొకస్థాయిలో చేసే తప్పులతో ఉద్యోగాల నుండి తొలగి రోడ్డున పడే వ్యవస్థలోకి వెళ్ళిపోతాం అన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగిగా మనకు అందిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా, ఉద్యోగిగా ఏమరపాటుతో, నిర్లక్ష దోరణిలో ఉంటే వారికి ప్రభుత్వం నుండి తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నాణ్యతగల, నిజాయితీగల అధికారిగా జిల్లాలో మెలగాలన్నారు. కలెక్టర్ తన ఉద్దేశంలో జిల్లా ఇప్పటికే పని చేస్తున్న అధికారులందరూ బాధ్యతగా విధులు నిర్వహించినందువల్లనే రాష్ట్ర రాజదాని అనుసందనాల్లో విధులు నిర్వహిస్తున్నామని మరొ మారు గుర్తు చేశారు. అనంతరం కలెక్టర్ ట్రైనింగ్‌లో పాల్గొన్న ఎన్యూమినేటర్, ఎంపిడిఓ, మున్సిపల్ కమీషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే నవంబర్‌లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. డిఆర్ఓ సంగీత, జిల్లా ప్రణాళిక అధికారి పి.సౌమ్య, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎం.పి.డి.ఓలు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన సమాచార శాఖ కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.హరీష్ బుధవారం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని బి.ఆర్.కె భవన్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త కమిషనర్‌కు చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై వారు చర్చించారు.

అక్రమ మైనింగ్ చేపడుతున్న వాహనాలు సీజ్ చేసిన రెవిన్యూ అధికారులు ?

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : అక్రమ మైనింగ్ చేపడుతున్న వాహనాలను అబ్దుల్లాపూర్మెట్ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 279లో గల బోడగుట్టను నిబంధనలకు విరుద్ధంగా పనులను చేపట్టడంతో ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఐ మహమ్మద్ నిజాముద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని మైనింగ్ పనులను ఆపి వాహనాలను సీజ్ చేశారు.

'నందనవనం' ఆక్రమణదారులను తొలగించండి : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా ఎల్‌బి నగర్ నియోజకవర్గం పరిధిలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్న వారిని తక్షణం ఖాళీ చేయించి అర్హులైన వారికి అందించాలని రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, నందనవనంలో ఉన్న ఇండ్ల సమస్య, కేటాయింపుపై అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ ఇండ్లను ఆక్రమించుకున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి రాజకీయ వత్తిడులకు తలొంగ వద్దని అధికారులకు సూచించారు. నందనవనంలో జెఎన్ యూఆర్ ఎం పథకం కింద ప్రభుత్వం నిర్మించిన ఇండ్ల కోసం 2019లో దరఖాస్తు చేసుకొని, లబ్దిదారుని వాటా చెల్లించిన వారి ఇండ్లను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకోవడం పట్ల మంత్రిగారు తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం చేయాలని, అక్రమంగా ఆక్రమించుకున్న వారినుంచి ఇండ్లు స్వాధీనం చేసుకొని వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే మంకాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో ఉన్న న్యాయపరమైన సమస్యలను తక్షణం పరిష్కరించి, అర్హులైన వారికి కేటాయించాలని అధికారులకు సూచించారు. నిరుపేదలకు అన్యాయం జరిగితే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ డి. దివ్య, ప్రస్తుత రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన డాక్టర్ ఎస్. హరీష్, కె.శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

తొలిగిన పదేళ్ల చీకట్లు : సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాం క్షలు తెలిపారు. గత పదేండ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలనలో తెలంగాణ వెలుగులు విరజిమ్ముతుందని ముఖ్యమంత్రి ధీమా వెలిబుచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు.

ఈ దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ పండుగ జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

పటేల్ సేవలు మారువలేనివి...

సంస్థానాల విలీనం ద్వారా స్వాతంత్ర్య భారతదేశ సార్వభౌమత్వానికి నిండుదనాన్ని చేకూర్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియా డారు. సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించు కొని ఆయన సేవలను ముఖ్యమంత్రి స్మరించు కున్నారు. స్వాతంత్ర్య భారత ప్రథమ ఉప ప్రధానమంత్రిగా, హోంశాఖమంత్రిగా ఆయన చూపిన చొరవ, సమర్థతతోనే వందలాది సంస్థానాలు దేశంలో విలీనమయ్యాయని తెలిపారు. సర్దార్ పటేల్ ఆశయ సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయురాలు ఇందిరాగాంధీ..

నా ప్రతి రక్తపు బొట్టు దేశ పటిష్టతకు తోడ్పడుతుందని ప్రకటించిన మహనీయురాలు మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకొని ఆమె ముందుకు సాగారని ముఖ్యమంత్రి తెలిపారు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ, 20 సూత్రాల కార్యక్రమం వంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి, పేదల అభ్యున్నతికి ఇందిరా గాంధీ ఎంతగానో కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ పాలనను ఆదర్శంగా తీసుకుందని.. ఆ మహనీయురాలి స్ఫూర్తితోనే పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాన్ని చేపడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

హుస్నాబాద్ ప్రజలకు దీపావళి కానుక

100 పడకల ఆసుపత్రి 250 పడకలకు పెంపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీపావళి పండుగను పురస్కరించుకుని హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కానుక ఇచ్చిందని హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్‌లోని 100 పడుకల ఆసుపత్రిని 250 పడకల ఆసుపత్రిగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వివరిస్తూ ఈ మేరకు మంత్రి ఓ విడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ ఆసుపత్రి 100 పడకల నుండి 250 పడకల ఆసుపత్రి గా మార్చడానికి ప్రభుత్వం రూ.82.00 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు వివరించారు. ఈ మేరకు రాష్ట్ర హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నిధులు విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు జారీ అయినట్లు తెలిపారు. హుస్నాబాద్ ఆసుపత్రిని 250 పడకల ఆసుపత్రిగా మార్చడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

జనవాసల మధ్య టపాసుల దుకాణాలు వద్దు..

జనావాస సముదాయల్లో టపాసుల దుకాణాలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ముందుగా ఆయన రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకా ంక్షలు తెలిపారు. దీపావళి ఒక పెద్ద వేడుక ఈ పండగ సందర్భంగా జరిగే అగ్నిప్రమాదాలు నివారించడానికి టపాసుల కాల్చేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. టపాసుల దుకాణాల వల్ల ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఆ టపాసుల దుకాణాలని మైదాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని హైదారాబాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. వాటికి ప్రత్యామ్నాయంగా హైదారాబాదులోని ఖాళీ ప్రదేశాలు, క్రీడా మైదానాలు, పాఠశాల టపాసులు దుకాణాలు వాడుకోవాలని తెలిపారు. ఎక్కడైనా నివాస ప్రాంతాల మధ్య టపాసుల దుకాణాలు ఉంటే సంబంధిత ఏరియా అధికారి బాధ్యత వహించాలని అన్నారు.

పోలియోపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో, పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకోలేని పక్షవాతం, కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుంది. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయింది, ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలి. హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో పీడియాట్రిక్స్ చీఫ్ గా వ్యవహరిస్తున్న డాక్టర్ నితిన్ చావ్లా మాట్లాడుతూ, "భారతదేశం పోలియో రహిత హోదా అనేది నిబద్ధత, సమిష్టి చర్యతో మనం ఏమి సాధించగలమనే దానికి నిదర్శనం. కానీ పోలియోపై పోరాటం మనం సాధించిన దాని గురించి మాత్రమే కాదు, ఇది వేగాన్ని కొనసాగించడం. టీకా ద్వారా నిరంతరం అప్రమత్తంగా ఉండటమే పునరుజ్జీవనాన్ని నిరోధించడానికి ఏకైక మార్గం అని మన గత విజయం గుర్తు చేసేందుకు ఉపయోగపడుతుంది" అని అన్నారు.

250 పడకల ఆసుపత్రి మంజూరుపై హర్షం

విశాలాంధ్ర - హుస్నాబాద్ : హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో 250 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడం హర్షణీయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం అయిన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ప్రజా పాలనలో భాగంగా రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రోద్భలంతో ఆసుపత్రి అప్గ్రేడ్ కావడం సంతోషకరమన్నారు. నాటి దివంగత ఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య హుస్నాబాద్‌కు 30 పడకల ఆసుపత్రి తీసుకురాగా, మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హయాంలో 30 పడకల నుంచి 50 పడగలకు ఆసుపత్రి అప్గ్రేడ్ చేయడంతో పాటు శవ పరీక్ష కేంద్రాన్ని తీసుకురావడం ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉండడం హుస్నాబాద్ నియోజకవర్గం పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హైపర్‌టెన్షన్ క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) హైటెక్ సిటీ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా కొత్తగా హైపర్‌టెన్షన్ క్లినిక్ ప్రారంభించారు. అధిక రక్తపోటుకు, దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధికి, గుండె సమస్యలకు సంబంధంపై అవగాహన కల్పించేందుకు ఈ హైపర్‌టెన్షన్ క్లినిక్ ఒక కీలక ముందడుగు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న రోగుల జీవన నాణ్యతను పెంచడం, అది నియంత్రణలో లేకపోవడం వల్ల వచ్చే మూత్రపిండాల సమస్యలు, ఇతర ప్రమాదాలను తగ్గించడం ఏఐఎన్‌యూ హైటెక్ సిటీ శాఖ లక్ష్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తెలిపిన ప్రకారం, అధిక రక్తపోటు ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికి పైగా ప్రజలను ప్రభావితం చేస్తుంది. "హైపర్ టెన్షన్ క్లినిక్" వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే, ముప్పు పొంచి ఉన్న ప్రజలకు రక్తపోటు విషయంలో పరీక్షలు చేయడం, ముందుగానే నిర్ధారించి, వారికి తగిన చికిత్స అందించడం. అనియంత్రిత రక్తపోటు వల్ల ప్రమాదాలలో ఒకటి మూత్రపిండాల నష్టం అని ప్రజలకు అవగాహన కల్పించాలని మేము భావిస్తున్నాము. ఇది చాలా మందికి తెలియదు" అని చెప్పారు.

ఏవీజీసీ రంగాన్ని ప్రోత్సహించడానికి చర్యలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : 2016 నుండి తెలంగాణలో ప్రత్యేకమైన ఏవిజిసి విధానం అందుబాటులో ఉంది. అధిక నాణ్యత కలిగిన మౌలిక సదుపాయాలలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి కట్టుబడి ఉంది. రాబోయే ఇమేజ్ టవర్ ఉత్పత్తికి అత్యాధునిక సదుపాయాన్ని అందించడం, గేమింగ్, విఎఫ్ఎక్స్ యానిమేషన్‌లో ప్రతిభావంతులకు శిక్షణను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రభుత్వం భారత ప్రభుత్వ సంయుక్త కార్యక్రమం, ఇమేజ్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌కు మద్దతు ఇస్తుంది. ఆన్‌లైన్ గేమింగ్ ప్రతికూల ప్రభావాలను సాంకేతిక ఆధారిత నియంత్రణలతో పరిష్కరించవచ్చు న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ఇండియా గేమింగ్ కన్వెన్షన్ 2024 లో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ (ఐటి అండ్ సి) తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ కీలకోపన్యాసం ఇచ్చారు. తెలంగాణ ఏవిజిసి పరిశ్రమను హైలైట్ చేస్తూ అయన ఉపన్యాసం సాగింది. దాదాపు 150 కంపెనీలతో భారీ వృద్ధిని సాధించిందని, దాదాపు 35,000 మందికి ఉపాధి కల్పించిందని ఆయన వెల్లడించారు. భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున వినోద పరిశ్రమకు మద్దతునిచ్చే విఎఫెక్స్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మారిందని ఆయన పేర్కొన్నారు. పూర్తిగా అంకితమైన ఏవిజిసి విధానంతో బయట కు వచ్చిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని ఆయన అన్నారు. 2016 లోనే తాము ఈ విధానం తీసుకువచ్చామంటూ, అధిక-నాణ్యత కలిగిన మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెట్టడం తెలంగాణ ప్రభుత్వానికి ప్రాధాన్యతాం శంగా తెలిపారు. రాబోయే 1.6 మిలియన్ చదరపు అడుగుల సౌకర్యం, ఇమేజ్ టవర్, ఏవిజిసి రంగానికి భాగస్వామ్య సేవలుగా అత్యాధునిక ఉత్పత్తి సౌకర్యాలను అందిస్తుంది అని రంజన్ వెల్లడించారు. గేమింగ్, విఎఫ్ఎక్స్ యానిమేషన్‌లో ప్రతిభావంతులకు శిక్షణ ఇవ్వడానికి సైతం సంస్థలకు స్థలాన్ని ఇమేజ్ టవర్ అందిస్తుంది. ఏవిజిసి రంగాన్ని పెంపొందించడానికి సమిష్టి చర్యలు తీసుకోవడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో మరో కీలకమైన స్తంభం అంటూ, పరిశ్రమ ప్రమాణాలకు సమానంగా దాని ఆట అభివృద్ధి పాఠ్యాంశాలు ఉండేలా ప్రభుత్వం పరిశ్రమ నుండి రెగ్యులర్ ఫీడ్‌బ్యాక్ కోరుతుందని వెల్లడించారు. ఆవిష్కరణలను పెంపొందించాల్సిన అవసరాన్ని రంజన్ చెప్పారు. ఈ రంగంలో అధిక అట్రిషన్ రేట్ల సమస్యను పరిష్కరించడానికి పరిశ్రమలో క్రమశిక్షణను సులభతరం చేయడానికి నిబంధనలను ప్రారంభించటంలో తెలంగాణ విఎఫెక్స్, యానిమేషన్ మరియు గేమింగ్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

భూదాన్ భూములు పేదలకు పంచాలి : ఈటీ నరసింహా

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత కమ్యూనిస్ట్ పార్టీ భూ పోరాటాలకు జడిసి నాటి జాగీర్‌దార్లు, జమీందార్లు, పటేళ్లు, పట్వారీలు ప్రభుత్వానికి దానం చేసిన భూదాన్ భూములు పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టీ నరసింహా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇ.టీ నరసింహా మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షన్నర ఎకరాలకుపైగా భూదాన్ భూములు రికార్డుల్లో నమోదై ఉన్నాయని తెలిపారు. నాటి టీడీపీ ప్రభుత్వంలో అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్ వందల ఎకరాల భూదాన్ భూములను అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే భూదాన్ బోర్డును రద్దు చేసిందని గుర్తు చేశారు. అయితే భూదాన్ బోర్డు రద్దు చేసి సీసీఎల్ఏలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి ఆ భూములను ధరణిలో నిషేధిత జాబితాలో పొందుపరిచిందన్నారు. అంత వరకు బాగానే ఉన్నా అదే బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే వందల ఎకరాల భూదాన భూములు కబ్జాకు గురయ్యాయని వాపోయారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలనే దాదాపు 780 ఎకరాలకు పైగా భూదాన్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా నాగారంలోనే 170 ఎకరాల భూదాన్ భూములను అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ఇతరులకు బదలాయించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై ఈడీ అధికారులు అమోయ్ కుమార్‌ను విచారణ చేయడమే నిదర్శనమన్నారు. భూదాన్ భూములను బదలాయించిన అవినీతి అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. వ్యవసాయ యోగ్యమైన భూదాన్ భూములను బడుగు, బలహీన వర్గాల పేదలకు మూడు ఎకరాల చొప్పున పంచాలని కోరారు. పేద, మధ్యతరగతి ప్రజలకు 150 గజాల చొప్పున కేటాయించి అందులో ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. లేని పక్షంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో భూదాన్ భూములు పేదలకు పంచేవరకు పేదల పక్షాణ పోరాడుతుందని తెలిపారు.

పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఒక స్వప్నం ఫలించిన రోజు అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు యూనివర్సిటీకి ఇంజనీరింగ్, లా కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించినందుకు పాలమూరు యునివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు యూనివర్సిటీకి నిధులు మంజూరు విషయంలో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని యూనివర్సిటీకి రప్పించే ప్రయత్నంలో ఇక్కడ ఉన్న విద్యార్థులు, యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి కూలంకుషంగా చర్చించి సంవత్సరంలో 364 రోజులు ఉద్యమం చెద్దాం కానీ, ఒక్క రోజు ఉద్యమం ఆపి ముఖ్యమంత్రికి సహకరిస్తే, మన యునివర్సిటీకి నిధులు మంజూరు చేసుకొనే అవకాశం ఉంటుంది అని ఒప్పించి, ముఖ్యమంత్రి సభలో ఎలాంటి అలజడి చేరకుండా చాలా క్రమశిక్షణతో నాటి సభను విజయవంతం చేయడం జరిగింది. ఆరోజు ఎంతో విలువైన 18 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి విడుదల చేయడం జరిగింది అని ఆయన గుర్తు చేశారు. పాలమూరు యూనివర్సిటీ ఏ ఒక్కరి కృషి ఫలితమో కాదని, అందరి సమిష్టి కృషి అని, పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి వెనుక ఒక వ్యక్తి లేడని, ఒక శక్తి ఉందని ఆయన అన్నారు.

క్రీడా స్ఫూర్తి కొనసాగించాలి..

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ పట్టణ కేంద్రంలోని క్రీడా మైదానంలో జరిగిన 43వ తెలంగాణ జూనియర్ అంతర్ జిల్లా ఖోఖో పోటీలు ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గత మూడు రోజులుగా జరుగుతున్న 43వ తెలంగాణ జూనియర్ అంతర్ జిల్లా ఖోఖో పోటీలు వల్ల ఎంతో మంది క్రీడాకారులు వారి క్రీడా స్ఫూర్తిని చాటారని ఆయన చెప్పారు. అనంతరం ఖోఖోలో గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, ఖోఖో రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, జిల్లా ఖోఖో సంఘం సభ్యులు విలియం, కురుమూర్తి, శ్రీనివాస్, బాలరాజు పాల్గొన్నారు.

దీపావళి, ఛత్ పూజ పండుగల దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే దీపావళి, ఛత్ పూజ పండుగల సీజన్ దృష్ట్యా, ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తదనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల రద్దీని సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించడానికి అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రయాణీకుల డిమాండ్లను తీర్చడానికి, జోన్ వివిధ గమ్యస్థానాల మధ్య 850 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో 620 ప్రత్యేక రైళ్లు నడపబడినాయి. ఈ సందర్భంగా పండుగ రద్దీని సమర్థవంతంగా నిర్వహించడానికి దక్షిణ మధ్య రైల్వే చేసిన ఏర్పాట్ల గురించి వివరించడానికి బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మీడియా ప్రతినిధుల పర్యటనను ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బాలాజీ కిరణ్, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూ రిటీ కమిషనర్ దేబష్మిత చటోపాధ్యాయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ.శ్రీధర్ మాట్లాడుతూ సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వే స్టేషన్లతో పాటు అన్ని ప్రధాన స్టేషన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, టిక్కెట్ చెకింగ్ సిబ్బందిని పటిష్టం చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 60 మంది ఆర్.పి.ఎఫ్ సిబ్బంది, 20 మంది టిక్కెట్ చెకింగ్ సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించి ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు 24 గంటలూ పని చేస్తున్నారని తెలియజేశారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బాలాజీ కిరణ్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబష్మిత చటోపాధ్యాయలు మాట్లాడుతూ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశామని, నూతన వెయిటింగ్ హాళ్లను ప్రారంభించామని తెలిపారు. ఎలక్ట్రానిక్ బోర్డుల ద్వారా సమాచారాన్ని ప్రదర్శించడంతోపాటు స్టేషన్ అంతటా సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వే ప్రాంగణాలో టపాసు వెంట తీసుకుని వెళ్ళకుండా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక నియంత్రణా చర్యలను చేపడుతోంది. రైలు ప్రయాణీకులు భద్రతకు, రైల్వే ఆస్తులకు నష్టకారిగా పరిణమించే పేలుడు పదార్థాలను, టపాసును మొదలగు నిషేధిత వస్తువులు తీసుకుని వెళ్ళకూడని, ప్రమాదకరమైన వస్తువు మరియు నిషేధిత వస్తువును తీసుకుని వెళ్ళడం రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 164 మరియు 165 ప్రకారం రూ.1000 వరకు జరిమానా లేదా 3 సంవత్సరాల జైలు శిక్ష లేదా రెండూ విధించవచ్చన్నారు. పేలుడు పదార్థాలు ప్రయాణీకులు గమనిస్తే సెక్యూరిటీ హెల్ప్‌లైన్ నెం.139కి కాల్ చేసి తెలపాలని కోరారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - కాప్రా : కాప్రా సర్కిల్ నాచారం డివిజన్ పరిధిలోని ఎరుకల బస్తి మరియు రవీంద్ర నగర్ కాలనీ మురుగునీటి సమస్య పరిష్కారానికి సుమారు 7 లక్షల రూపాయల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులకు బుధవారం ఉప్పల్ నియో జకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డివిజన్ కార్పొరేటర్ శాంతి జన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను దశలవారీగా పూర్తిచేసి నియోజకవర్గాన్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ఎరుకల బస్తీలో మిగిలిన అన్ని డ్రైనేజీ సమస్యలను త్వరలోనే పరిష్కరించి రోడ్లు వేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్ కుమార్, మేనేజర్ సిరాజ్ స్థానిక బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మూసి బాధితుల సమస్యల పరిష్కరానికి

నవంబర్ 4న అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : మూసి బాధితుల సమస్యల శాశ్వత పరిష్కరానికి నవంబర్ 4 న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూసి నది పరివాహక ప్రాంతాల్లో అనేకమంది బడుగుబలహీన వర్గాలవారు అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని, ఇళ్ళు కట్టుకొని కూలి నాలి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని, మూసి నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చితే వారు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ దూకుడు తీరుతో మూసి బాధితులు అనేక మంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. శాశ్వత పునరావాసం కల్పించాకే మూసి బాధితుల ఇళ్ళు కూల్చాలని, డిపిఆర్ ప్రాజెక్టు రిపోర్ట్ తక్షణమే విడుదల, మూసి నది ప్రక్షాళనకు సమగ్ర అధ్యయనం, నిపుణుల సలహాలు సూచనలు, మూసి ప్రక్షాళనపై అఖిలపక్ష కమిటీ వేయడం వంటి డిమాండ్లపై ఈ అఖిలపక్ష సమావేశంలో చేర్చించి పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని, ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలతోపాటు ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు కూడా పాల్గొని తమ పార్టీల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు అందిస్తారని డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - అమనగల్లు : దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా షాపుల నిర్వాహ కులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని అమనగల్లు ఎస్ఐ బి.వెంకటేష్ అన్నారు. బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ, మండల పరిధిలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే ప్రభుత్వ నిబంధనలన్నీ ఖచ్చితంగా పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని నిబంధనలు మీరితే షాపులను సీజ్ చేయనున్నట్టు ఎస్ఐ హెచ్చరించారు. జనావాసాల మధ్య దుకాణాలను ఏర్పాటు చేయరాదని, దుకాణాలలో 18 సంవత్సరాలలోపు పిల్లలను పనికి పెట్టుకోకూడదన్నారు. అదేవిధంగా టపాకాయలు కొనేటప్పుడు ఎవరైనా అక్కడ అగ్నికి సంబంధించిన సిగరెట్ ధూమపానం లాంటివి సేవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణదారులు అందరూ తప్పకుండా ఫైర్ సేఫ్టీ కి సంబంధించిన నివారణ చర్యలలో భాగంగా నీళ్ల బకెట్లు, ఇసుకతో నింపిన బకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని, బాణాసంచాలు కొనుగోలు చేసేటప్పుడు చిన్న పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7, 13, 27 డివిజన్లో 78 లక్షలతో డ్రైనేజీ, సిసి రోడ్లు, ముస్లిం స్మశానవాటిక ప్రహరీ గోడ సింటెక్స్ వాటర్ ట్యాంక్ అభివృద్ధి పనులకు బుధవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అజయ్ యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్లు కాటపల్లి లత రాంచందర్ రెడ్డి, బంధారం అంజలి శ్రీధర్ గౌడ్, దానగల్ల అనిత యాదగిరి, రసాల వెంకటేష్ యాదవ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ హరినాథ్ రెడ్డి, వీరా చారీ, జడిగే మహేష్ యాదవ్, జెన్నే రాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

విశాలాంధ్ర - మొయినాబాద్ : విద్యార్థుల వ్యక్తిత్వం, సమగ్ర వికాసం కోసం క్రీడల పోటీలను స్పోర్ట్స్ మీట్ పేరిట ఎన్టీఆర్ ట్రస్టీ అధ్వర్యంలో నిర్వహించను న్నట్లు ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఎన్టీఆర్ విద్యసంస్థల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్ను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ మహిళల సాధారికత, వారిలోనా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఎన్టీఆర్ ట్రస్టీ చైర్మన్ నారా భువనేశ్వర్ కృతనిచ్చయంతో పనిచేస్తోందని అలాగే విద్యార్థుల వ్యక్తిత్వం, సమగ్ర వికాసం కోసం క్రీడల పోటీలను రంగారెడ్డి జిల్లా స్థాయిలో ఈ ఏడాది నుంచి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వచ్చేనెల 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో జరిగే అన్ని రకాల క్రీడల పోటీలను పాఠశాల, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు క్రీడలు, సంస్కృతీక పోటీలను ఎన్టీఆర్ విద్యసంస్థల అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు అన్ని క్రీడల్లో పాల్గొంటారని ఇంటర్, డిగ్రీ విద్యార్థినీలకు ప్రత్యేకంగా క్రీడల పోటీ లను నిర్వహిం చనున్నట్లు తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బాలీబాల్, పెయిం టింగ్, ర్యాంప్వాక్, రంగోలి, మేహంది, కరాటే ఫుడ్ఫెస్టివల్తో పాటు పలు సంస్కృతీక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు ఆసక్తిగల వారు ఎన్టీఆర్ విద్యసంస్థలో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. 4వ తేది నుంచి ప్రారంభమయ్యే ఈ క్రీడల పోటీల్లో జిల్లాలోని దాదాపు 30 పాఠశాలలకు చెందిన పాల్గొంటారని.. 4వ తేది రోజు తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ నార్మద ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభిస్తారని చెప్పారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎసే. రెడ్డి, రాంచంద్రారెడ్డి, రాజీవ్ రెడ్డి, ఏఓ సురేష్ తదితరులు ఉన్నారు.

అలగనూరుకు మరమ్మతులు

ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్

రిజర్వాయర్‌ను పరిశీలించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-మిడుతూరు: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అలగనూరు రిజర్వాయర్‌కు గండి పడిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బుధవారం నంద్యాల జిల్లా నందికొట్కూర్ నియోజకవర్గం మిడుతూరు మండల పరిధిలోని అలగనూరు రిజర్వాయర్‌ను ముప్పాళ్లతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు వి.రఘురామ్మూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, రమేశ్ పరిశీలించారు. కట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించి, మరమ్మతులు చేపట్టిన రైతులకు సాగు, తాగు నీరు అందించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ అలగనూరు రిజర్వాయర్‌కు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేశారని, 3,585 ఎకరాల భూ సేకరణ చేసి 2.965 టీఎంసీల నీటి సామర్థ్యంతో మూడు మండలాల రైతులకు గ్రామాల ప్రజలకు, నందికొట్కూరు పట్టణానికి నీటి సరఫరా చేసేలా రిజర్వాయర్‌ను నిర్మించారని తెలిపారు. కృష్ణా నది నుంచి కేసీ కెనాల్ ద్వారా నీటిని రిజర్వాయర్‌లో నింపుతున్నారని అన్నారు. అయితే జగన్ పాలనలో రిజర్వాయర్ కట్ట తెగిపోయిందన్నారు. జగన్ బాధ్యతారాహిత్యం వల్ల లక్షా 845 ఎకరాలకు సాగునీరు అందించే రిజర్వాయర్ నీరు లేకుండా ఎండిపోయిందని చెప్పారు. రైతు, వ్యవసాయం అనే పదాలకు అర్థం తెలియని వ్యక్తి జగన్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం రెండు లేదా మూడు కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించి, పనులు చేయించి ఉంటే రిజర్వాయర్ కింద 1.20 లక్షల ఎకరాల భూములు సాగులో ఉండేవని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టులకు, పారిశ్రామీకరణకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోందని, అందులో భాగంగా అలగనూరు రిజర్వాయర్‌కు కట్ట తెగిపోయిన ప్రాంతంలో మరమ్మతులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెలలో చంద్రబాబు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి ప్రాజెక్టుల విషయాలపై చర్చించి పనులు పూర్తి చేయాలని కోరతామన్నారు. ప్రాజెక్టుల పనులు చేపట్టని పక్షంలో ఈ ప్రాంత రైతాంగాన్ని కూడగట్టి సీపీఐ, రైతు సంఘాల అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ అలగనూరు రిజర్వాయర్ ఆనకట్ట 500 మీటర్ల మేర తెగిపోతే జగన్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా పూర్తి చేయాలనే డిమాండ్‌తో సీపీఐ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో హంద్రీనీవాను పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర నాయకులు పరిశీలించారని తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అలగనూరు రిజర్వాయర్‌ను స్వయంగా పరిశీలించి, తెగిపోయిన ఆనకట్ట మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం అభినందనీయమని సీపీఐ నాయకులు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కె.రామాంజనేయులు మాట్లాడుతూ వెనుకబాటుకు గురవుతున్న రాయలసీమ ప్రాంతాన్ని కృష్ణా, తుంగభద్ర నీటితో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగు నీరు అందించి కరువు సీమను సస్యశ్యామలం చేయాలన్నారు. అలగనూరు రిజర్వాయర్ పై ఆధారపడి రెండు వేల మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయని, కట్ట తెగిపోవడంతో వారి జీవితాలు కూడా ఒట్టిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ బృందం వెంట రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, పిక్కిలి వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజితమ్మ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్ తదితరులు ఉన్నారు.

సాగుభూముల పట్టాల కోసం ఉద్యమం

సీహెచ్ కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘాల అధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యక్ష భూ ఆక్రమణోద్యమాల ద్వారా సాధించుకుని అనుభవిస్తున్న సాగు భూములకు పట్టాల సాధన కోసం ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో వందలాది మంది నిరుపేదలు భూ పోరాటం ద్వారా ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న అసైన్డు భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆ భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పడావుగాను, కబ్జాలకు గురైన వివిధ రకాల ప్రభుత్వ భూములు, అసైన్డు భూములను వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ భూ పోరాటాలు నిర్వహించి పేదలకు పంపిణీ చేసిందని, ఆ భూములకు పట్టాలు ఇవ్వటానికి ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. ఎన్నికలప్పుడు శుష్కవాగ్దానాలు చేయడం తప్ప పేదలకు పట్టాలు మాత్రం ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రత్యక్ష భూపోరాట ఉద్యమాలను ఎంత పట్టుదలతో నిర్వహించామో... అంతకంటే రెట్టింపు పట్టుదలతో పట్టాల సాధన కోసం పోరుబాట పట్టక తప్పదన్నారు. అందుకు పేద సాగుదారులు సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావుతో పాటు సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, జి.కొండూరు మండల కార్యదర్శి గూడూరు శ్రీనివాసరెడ్డి, మైలవరం నియోజకవర్గ నాయకులు కన్నా వెంకటేశ్వరరావు, స్థానిక భూపోరాట నాయకులు చింతయ్య, షేక్ రాజ్‌బుడే, దూరు యేసమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

దిల్లీలో నూతన ఏపీ భవన్

11 ఎకరాల్లో నిర్మాణానికి డిజైన్లు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దిల్లీలో నూతన ఏపీ భవన్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది.'రీ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భవన్' పేరుతో డిజైన్లకు టెండర్లు పిలిచింది. రాష్ట్ర విభజన తర్వాత దిల్లీలో ఏపీ భవన్ విభజన జరిగింది. ఎన్నికలకు ముందు రెండు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజన ఖరారు చేశారు. వారి ప్రతిపాదనకు కేంద్ర హోం శాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న భవనాలను రెండు రాష్ట్రాలు వినియోగించుకుంటున్నాయి. కొత్త భవన్ నిర్మాణం చేపట్టాల్సి ఉండంతో ఏపీ ప్రభుత్వం డిజైన్ల ప్రక్రియ మొదలు పెట్టింది. ప్రస్తుతం గోదావరి, స్వర్ణముఖి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడి హౌస్... మూడు చోట్ల నిర్మాణానికి డిజైన్లు ఆహ్వానించింది. మొత్తం 11.53 ఎకరాల్లో ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ డిజైన్లు కోరింది. ఆసక్తి ఉన్న గుత్తేదారులు తమ 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్' ను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. నవంబరు 28 లోపు తమ ప్రతిపాదనలు సమర్పించాలని రహదారులు, భవనాల శాఖ విజయవాడ సర్కిల్ ఎస్ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కాగా, దిల్లీ అశోకా రోడ్డుతో పాటు మాధవరావు సింధియా మార్గ్‌లో కలిపి రెండు రాష్ట్రాలకు 19.733 ఎకరాల భూమి ఉంది. ఇందులో తెలంగాణ వాటాగా 8.245 ఎకరాలు, ఏపీ వాటాగా11.536 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు శబరి బ్లాక్‌లో 3.00 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 5.245 ఎకరాలు కేటాయించారు. అలాగే ఏపీకి 5.781 ఎకరాల్లో ఉన్న గోదావరి బ్లాక్, స్వర్ణముఖి బ్లాక్‌ను కేటాయిస్తూ నిర్ణయించారు. అలాగే ఏపీకి నర్సింగ్ హాస్టల్‌లో 3.359 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 2.396 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రతిపాదనలను రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఆస్తుల పంపకం కొలిక్కి రాకపోవడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపింది.

రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా

4,11, 20 తేదీల్లో నిరసనలు

జయప్రదానికి ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నవంబరు 4న రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల ఎదుట రైతాంగ సమస్యలపై వినతి పత్రాలు అందజేస్తామని, 11న మండల స్థాయిలో నిరసనలు చేపడతామని, 20న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. నెల్లూరులోని రైతు సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదాతల ఖాతాల్లో రూ.20 వేలు జమ చేస్తామన్న హామీ ఏమైందని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ సాయం అందక రైతులు అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ప్రభుత్వ లక్ష్యమని, గత ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం కాకుండా ఇచ్చిన హామీలు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2000 కోట్లు మంజూరు చేసినా... నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాలో లక్షలాది ఎకరాల సాగుకు వీలవుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రానున్న బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకుతో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. పోలవరం ఒక్కటే కాదు రాయలసీమ-ఉత్తరాంధ్ర ప్రాంతాలలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపైనా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షావ్నాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్నా పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణకు ప్రత్యేక కమిటీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ధరల స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ చైర్మన్‌గా, జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయి కమిటీలో 21 మంది సభ్యులు, జిల్లా స్థాయిలో 17 మంది సభ్యులు ఉంటారు. ఈ కమిటీలు ధరల స్థిరీకరణకు కావాల్సిన అంశాలను ప్రభుత్వానికి సూచించనున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణయం అంశంలోనూ ఈ కమిటీల సూచనలిస్తాయి. ఆయా సమస్యలపై స్పందించడానికి కావాల్సిన విధివిధానాలను ప్రభుత్వానికి ఈ కమిటీలు ప్రతిపాదిస్తాయి. రాష్ట్ర కమిటీలో సంబంధిత శాఖల కార్యదర్శులు, తూనికలు కొలతల అధికారులు ఉంటారు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. బియ్యం, వంట నూనెలు అందుబాటులోకి రావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో తరహాగానే ధరలు పెరిగిపోతున్నాయి. కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడం లేదు. ఇటీవల వరకు టమాటా, ఉల్లి ధరలు భారీగా పెరిగిపోయాయి. మార్కెట్ ధరలకు దగ్గరగా రైతు బజార్లలోనూ కూరగాయల ధరలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తక్కువ ధరకు రైతు బజార్లలో కందిపప్పు, పామాయిల్ తదితర ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అవి పూర్తిగా కార్యరూపం దాల్చలేదు. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు వచ్చే నెలవారీ ఆదాయంలో సగం నిత్యావసరాల కొనుగోలుకే సరిపోతోంది. ధరల అదుపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ధరల స్థిరీకరణ కమిటీ వేయాలని అనేక సార్లు వామపక్ష పార్టీలు సూచించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలతో కలసి నిరసనలు చేపట్టాయి. దీంతో ప్రభుత్వం దిగి వచ్చి ధరల స్థిరీకరణ కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది.

క్లిష్టదశలో భారత ఆర్థిక పరిస్థితి

జైరాం రమేశ్ హెచ్చరిక

న్యూదిల్లీ: భారత్ కొన్ని సంవత్సరాలుగా అత్యంత ప్రమాదకరమైన, కష్టతరమైన ఆర్థిక పరిస్థితిలో ఉందని కాంగ్రెస్ విమర్శించింది. వేతనాల్లో అనిశ్చితి, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు దేశంలో వినియోగ వృద్ధిని దెబ్బతీస్తున్నాయని తెలిపింది. ఈ చెక్‌పాయింట్లను తీవ్రంగా పరిగణించకపోతే రాబోయే కాలంలో వృద్ధిని అడ్డుకుంటాయని కాంగ్రెస్ ప్రధాన కర్యాదర్శి. జైరాం రమేశ్ హెచ్చరించారు. మూడు దశాబ్దాలుగా భారతదేశ వినియోగ వృద్ధిలో పెరుగుదల ఉందని, కోట్లాది కుటుంబాలు పేదరికాన్ని అధిగమించి మధ్యతరగతిలోకి ప్రవేశించాయని అన్నారు. దీంతో కొత్తగా ఉత్పత్తులు కొనుగోలు చేయగలరు, ఆస్తులు పొందగలరు అని అన్నారు. ఇది ఆర్థిక వృద్ధికి నిదర్శనమని, వేగంగా అభివృద్ధి చెందుతూ, దాని లాభాలను విస్తృతంగా పంపిణీ చేస్తుందని చెప్పారు. అయితే గత పదేళ్లలో భారతదేశ వినియోగ కథ తిరోగమనంలో ఉందని, భారత ఆర్థికవ్యవస్థకు అతిపెద్ద అడ్డంకులుగా మారాయని అన్నారు. భారతదేశంలో మధ్యతరగతి కుచించుకుపోతుందని అన్నారు. ఆర్థిక వృద్ధి క్షీణించడానికి వేతనాల్లో స్తబ్దత, అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలని పేర్కొన్నారు. ఇటీవల విడుదల చేసిన పరిశ్రమల వార్షిక అధ్యయనం (ఏఎస్ఐ) 2022-2023 ప్రభుత్వ అధికారిక గణాంకాలతో పాటు అనేక సర్వేలు ఇదే విషయాన్ని పేర్కొంటున్నాయని అన్నారు. కార్మికులు పదేళ్ల క్రితం కంటే ఈ రోజు తక్కువ కొనుగోలు చేయగలుగుతున్నారని స్పష్టమైన ఆధారాలు చూపుతున్నట్లు తెలిపారు. ఈ వేతనాల్లో స్తబ్దత భారత్‌లోని కార్మికుల ఉత్పాదకత క్షీణతకు కారణం కావచ్చని, కార్మిక ఉత్పాదకత పడిపోవడం, నిజమైన వేతనాలు స్తబ్దుగా ఉండటంతో కుటుంబాల వినియోగానికి అతి తక్కువ ఆదాయన్ని వెచ్చిస్తారని అన్నారు. 2015లో ఓ సాధారణ వ్యక్తి రూ.100 కొనుగోళ్లకు వెచ్చిస్తే... దానిలో 18 శాతం పరిశ్రమల యజమానికి చెల్లించేవాడు. కానీ నేడు... అదే యజమానికి లాభాలలో రూ.36 చెల్లిస్తున్నాడని అన్నారు. వస్తువుల, సేవల ధరల్లో తీవ్రమైన పెరుగుదల కొనుగోళ్లను పెంచే సామాన్యుడి సామర్థ్యాన్ని, ప్రత్యేకించి స్తబ్దుగా ఉన్న వేతనాలను తగ్గించిందని అన్నారు. ఆర్థిక వృద్ధికి ప్రధాన సూచిక అయిన గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల అమ్మకాలు 2018తో పోలిస్తే తక్కువగానే ఉన్నాయని అన్నారు.

ఇజ్రాయిలీ పబ్లిషర్ల బహిష్కరణ

వెయ్యి మందికిపైగా ప్రఖ్యాత రచయితల పిలుపు

న్యూదిల్లీ: పలస్తీనియన్లపై దురాగతాలను సమర్థించే ఇజ్రాయిల్‌కు చెందిన పబ్లిషర్లను సామూహికంగా బహిష్కరించాలంటూ వెయ్యి మందికిపైగా రచయితలు పిలుపునిచ్చారు. ఈ రచయితల్లో నోబెల్, బుకర్, పులిట్జర్‌తో పాటు జాతీయ పుస్తక అవార్డుల గ్రహీతలు ఉన్నారు. ఇజ్రాయిల్ చరిత్రలో ఈ విధంగా వ్యవస్థలను ప్రఖ్యాత రచయితలు సామూహికంగా బహిష్కరించడం ఇదే మొదటిసారి. పలస్తీనా ప్రజలపై దురాగతాలను సమర్థించిన పబ్లిషర్ల బహిష్కరణకు సాలీ రూనే, యానీ ఎర్నౌక్స్, అరుంధతి రాయ్, పంకజ్ మిశ్రా, కమిలా షమ్సీ, ఝుంపా లాహిరి, మోసీన్ హమీద్, రేచల్ కుష్నెర్, జుడిత్ బట్లర్, మిచ్చెలీ అలెగ్జాండర్, పెర్సివల్ ఎవరెట్, మ్యాక్స్ పోర్టర్, ఓషియన్ వ్యూంగ్, వియట్ న్యూగెన్ వంటి వారున్నట్లు పలస్తీనా సాహిత్య ఉత్సవం విడుదల చేసిన ప్రకటక వెల్లడించింది. పలస్తీనా పౌర సమాజం (రచయితల సంఘాలు, కార్మిక సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు) 20 ఏళ్ల కిందట మొదలు పెట్టిన ప్రచారోద్యమంలో ఈ రచయితలు భాగస్వాములయ్యారని పేర్కొంది. ఇజ్రాయిల్ దుశ్చర్యలపై పబ్లిషింగ్ పరిశ్రమ మౌనాన్ని ప్రకటన ప్రశ్నించింది. పలస్తీనా రచయితులు, మేధావుల మరణాలపై స్పందించకపోవడాన్ని ఆక్షేపించింది. పలస్తీనాలో గ్రంథాలయాలు, ముద్రణాలయాలు, ప్రచురణ సంస్థలను ఇజ్రాయిల్ నాశనం చేసినా మౌనం వీడకపోవడాన్ని దుయ్యబట్టింది. పలస్తీనాలో స్కూళ్లు, యూనివర్సిటీలు, లైబ్రరీలు, ఆర్కైవ్‌ల విధ్వంసాన్ని ప్రశ్నించకపోవడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ మౌనం ఇజ్రాయిల్ సైనిక చర్యలకు మద్దతు తెలుపడమే అంటూ రచయితలు అసహనం వ్యక్తంచేశారు. తమది సంఘీభావ సంఘాల సంకీర్ణమని ప్రకటించుకున్నారు. 98 ఇజ్రాయిలీ పబ్లిషర్లను గుర్తించి, పరిశోధించిన తర్వాతే వాటిని బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

దేవుడిలా భావిస్తే... ఎగతాళి చేస్తారా?

శరద్‌పవార్‌పై అజిత్ ఎదురుదాడి

ముంబై: మహారాష్ట్రలో శరద్ పవార్, అజిత్ పవార్ మధ్య విమర్శలు తారస్థాయికి చేరాయి. ఎన్‌సీపీ(ఎస్పీ) అధినేత శరద్‌పవార్ విమర్శలపై తాజాగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ విచారం వ్యక్తం చేశారు. ఆయన వ్యంగ్యంగా స్పందించడం బాధించిందని అజిత్ అన్నారు. 'నేను శరద్‌పవార్‌ను దేవుడిలా భావిస్తున్నాను. ఆయన మాత్రం కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకుంటూ నా ప్రసంగాన్ని వెక్కిరించారు. ఎవరో చిన్న నేతలు అలా చేస్తే పట్టించుకోను...కానీ ఆయనలాంటి అనుభవజ్ఞుడు నన్ను ఎగతాళి చేయడం చాలామందికి నచ్చలేదు. ఓ కార్యక్రమంలో అమ్మపేరు చెప్పగానే నేను ఉద్వేగానికి గురయ్యాను. కన్నీరొచ్చింది. అది సహజం. కొన్నిసార్లు అలా జరుగుతుంది. రాజ్ ఠాక్రే మాత్రమే ఇలా అనుకరిస్తారని నేను అనుకునేవాడిని. కానీ శరద్ పవార్ కూడా అలాగే ప్రవర్తించారు' అని అజిత్ ఆవేదన చెందారు. ఓ కార్యక్రమంలో ఉద్వేగానికి గురైన అజిత్ పవార్ కర్చీఫ్ తీసుకొని ముఖం తుడుచుకున్నారు. దానిని శరద్ పవార్ కూడా రిపీట్ చేసి... అజిత్‌పై విమర్శలు గుప్పించారు. అలాగే తన సోదరుల సహకారంతోనే పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టగలిగానని, వారి పిల్లల పట్ల ఎప్పుడూ వివక్ష చూపలేదని శరద్ పవార్ అన్నారు. పార్టీలో ఉన్న కొంతమంది నేతలకు ఉన్నత పదవులు ఇచ్చినా... తన కుమార్తె సుప్రియా సూలేకు ఒక్క పదవి కూడా అప్పగించలేదని పేర్కొన్నారు. తాను స్థాపించిన ఎన్‌సీపీ గుర్తును తనకు కాకుండా చేసి కోర్టుకు లాగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలుపొంది నాలుగుసార్లు డిప్యూటీ సీఎంగా పనిచేసినా అజిత్ పవార్‌కు పదవిపై కాంక్ష తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి పదవి దక్కించుకోవడానికి ఆయన ఇతరులతో చేయి కలపడాన్ని ప్రశ్నించారు. నాలుగుసార్లు పదవిలో ఉండి... ఒక్కసారి పదవి లేకపోతే దానికోసం కుటుంబాన్ని చీల్చుతారా అని తీవ్రంగా మండిపడ్డారు.

గూగుల్ కోడింగ్‌లో ఏఐ: సుందర్ పిచాయ్

న్యూదిల్లీ: గూగుల్‌లో 25 శాతానికిపైగా కోడింగ్ కృత్రిమ మేధ(ఏఐ)తోనే జరుగుతున్నట్లు ఆ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు. గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడుతోందన్నారు. కోడ్‌ను ఇంజినీర్లు సమీక్షిస్తున్నప్పటికీ కృత్రిమ మేధ వినియోగం పెరిగిందని చెప్పారు. గూగుల్ మూడో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన సందర్భంగా ఏఐ గురించి ఆసక్తికర విషయాలను ఆయన తన బ్లాగ్‌లో పంచుకున్నారు. ఏఐ సాయంతో కోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా.. సమయాన్ని తగ్గించి, ఆవిష్కరణల విషయంలో వేగం పెంచడమే సంస్థ లక్ష్యమని సుందర్ పిచాయ్ తెలిపారు. 'కృత్రిమ మేధ ఆధారిత కోడింగ్ ప్రక్రియ... సంస్థ కార్యకలాపాల క్రమబద్ధీకరణలో ఓ భాగం. జెమినీ వంటి కొత్త నమూనాలను మరింత వేగంగా తీసుకొచ్చేలా పరిశోధన, మెషిన్ లెర్నింగ్, భద్రతా విభాగాలతో పాటు ఆయా వేదికలు, పరికరాలకు చెందిన సిబ్బందిని ఏకం చేసింది' అని వెల్లడించారు. గిట్‌హబ్ కో-పైలట్ ద్వారా జెమినీని అందుబాటులో తెచ్చినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డెవలపర్లకు ఏఐ పరికరాలు అందుబాటులోకి తేవడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. 'వీడియో ఏఐ'పైనా పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు. యూట్యూబ్‌లో వీడియోల సృష్టికి 'వియో'ను తేనున్నట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు. ఇదిలావుంటే, గూగుల్ మాతృసంస్థ ఆల్ఫబెట్ మూడో త్రైమాసికంలో 88.3 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. సెర్చ్ ఇంజిన్ ఆదాయం 13 శాతం మేర పెరిగింది.

రైళ్లల్లో ఉల్లి సరఫరా

న్యూదిల్లీ: ఉల్లి ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా రైలు మార్గంలో రవాణా పెరగనుంది. ఈనెల 20న 'కాందా (ఉల్లి) ఎక్స్‌ప్రెస్' ద్వారా 1,600 టన్నులు దిల్లీకి చేరాయి. ఇప్పుడు మరోమారు మేజర్ 'రైల్ డెలివరీ'కి ప్రభుత్వం సిద్ధమైంది. 840 టన్నుల బఫర్ ఉల్లిని రైలు ద్వారా దిల్లీలోని కిషన్‌గంజ్ రైల్వే స్టేషన్‌కు చేర్చింది. ఈ మేరకు బుధవారం విడుదలైన అధికారిక ప్రకటన తెలిపింది. కిలో రూ.35 రీటైల్ ధరకు ఆజాద్‌పూర్ మండీ నుంచి విక్రయాలు మొదలవుతాయని పేర్కొంది. సరఫరా చేసిన ఉల్లిని నాఫెడ్ నుంచి సేకరించినట్లు వెల్లడించింది. దేశ రాజధానిలో ప్రస్తుతానికి కిలో ఉల్లి రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. ప్రాంతం, నాణ్యతను బట్టి ధర ఉంటోంది. నాఫెడ్ ద్వారా ఈనెల 26న 840 మెట్రిక్ టన్నుల ఉల్లి చెన్నైకు చేరింది.

45.72 మీటర్ల ఎత్తులోనే 'పోలవరం'

జలవనరుల మంత్రి రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, గతంలో తాము ప్రతిపాదించినట్లుగా 150 అడుగుల మేర నీటి నిల్వ ఉండే విధంగా 45.72 మీటర్ల ఎత్తులోనే ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రెండు ఫేజులు అంటూ పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు కుదించిన ఘనత గత ప్రభుత్వానిదేనని తప్పుపట్టారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును రెండు ఫేజుల్లో నిర్మిస్తామంటూ ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు తగ్గించి పోలవరం ప్రాజెక్టు అథారిటీకి అనేక మార్లు ప్రతిపాదనలు పంపిన గత ప్రభుత్వం...ఆ బురదను తమ ప్రభుత్వంపై రుద్దే విధంగా దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 2022 జనవరిలో పోలవరం ప్రాజెక్టు ఫేజ్- 1 అంటూ 41.15 మీటర్ల ఎత్తున ప్రతిపాదిస్తూ అప్పటి స్పెషల్ సి.ఎస్. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓకు లేఖ రాస్తూ రూ.10,911.15కోట్ల మేర నిధులు కావాలని కోరడం జరిగిందని... తదుపరి జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీఈ తదితరులు కూడా అనేక మార్లు లేఖలు రాశారని తెలిపారు. వాటిలో పోలవరం ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లు అంటూ ప్రత్యేకంగా రాశారన్నారు. 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ పోలవరం ప్రాజెక్టును ఫేజ్-1, ఫేజ్ 2 గా ఎప్పుడూ విభజించలేదన్నారు. సుప్రీంకోర్టు, గోదావరి ట్రిబ్యునల్ అనుమతించిన మేరకు 150 అడుగుల మేర నీటిని నిల్వ చేసే విధంగా 45.72 మీటర్ల ఎత్తున ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.55,545 కోట్లకు సాంకేతిక సలహా కమిటీ (టెక్నికల్ అడ్వైజరీ కమిటీ) ఆమోదాన్ని కూడా పొందడం జరిగిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో ఏమాత్రం రాజీ పడబోదని, నూటికి నూరు శాతం 45.72 మీటర్ల ఎత్తున ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అయితే గత ప్రభుత్వం ఫేజ్- 1లో పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకు ప్రతిపాదించిన విధంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ క్రింద నిధులు విడుదల అవుతాయన్నారు. కానీ ఫేజ్-2 లో మాత్రం 45.72 మీటర్ల మేర ప్రాజెక్టు ఎత్తుకు అనుగుణంగా రూ.30 వేల కోట్లు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులు అవసరం అవుతాయని తాము ప్రతిపాదించామన్నారు.

పోలవరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే 2020 లో వచ్చిన వరదల వల్ల దయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం కూడా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. 2014-19 మధ్య కాలంలో తమ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.11,762 కోట్లు ఖర్చు చేస్తే కేవలం రూ.6,764 కోట్లు మాత్రమే కేంద్రం నుండి రీయింబర్స్‌మెంట్ రూపేణా వచ్చాయన్నారు. అయితే గత ప్రభుత్వం కేవలం రూ.4,167 కోట్లను మాత్రమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వెచ్చించిందని, అయితే కేంద్రం నుండి రూ.8,382 కోట్లు రీయింబర్స్‌మెంట్ రూపేణా నిధులు వస్తే అందులో రూ.3,385 కోట్లను గత ప్రభుత్వం మళ్లించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఫేజ్-1 ప్రతిపాదించిన విధంగా కేంద్రం నుండి రూ.12,250 కోట్ల నిధులు ఈ మధనే అందాయని, అదే గత ప్రభుత్వ హయాంలో వచ్చినట్లయితే... ఈ నిధులను కూడా మళ్లించడం జరిగేదన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.